ప్రజాపక్షం
7th ANNIVERSARY
22nd October, 2025

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

అక్రమ వలసదారుల అంశంపై ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు 05
ఆధార్ పౌరసత్వానికి ఆధారం కాదు : సుప్రీంకోర్టు

హాంగ్‌కాంగ్ అగ్ని ప్రమాదంలో 02
70 మందికి చేరిన మృతుల సంఖ్య

సంపుటి 09, సంచిక: 02 | శుక్రవారం | 28-11-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## 'సిపిఐ శత వార్షికోత్సవాల భారీ బహిరంగ సభ'

# జనవరి 18వ తేదీకి వాయిదా

ప్రజాపక్షం/హైదరాబాద్




గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో డిసెంబర్ 26న ఖమ్మంలో తలపెట్టిన 'సిపిఐ శత వార్షికోత్సవాల భారీ బహిరంగ సభ'ను జనవరి 18వ తేదీకి వాయిదా వేసినట్టు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబ శివ రావు వెల్లడించారు. ఈ మేరకు సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ అధ్యక్షతన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు కూనంనేని సాంబశివ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ బహిరంగ సభకు దేశ నలుమూలల నుండి ఐదు లక్షల మంది పాల్గొంటున్నారని, సిపిఐ జాతీయ సమితి ఆధ్వర్యంలో దేశ వ్యాపితంగా జాతాలు, వివిధ కార్యక్రమాలను రూపొందించామని వివరించారు.

**గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్, సిపిఐ 'సీట్ల' సర్దుబాటు**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో సాధ్యమైన వరకు కాంగ్రెస్, సిపిఐ సీట్ల సర్దుబాటు పట్ల అవగాహన కుదుర్చుకుని పోటీ చేయాలని, సిపిఐ, సిపిఐ(ఎం) పరస్పర పోటీని నివారించాలని నిర్ణయించినట్టు కూనంనేని సాంబశివ రావు తెలిపారు.గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ సాధ్యమైన ఎక్కువ సీట్లలో గెలువాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ విద్యార్థులపై మోపిన ఉపా చట్టాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. హిడ్మా ఎన్ కౌంటర్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో విద్యార్థులు ఆందోళన చేపట్టడం పట్ల కేంద్ర ప్రభుత్వం 'ఉపా' చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గమైన చర్య అని దుయ్యబట్టారు. దేశ వ్యాపితంగా లక్షలాది మంది హిడ్మా ఎన్ కౌంటర్‌ను వ్యతిరేకించారని, వారందరిపైన కూడా ఇలాంటి నల్ల చట్టాలను ప్రయోగించి, ఎంత మందిని జైలులో పెడుతారని ప్రశ్నించారు. విద్యార్థులపై నమోదు చేసిన 'ఉపా' చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికలకు

# నామినేషన్‌లు షురూ

ప్రజాపక్షం/హైదరాబాద్


ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలో..


రాష్ట్రంలో గ్రామాపంచాయతీ ఎన్నికల నామినేషన్‌ల పర్వం మొదలైంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ నేతృత్వంలో 'ఎన్నికల ప్రవర్తన నియమావళి స్క్రీనింగ్' కమిటీ ఏర్పాటు చేశారు. ఈసారి ఫిర్యాదుల స్వీకరణకు రాష్ట్ర ఎన్నికల సంఘం టియాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. తద్వారా ఓటరు, పోలింగ్ బూత్ వివరాలను తెలుసుకోవచ్చు. అలాగే ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించి ఫిర్యాదు కూడా చేయవచ్చు. ఈ నేపథ్యంలో న్యాయపరమైన ఇబ్బందులను అధిగమించేందుకు పంచాయతీ గ్రామీణాభివృద్ధి శాఖలో ప్రత్యేకంగా లీగల్ సెల్‌ను కూడా ప్రారంభించారు. పంచాయతీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అన్ని రాజకీయ పార్టీలు సైతం గెలుపు గుర్రాల వెటలో పడ్డాయి. ఎన్నికల్లో గెలుపు

తరువాయి 2లో

### గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరేట్‌లో

## ప్రత్యేక లీగల్ సెల్

### అందుబాటులోకి టి-పోల్ యాప్




సర్పంచులు, వార్డు మెంబర్ల ఎన్నికల కోసం నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో పంచాయతీ గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనరేట్‌లో ప్రత్యేక లీగల్ సేల్ ఏర్పాటు చేశారు. ముగ్గురు సూపరిడెంట్ స్థాయి అధికారులతో లీగల్ సెల్ ఎన్నికల్లో రిజర్వేషన్‌లను సవాల్ చేస్తూ కోర్టులలో పలు పిటిషన్‌లు దాఖలైన నేపథ్యంలో లీగల్ సెల్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. ఎన్నికలు నిర్థిష్ట కాలపరిమితిలో పూర్తిచేసే విధంగా, ఎన్నికల ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలగకుండా వెంటనే చర్యలు తీసుకునేలా జిల్లాలతో లీగల్ సెల్ సమన్వయం చేయనుంది. రాష్ట్రంలో అన్ని జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికెఅరులు, జిల్లా పంచాయతీ అధికారులు కేసులకు సంబంధించి వివరాలు, సూచనలు 24 గంటల్లోపు అదనపు అడ్వకేట్ జనరల్, ప్రభుత్వ పీడర్‌కి నివేదించాలని ఆదేశారలు జారీ చేశారు. ప్రతి జిల్లాలో కోర్టు కేసులను పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారిని

తరువాయి 2లో

# ఒకరిపై మరొకరి పోటీ వద్దు

### గ్రామ పంచాయతీ ఎన్నికలలో పరస్పర అవగాహనతో ఉండాలని సిపిఐ, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుల సంయుక్త సమావేశం నిర్ణయం

ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రామ పంచాయతీ ఎన్నికలలో సిపిఐ, సిపిఐ(ఎం) పరస్పర అవగాహనతో ఒకరిపైన మరొకరు పోటీ చేయకుండా ఉండాలని సిపిఐ, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుల సంయుక్త సమావేశం నిర్ణయం తీసుకున్నది. హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన సిపిఐ, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సంయుక్త సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ సీనియర్ నాయకులు చాడ వెంకట్ రెడ్డి,

తరువాయి 2లో



## తొలి ప్రైవేటు 'స్కైరూట్' వాహకనౌక

### విక్రమ్-1ను ఆవిష్కరించిన ప్రధాని మోదీ

**హైదరాబాద్:** హైదరాబాద్ కేంద్రంగా వెలిసిన అంతరిక్ష అంకురసంస్థ 'స్కైరూట్ ఇన్‌ఫినిటీ క్యాంపస్'ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం దృశ్యమాధ్యమ విధానం ద్వారా ప్రారంభోత్సవం చేశారు. దేశ ప్రైవేటు రంగంలో రూపొందించిన మొట్టమొదటి ఆర్బిట్ రాకెట్ (అంతరిక్ష వాహకనౌక) విక్రమ్-1 ను ఆవిష్కరించి ప్రపంచానికి పరిచయం చేశారు. జనరేషన్ -జెడ్ వృత్తి నిపుణులు దేశంకోసం సరికొత్త సాంకేతికతను సృష్టిస్తున్నారని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. స్కైరూట్ కంపెనీకి చెందిన ప్రతిష్టాత్మకమైన తొలి ప్రైవేటు

తరువాయి 12లో




# రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం

### పార్టీలకు అతీతంగా కలసిరావాలి : ఎంపీలతో భేటీలో ఉపముఖ్యమంత్రి భట్టి

ప్రజాపక్షం/హైదరాబాద్

''తెలంగాణ రాష్ట్రంలో వెనుబడిన తరగతుల (బిసి) కు సంబంధించిన 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో సవరణ జరగాలి. ఈ అంశంపై రాష్ట్రానికి చెందిన అన్ని పార్టీల ఎంపిలు కలిసి ఒక వినతి పత్రాన్ని ప్రధానమంత్రికి ఇవ్వాలి. ప్రధాన మంత్రి సమయం ఇస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఢిల్లీకి వచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించాలి'' అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బిసిల రిజర్వేషన్‌కు సంబంధించి రాష్ట్రంలో ఎపిక్ సర్వే జరిగిందని, ఎంపిరికల్ డాటా ఆధారంగా అసెంబ్లీలో బిసిల రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టగా పార్టీలకు అతీతంగా ఏకగ్రీవంగా ఆమోదించారని, బిల్లు గవర్నర్ నుంచి కేంద్రానికి వెళ్లి అక్కడ పెండింగ్‌లో ఉందని ఎంపిలకు వివరించారు. రాష్ట్ర ప్రయోజనాలకు అనుకూలంగా పార్లమెంట్ సభ్యులు అందరూ పార్టీలకు అతీతంగా ఒక బృందంగా ఏర్పడి ప్రధానమంత్రికి, కేంద్ర మంత్రులకు విజ్ఞప్తులు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారని డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క చెప్పారు. కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పార్లమెంట్ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని గురువారం ప్రజాభవన్‌లో నిర్వహించారు. సమావేశంలో కాంగ్రెస్ ఎంపిలు మల్లు రవి, బలరాం నాయక్, సురేష్ షెట్కార్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, రామసహాయం రఘురామ్ రెడ్డి, కడియం కావ్య, గడ్డం వంశీ, ఎం.అనిల్‌కుమార్ యాదవ్, బిజెపి ఎంపి రఘునందన్ రావు, నగేష్ పాల్గొన్నారు. పార్లమెంట్‌లో ప్రస్తావించాల్సిన అంశాలపై వారితో చర్చించారు. మొత్తం 12 శాఖలకు సంబంధించిన 47 అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు నేతృత్వంలో ఉన్నతాధికారులు వివరించారు. సమావేశంలో డిప్యూటీ సిఎం మాట్లాడుతూ వెనుబడిన తరగతుల (బిసి) కు సంబంధించిన 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో సవరణ అంశాన్ని పార్లమెంటు సమావేశాల్లో ప్రత్యేకంగా చర్చకు తీసుకురాలని, నిర్దేశిత ఫార్మాట్‌లో వాయిదా తీర్మానం లేదా ప్రశ్నోత్తరాల సమయంలో చర్చకు తీసుకురావాలని సూచించారు.

**సమాచారం కోసం ఢిల్లీలో ప్రత్యేక విభాగం ఏర్పాటు**

పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఎంపిలు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత తొందరగా అందించేందుకు ఢిల్లీలో ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశామని, ఈ విభాగాన్ని ఎంపిలు వినియోగించుకోవాలని డిప్యూటీ సిఎం ఎంపిలను కోరారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో ప్రభుత్వ శాఖలు ఏ విధంగా పూర్తి సంసిద్ధంగా ఉంటాయో, పార్లమెంటు సమావేశాల సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగం పూర్తి సంసిద్ధంగా ఉండి సమాచారం అందించేందుకు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రానికి సంబంధించిన ఎవరైనా ఎంపిలు


తరువాయి 2లో

## చైనా, జపాన్‌ల స్థాయి

# అభివృద్ధే టార్గెట్

### ప్రపంచంతోనే పోటీపడేలా స్కిల్ యూత్

- కొత్త రంగాల్లో, కొంగొత్త మార్గాల అన్వేషణ
- మూడు రీజియన్లుగా రాష్ట్ర ఆర్థికాభివృద్ధి
- తెలంగాణ రైజింగ్ 2047 సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- అభివృద్ధిని ప్రతిబింబించేలా తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్ : అధికారుల పవర్ పాయింట్ ప్రజెంటేషన్



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ అభివృద్ధిని ప్రతిబింబించేలా 'తెలంగాణ రైజింగ్2047 పాలసీ డాక్యుమెంట్' ఉండాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. 2034 నాటికి 1 ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు స్పష్టమైన రోడ్ మ్యాప్ పాలసీ డాక్యుమెంట్‌లో కనిపించాలన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని మూడు రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేసుకోవాలని, కోర్ అర్బన్ రీజియన్ ఎకానమి ( క్యూర్), పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీ ( ప్యూర్),

తరువాయి 12లో



### భారత్- అఫ్ఘనిస్థాన్

## దుష్ప్రచారం చేశాయ్

### ఇమ్రాన్‌ఖాన్ కస్టడీ హత్య వార్తలకు పాక్ ఖండన

**రావల్పిండి:** మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ జైలు కస్టడీలో హత్యకు గురయ్యారన్న వార్తలను పాకిస్థాన్ తీవ్రంగా ఖండించింది. ఆయన క్షేమంగానే ఉన్నారని వివరణ ఇచ్చింది. అఫ్గనిస్థాన్- భారత్ మీడియా ఈ దుష్ప్రచారం చేశాయని ఆ దేశ సమాచార ప్రసారాల మంత్రిత్వశాఖ విమర్శించింది. ఆ శాఖ నిజనిర్ధారణ విభాగం అధికారి ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెట్టారు. ఈ రెండు దేశాల మీడియాలో ఇమ్రాన్‌ఖాన్ కస్టోడియల్ హత్యపై 46 నిమిషాలు మాత్రమే ప్రచారం జరిగిందని, వారు స్వతంత్ర పద్ధతులలో రిపోర్టింగ్ చేయకుండా సమన్వయంతో ఈ దుష్ప్రచారం చేశారని దాన్నిబట్టే అర్థమవుతోందని సంబంధిత శాఖ విమర్శించింది. 2013, 2022 కాలంనాటి ఇమ్రాన్‌ఖాన్ ఫొటోలను

తరువాయి 12లో




## రాష్ట్ర అభివృద్ధిలో ఆర్ అండ్ బి

# కీలక భూమిక

- విజన్ 2047 అనుగుణంగా ప్రణాళికలు చేయాలి
- గ్లోబల్ సమ్మిట్‌లో ప్రజెంటేషన్ : మంత్రి కోమటిరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర అభివృద్ధిలో ఆర్అండ్‌బి శాఖ కీలక భూమిక వహిస్తున్నదని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని ఆర్అండ్‌బి ప్రధాన కార్యాలయంలో గురువారం విజన్ 2047పై మంత్రి సంబంధిత అధికారులతో సుదీర్ఘ సమీక్ష సమావేశం

తరువాయి 2లో

### వక్ఫ్ భూముల వివాదంలో..

## మునంబం నివాసితుల హక్కులకు ఎలాంటి హానీ జరుగదు

- కేరళ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం హామీ
- బాధిత ప్రజల నుండి పన్నును స్వీకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వెల్లడి



**కొచ్చి :** వక్ఫ్ ఆస్తిగా చెప్పుకునే తమ భూమిపై యాజమాన్యాన్ని పొందేందుకు పోరాడుతున్న ప్రజల హక్కులకు ఎటువంటి హానీ జరగదని కేరళ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం హామీ ఇచ్చారు. మునంబం నివాసితుల నుండి భూమి పన్నును స్వీకరించాలని కేరళ రాష్ట్ర ప్రభుత్వాన్ని కేరళ హైకోర్టు ఇటీవల ఆదేశించిన తర్వాత బినోయ్ విశ్వం ఈ విషయమై భరోసా ఇచ్చారు. ఆయన గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. 'మునంబం ప్రజల హక్కులు పూర్తిగా పొందే వరకూ వారితో కలిసి పనిచేస్తామని కమ్యూనిస్టు పార్టీ ప్రకటించింది. హైకోర్టు ఆదేశాల తర్వాత మేం కూడా అలాగే చేశాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుండి భూమి పన్నును స్వీకరించడానికి చర్యలు ప్రారంభించింది' అని బినోయ్ విశ్వం చెప్పారు. బాధిత కుటుంబాల నుండి భూమి పన్ను వసూలు చేయాలని

తరువాయి 2లో

## నిరంతర పర్యవేక్షణ అవసరం



### ఢిల్లీ కాలుష్యంపై సుప్రీం కోర్టు..

### డిసెంబర్ 3న పిటిషన్ విచారణకు అంగీకారం

**న్యూఢిల్లీ:** ఢిల్లీ-జాతీయ రాజధాని ప్రాంతంలోని దారుణమైన గాలి కాలుష్యంపై దాఖలు అయిన పిటిషన్‌ను డిసెంబర్ 3న విచారించేందుకు సుప్రీం కోర్టు గురువారం అంగీకరించింది. ఈ సమస్యను నిరంతరం పర్యవేక్షించడం అవసరమని కోర్టు పేర్కొంది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తి జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం, గాలి కాలుష్య కేసులో అమికస్ క్యూరీగా సహాయపడుతున్న సీనియర్ అడ్వకేట్ అపరాజితా సింగ్ సమర్పించిన వాదనలు పరిగణనలోకి తీసుకుంది. ఆమె ఢిల్లీ-జాతీయ రాజధాని ప్రాంతంలో పరిస్థితి భయంకరంగా మారిందని అన్నారు. ఈ పరిణామాలను ఒక ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా అమె పేర్కొన్నారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పందిస్తూ, 'న్యాయస్థానం వద్ద ఎలాంటి మంత్రదండం లేదు. ఒక న్యాయస్థానం ఏ మాంత్రిక దండం ఊపగలదు? ఢిల్లీ-జాతీయ రాజధాని ప్రాంతానికి ఈ పరిస్థితి ప్రమాదకరమని నాకు తెలుసు. సమస్య ఏమిటో అందరికీ తెలుసు. కానీ పరిష్కారం ఏమిటన్నది అసలు విషయం. కారణాలను గుర్తించాలి. పరిష్కారాలను మాత్రం రంగ నిపుణులే

తరువాయి 2లో

### మతాతీతంగా

## సోదరభావం ప్రదర్శించండి

### టర్కీ పర్యటనలో పోప్ శాంతి సందేశం



**అంకారా:** మతాలు, ఆచారాలకు అతీతంగా ప్రజలు సోదరభావంతో మెలగాలని పోప్ లియో-14 పిలుపు ఇచ్చారు. గురువారం ఆయన టర్కీలో పర్యటించారు. వాటికన్‌సిటీలో పోప్‌గా ఆరునెలల క్రితం బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## పెరూ మాజీ అధ్యక్షుడికి 14 ఏళ్ళ జైలు

**లిమా :**దక్షిణఅమెరికా దేశం పెరూలో లంచాలు తీసకున్నారన్న ఆరోపణలు రుజువు కావడంతో ఆ దేశ మాజీ అధ్యక్షుడు మార్టిన్ విజ్కారా (62) కు న్యాయస్థానం 14 సంవత్సరాలు జైలుశిక్ష విధించింది. 2018 మార్చి నుండి 2020 నవంబరు వరకూ ఆయన పెరూ దేశాధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వహించారు. అంతకుముందు ఆయన దేశ మొదటి ఉపాధ్యక్షుడుగా, ఒక రాష్ట్ర గవర్నరుగాకూడాపనిచేశారు.2011–2014 మధ్యకాలంలో ఆయన మోక్వెగువాప్రాంతగవర్నరుగా పనిచేసిప్పుడు లంచాలు తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. నిర్మాణ ప్రాజెక్టులు, నీటిపారుదల వ్యవస్థ, ఆసుపత్రుల నిర్మాణంలో ఉండగా 2.3 మిలియన్ సోల్స్ లంచాలు తీసుకున్నట్లు ఆయనపై ఆరోపణలు రుజువు కావడంతో బుధవారం ఆయనకు న్యాయస్థానం శిక్ష ఖరారు చేసింది.మరో 94,600సోల్స్‌జరిమానాగా విధించింది. తొమ్మిది సంవత్సరాలపాటు పౌర పదువులు చేపట్టకుండా నిషేధం విధించింది.

### హాంగ్‌కాంగ్ అగ్ని ప్రమాదంలో

# వందలమంది గల్లంతు..70కి పెరిగిన మృతుల సంఖ్య

**మూడు నిర్మాణ కంపెనీల అధికారులు అరెస్టు**



**హాంగ్‌కాంగ్ :** హాంగ్‌కాంగ్ తైపో జిల్లాలో బుధవారం మధ్యాహ్నం ఆకాశహర్మ్యాలు దగ్ధమైన భారీ విపత్తులో వందలమంది గల్లంతయ్యారు. వారికోసం తీవ్రంగా గాలిస్తున్నారు. వీరంతా అనేక గంటలసేపు మంటల్లో చిక్కుకుపోవడంతో సజీవదహనమయ్యారని సందేహిస్తున్నారు. వీరిలో చాలామంది టాప్ ఫ్లోర్స్‌లో ఉన్నవారే. వీరిలో ఎక్కువమంది వృద్ధులు, మహిళలు ఉండి ఉంటారని కూడా భావిస్తున్నారు. ఈ కేసులో ఎలాంటి సురక్షిత చర్యలు తీసుకోకుండా బాధ్యతరాహిత్యంగా వ్యవహరించారన్న ఆరోపణలపై మూడు నిర్మాణ కంపెనీలకు చెందిన ముగ్గురు ఎగ్జిక్యూటివ్‌లను పోలీసులు అరెస్టు చేశారు.మరోవైపు ఈ భారీ అగ్ని ప్రమాదంలో మృతుల సంఖ్య 70కి పెరిగింది. పలువురు గాయపడి ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. ఈ ఆరు ఆకాశహర్మ్యాలు ఒకదాని తర్వాత మరొకటిగా అంటుకుని భారీ అగ్ని ప్రమాదానికి దారితీసింది. ఈ ఆకాశహర్మ్యాలు దగ్ధమైన వార్త తెలియగానే వాటి నివాసితుల బంధువులు వివిధ ప్రాంతాల నుండి హుటాహుటి అక్కడికి చేరుకున్నారు. తమ ఆత్మీయులకోసం వెదకుటాట ప్రారంభించారు. వారి జాడ తెలియక తీవ్ర ఆందోళనతో కన్నీరుమున్నీరవుతున్నారు. ఇప్పటివరకూ గుర్తించిన సమాచారం ప్రకారం 279 మంది నివాసితుల జాడ తెలియడంలేదు. ఈ టవర్స్‌లో మొత్తం 4,600 మంది నివాసితులు ఉన్నట్లు అంచనా. ఐతే ప్రమాదం ఎలా జరిగింది? ఆ సమయంలో ఎంతమంది టవర్స్‌లో ఉన్నారు? అనే విషయంపై ఇప్పటికీ ఎవరికీ ఒక స్పష్టత లేదు. పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాలో హాంకాంగ్ ఐలాండ్ ఒక స్పెషల్ ఎడ్మినిస్ట్రేటివ్ రీజియన్‌గా ఉంది. ఈ ప్రాంతంలో ఆకాశాన్ని అంటేవిధంగా ఎత్తుగా నిర్మించిన ఎనిమిది టవర్లు ఉండగా వీటిల్లోని ఏడు టవర్లులో ఉన్న అనేక బ్లాకులు అగ్నికి ఆహుతయ్యాయి. ఇప్పటివరకూ నాలుగు టవర్స్‌లో మంటలను అదుపు చేశారు. గురువారం రాత్రికి మిగిలిన టవర్స్‌లో కూడా మంటలను అదుపు చేయగలమన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం 700 అగ్నిమాపక దళాలు ఈ సహాయ కార్యక్రమాలు కొనసాగిస్తుండగా, మంటలను అదుపు చేసే క్రమంగా ఈ దళ సభ్యుడు హో వై హో (37) మరణించారు. మరోవైపు ఈ మంటలను అదుపు చేయడంలో అధికారులు తీవ్రజాప్యం చేశారని, నిర్లక్ష్యంగా వ్యవహరించారని మృతుల బంధువుల నుండి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు హాంగ్ కాంగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జాన్ లీ గురువారం పత్రికాగోష్టిలో మాట్లాడుతూ, పెద్ద నిర్మాణ సంస్థలు టవర్ల నిర్మాణంలో వెదురు దూలాలను నిచ్చెనలుగా, పరంజాలుగా ఉపయోగిస్తున్నాయని, వీటివల్లే ప్రమాదం తీవ్రత పెరిగిందని గుర్తించామని అన్నారు. ఇక మీదట వెదురు దూలాలను నిర్మాణరంగంలో ఉపయోగించకుండా నిషేధించి లోహాలతో తయారు చేసిన బలమైన దూలాలను ఉపయోగించే ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. అగ్ని ప్రమాదం నుండి అనేకమంది నివాసితులు బతికి బయటపడ్డారు. వారంతా ఇప్పుడు అనాథలుగా మారారు. బుధవారం రాత్రంగా షాపింగ్ మాల్స్‌లో, మెట్రో ట్రైన్ స్టేషన్లలో వారు నిద్రించారు. వాలంటీర్లు వారికి అన్ని సదుపాయాలు సమకూర్చేందుకు కృషి చేస్తున్నారు.

### బడ్జెట్‌లో పన్నులభారాన్ని వ్యతిరేకిస్తూ

## బల్గేరియాలో వెల్లువెత్తిన ప్రజా నిరసన

**సోఫియా:** యూరప్ ఆగ్నేయ ప్రాంత దేశం బల్గేరియాలో పన్నుల భారాలను వ్యతిరేకిస్తూ వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చారు. సందర్భంగా స్వల్ప ఘర్షణలు చెలరేగాయి. దాదాపు 20 వేలమంది ప్రదర్శకులు దేశ పార్లమెంటు చుట్టూ మానవహారం ఏర్పాటు చేశారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తూ నినాదాలు చేశారు. బడ్జెట్‌లో ప్రజలపై భారీగా పన్నులు వేయవద్దని డిమాండ్ చేశారు. వచ్చే ఏడాది బడ్జెట్‌లో భారీగా పన్నులు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. పార్లమెంటులో తుది ఓటింగ్‌కు ముందుగా బడ్జెట్ ముసాయిదాలో ఈ విషయాన్ని ప్రభుత్వం ప్రకటించడంతో ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ బాల్కన్ దేశం వచ్చే ఏడాది యూరోజోన్‌లో చేరడానికి సిద్ధమవుతున్న తరుణంలో ''ఉయ్ కంటిన్యూ ద ఛేంజ్ డెమోక్రటిక్ బల్గేరియా'' పేరుతో ఏర్పడిన ప్రతిపక్ష సంకీర్ణ కూటమి ఆధ్వర్యంలో ఈ ప్రజా నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా చట్టసభ సభ్యుల కార్లను అడ్డుకునేందుకు ప్రజలు ప్రయత్నం చేశారు. అదేసమయంలో ప్రదర్శకులు సీసాలు, బాణసంచా వస్తువులు విసిరారని, ముగ్గురు గాయపడ్డారని పోలీసులు చెప్పారు. బడ్జెట్ విధానంవల్ల ప్రజలపైన, వ్యాపారులపైన తీవ్ర ప్రభావం పడుతుందని, సామాజిక భద్రతలో ప్రజలిచ్చే వాటా భాగస్వామ్యం పెరగడంవల్ల నష్టం కలుగుతుందని ప్రదర్శకులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక సంఘాలు, ప్రజా సమూహాలు, ఆర్థిక నిపుణులు హెచ్చరికలు చేసినప్పటికీ, పార్లమెంటులో తగినంత మెజారిటీ ఉందనే ధీమాతో ప్రభుత్వం ప్రజల వ్యతిరేకతను పట్టించుకోకుండా పన్నుల భారాలతో కూడిన బడ్జెట్‌ను ఆమోదించే అవకాశాలు ఉన్నాయి.

## మయన్మార్‌లో 3000మంది ఖైదీలు విడుదల

**ప్యాంగ్‌యాంగ్:**మయన్మార్‌లో ఎన్నికలు సమీపిస్తున్నతరుణంలో సైనిక జుంటా ప్రభుత్వం 3000 మంది ఖైదీలను విడుదల చేసింది. మరో 5000 మంది ఖైదీలపై కేసులను ఉపసంహరించుకుంది. ప్రభుత్వ హయాంలోని ''మయన్మార్ ఇంటర్నేషనల్ టివి'' ఈ వార్త ప్రసారం చేసింది. మళ్ళీ ఎలాటి నేరాలు, తప్పులు చేయబోమన్న హామీపై వారిని విడుదల చేశారు. జుంటా ప్రభుత్వ నాయకత్వంలో ఉన్న జాతీయ రక్షణ, భద్రతా మండలి 724 మందికి క్షమాభిక్ష ప్రసాదించింది. 2,361 మంది ఖైదీలకు మినహాయింపులు ఇచ్చి విడుదల చేసింది. అదేవిధంగా 5,580 మందిపై ప్రస్తుతం కొనసాగుతున్న కేసులను రద్దు చేసింది.

డిసెంబరులో అంటే వచ్చేనెల 28వ తేదీన దేశంలో ఎన్నికలు నిర్వహిస్తామని జుంటా ప్రభుత్వ స్వీయ ప్రకటన, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడి పూర్వరంగంలో ఈ ఖైదీలను విడుదల చేశారు. మయన్మార్‌లో సెక్షన్ 505 ఎ కింద శిక్షలకు గురైనవారినందరినీ ప్రభుత్వం విడుదల చేసింది. వీరంతా దేశంలో వదంతులు, తప్పుడు ప్రచచారం చేశారన్న ఆరోపణలపై అరెస్టయ్యారు.ఎట్టకేలకు విడుదలయ్యారు. వీరు కాకుండా ఆంగ్‌సాన్ సూకీ పార్టీకి చెందిన అనేక వందలమంది రాజకీయ ఖైదీలు గడచిన ఐదు సంవత్సరరాలుగా జైళ్ళల్లో మగ్గుతున్నారు. మయన్మార్‌లో 2020 నవంబరులో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో నోబెల్ శాంతి బహుమతి గ్రహీత సూకీ నాయకత్వాన గల ఎన్ఎల్‌డి విజయం సాధించింది జుంటా సైనికుల తరపున పోటీ చేసిన పార్టీ ఘోర పరాజయం పొందడంతో, ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న వంకపెట్టి గెలిచిన పార్టీని కుప్పకూల్చి జుంటా సైనిక నాయకత్వం ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకుంది. సూకీ సహా వందలమంది రాజకీయ నాయకులను జైళ్ళలోకి నెట్టింది. దీంతో 2021లో ప్రజాస్వామ్య ఉద్యమం ప్రారంభమైంది. ఈ ఉద్యమంలో వేలాదిమంది యువకులను సైనికులు కాల్చి చంపారు. ఆ తర్వాత దేశంలోని పలు ప్రాంతాలలో ప్రభుత్వ వ్యతిరేక తిరుగుబాటు దళాలు ఏర్పడ్డాయి. ఈ దళాలతో సైన్యం పోరాడుతూ వస్తోంది.

## అవినీతి కేసులో హసీనాకు 21 ఏళ్ళ శిక్ష

### కుమారుడు,కుమార్తెకు ఐదేసేళ్ళు



**ఢాకా:** పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి షేక్ హసీనాకు మూడు అవినీతి కేసులలో కోర్టు 21 సంవత్సరాలు జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. ఆమె కుమారుడు సజీద్ వాజెద్ జోయ్, కుమార్తె సైమా వాజెద్ పుతుల్‌లకు కూడా మొత్తం మూడు కేసులలో ఒక కేసుకు సంబంధించి కోర్టు ఐదేసి సంవత్సరాలు వంతున జైలుశిక్షలు విధించింది. పూర్వాంచల్ న్యూ టౌన్ నివాసిత ప్రాంతాల నిర్మాణ ప్రాజెక్టులో ఆమెకు ప్లాట్ల కేటాయింపు అవినీతి జరిగిందంటూ హసీనా కుటుంబ సభ్యులు, అనుచరులపైన ఆరు కేసులు కోర్టులో నమోదయ్యాయి. మొత్తం ఆరు కేసుల్లోనూ హసీనా ఉమ్మడిగా దోషిగా ఉన్నారు. వీటిల్లో మూడు కేసులో గురువారం వెలువడిన తీర్పులో హసీనాకు 21 ఏళ్ళు జైలుశిక్ష పడింది. మిగిలిన 19మంది నిందితులకు వివిధ రకాలుగా శిక్షలు పడ్డాయి. ప్రజాపనుల మంత్రిత్వ శాఖలోమాజీ పాలనాధికారి సైఫుల్ ఇస్లామ్ సర్కార్‌మాత్రం మూడు కేసుల్లో నిర్దోషిగా విడుదలయ్యారు. ఢాకా కోర్టు–5కు చెందిన ప్రత్యేక న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్లా అల్ మామన్ ఈ తీర్పులు చెప్పారు. సెక్టర్–27లో ఉన్న డిప్లమోటిక్ జోన్‌లోని నివాసిత ప్రాజెక్టులో సీనియర్ అధికారులతో కలిసి అవినీతికి పాల్పడి అక్రమంగా ఆరు ప్లాట్లను హసీనా సొంతం చేసుకున్నారంటూ అవినీతి నిరోధక శాఖ ఆమెపై ఆరు కేసులు బనాయించింది. కేసుల విచారణలో మూడు కేసుల్లో ఆమెకు ఈ శిక్షలు పడ్డాయి. హసీనా సోదరి షేక్ వాజెద్, ఆమె కుమారుడు రద్వాన్ ముజిబ్ సిద్ధిఖ్ బొబ్బీ,కుమార్తె అజ్మీనా సిద్ధిఖ్‌లకు ఈ ప్లాట్లు కేటాయించారన్నదిప్రధానఆరోపణ. ఢాకాలోని మెట్రోపాలిటన్ సీనియర్ స్పెషల్ జడ్జి కోర్టులో అవినీతి నిరోధకశాఖ మార్చి 25న ఆరు ఛార్జిషీట్లు వేరు వేరుగా దాఖలు చేసింది. మొత్తం 29 మందిపై ఈ ఏడాది జులై 31న ఆరోపణలపై విచారణ మొదలైంది.భారతదేశంలోతలదాచుకున్నషేక్ హసీనా ను గతేడాది జులై అల్లర్లలో హింస చెలరేగడానికి ప్రధాన సూత్రధారిగా పేర్కొంటూనవంబరు 17వ తేదీన ఉరిశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది.

## చైనాలో రైలు ప్రమాదం
### 11 మంది కార్మికులు మృతి



**బీజింగ్:** వాయువ్య చైనా ప్రాంత నగరం కున్మింగ్‌లో ఒక రైలు కార్మికులను ఢీ కొట్టింది.ఈ ప్రమాదంలో11మంది కార్మికులు మరణించారు. మరో ఇద్దరుతీవ్రంగాగాయపడ్డారు. గురువారం ఉదయం ఈ ప్రమాద ఘటన జరిగిందని స్థానిక అధికారులుచెప్పారు.గడచిన దశాబ్దకాలంలో ఇంతటి తీవ్రమైన రైలు ప్రమాదం చైనా చరిత్రలో జరగలేదు. భూకంపాన్ని గుర్తించే తనిఖీ పరికరాల పర్యవేక్షణకు ఈ రైలును ఉపయోగించారు. ఈ రైలు తన పనిలో నిమగ్నమై ఉన్న సమయంలో లుయో యాంగ్ టౌన్ రైల్వే స్టేషన్‌వద్ద ఒక మలుపులోట్రాక్‌లకు మరమ్మతులు చేస్తున్న కార్మికులనుఢీకొంది. సహాయ కార్యక్రమాలు చేపట్టింది.

## ప్రత్యేక లీగల్ సెల్
(మొదటి పేజీ తరువాయి)

నియమించాలని, కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన లీగల్ కేసులను పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారిని నియమించాలని, కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన లీగల్ సెల్‌తో సమన్వయం చేసుకోవాలని పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ డైరక్టర్ సృజన ఆదేశాలు జారీ చేశారు.

అందుబాటులోకి టిపోల్ యాప్

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం పౌరులు, తమ పోలింగ్ స్టేషన్, ఓటర్ స్లిప్ డౌన్‌లోడ్ చేసుకునేందుకు, ఫిర్యాదులను సులభంగా అప్‌లోడ్ చేసి, వాటి పరిష్కార ప్రగతిని ట్రాక్ చేసుకునేందుకు టిపోల్ మొబైల్ యాప్ అనే అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఈ యాప్ ప్లే స్టోర్ అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు.

## ఎలాంటి హానీ జరుగదు
(మొదటి పేజీ తరువాయి)

రెవెన్యూ శాఖ గతంలో నిర్ణయించిందని, అయితే హైకోర్టు ఆదేశాల మేరకు ఆ చర్యను నిలిపివేసినట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం వివరించారు. ఇప్పుడు ఆ అడ్డంకి తొలగిపోయింది. కమ్యూనిస్టు పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం కేరళ హైకోర్టుకు కృతజ్ఞతలు తెలియజేస్తోందన్నారు. ఎవ్వరినీ వారి భూమి నుండి ఖాళీ చేయబోమని రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా చెబుతున్నదని కేరళ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి పి.రాజీవ్ చెప్పారు.త రిలే నిరసనను ముగించే నిర్ణయం దాని నిర్వాహకులైన మునంబం భూపరిరక్షణ కమిటీదేనని మంత్రి అన్నారు.ఇంతకుముందు ఎవ్వరినీ తొలగించబోమని ముఖ్యమంత్రి పినరయి విజయన్ హామీ ఇచ్చారని, ఆ తర్వాత, సమ్మెను ముగించాలా? వద్దా? అనే నిర్ణయాన్ని నిరసనకారులకే వదిలేశారని, ఆ నిర్ణయం కొనసాగుతోందని పరిశ్రమల శాఖ మంత్రి రాజీవ్ చెప్పారు.మునంబం సమస్య వక్ఫ్ బోర్డు చుట్టూ ఉన్నటువంటి దాదాపు 400 ఎకరాల వక్ఫ్‌భూమిని వక్ఫ్ భూమిగా క్లెయిమ్ చేసుకోవడానికి సంబంధించినది. చాలా సంవత్సరాల క్రితం భూమి కొనుగోలు చేసిన 600కు పైగా కుటుంబాలు గత 411 రోజులుగా నిరసన కొనసాగిస్తున్నాయి. సానుకూల పరిణామాలతో ఆందోళనకారులు తమ నిరసనను ముగించాలని నిర్ణయించుకుంటారని భావిస్తున్నారు.

## ఒకరిపై మరొకరు పోటీ వద్దు
(మొదటి పేజీ తరువాయి)

సయ్యద్ అజిత్ పాషా, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కల్లపల్లి శ్రీనివాస రావు, ఈటి నరసింహ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, వి.ఎస్ బోస్, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్. వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, జి. నాగయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఎన్నికలపైన చర్చించారు. గ్రామ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలలో సిపిఐ,సిపిఐ(ఎం) పరస్పర అవగాహనతో ఒకరిపైన మరోకరు పోటీ చేయకూడదని నిర్ణయించారు. అలాగే ఖమ్మం జిల్లా సిపిఐ(ఎం) రాష్ట్ర నాయకులు సామినేని రామారావు హత్య కేసులో పోలీసులు ఇప్పటి వరకు నేరస్తులను పట్టుకోలేదని, ఈ విషయంలో ఎటువంటి పురోగతి లేదని, వెంటనే ఈ కేసును వేగవంతంగా దర్యాప్తు చేసి, దోషులను అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నామినేషన్‌లు షురూ
(మొదటి పేజీ తరువాయి)

అవకాశాలు ఎక్కువగా ఉన్న అభ్యర్థులను రంగంలో దింపేందుకు సిద్ధం అయ్యాయి. ఇందుకు సంబంధించి ఇప్పటికే రాజకీయ పార్టీలు తగిన కసరత్తు పూర్తి చేసుకున్నాయి. నామినేషన్‌ల దాఖలే తరువాయి ప్రచార పర్వంలోకి దూకేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం నుంచి ఈ నెల 29 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామపత్రాలను దాఖలు చేసేందుకు అవకాశం ఉంటుంది. ఈ నెల 30న నామినేషన్‌లను పరిశీలన జరుపుతారు. అదే రోజు సాయంత్రం బరిలో నిలిచిన అభ్యర్థులతో కూడిన తుది జాబితాను ప్రకటించనున్నారు. డిసెంబర్ 3 వరకు ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. తొలిదశలో 4,236 గ్రామాలకు ఎన్నికలు జరుగనుండగా, 37,450 వార్డుల్లో పోలింగ్ డిసెంబర్ 3న పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను ప్రకటించనున్నారు. డిసెంబర్ 11న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగుతుంది. అదేరోజు మధ్యాహ్నం ఓట్లు లెక్కించి వార్డు సభ్యులు, సర్పంచ్ ఫలితాలను వెల్లడించనున్నారు. అలాగే తొలి విడతలో ఎన్నికలు జరిగే 189 మండలాల్లోని 4,236 గ్రామాల్లో ఫొటోతో కూడిన ఓటర్ల జాబితాలను ప్రదర్శించనున్నారు.

## కీలక భూమిక
(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బి శాఖ పరిధిలోని పలు ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి అధికారులను ఆరా తీశారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనులు, భవిష్యత్ అవసరాలకు గాను ఆర్అండ్‌బి శాఖ ఆధ్వర్యంలో చేపట్టబోయే ప్రాజెక్టులపై మంత్రికి స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గ్లోబల్ సమ్మిట్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, అందుకు తగ్గట్టుగా అధికారులు శాఖ పరమైన విజన్ డాక్యుమెంట్ రూపొందించాలని మంత్రి సూచించారు. వివిధ దేశాల డెలిగేట్స్ వస్తున్న నేపథ్యంలో భారత్ ఫ్యూచర్ సిటీలో జరిగే గ్లోబల్ సమ్మిట్ ప్రపంచ దృష్టిని ఆకర్షించనుందన్నారు. అలాంటి వేదికపై ఆర్అండ్‌బి శాఖ తన ప్రతిభ, ప్రణాళికలు గొప్పగా చెప్పాలన్నారు. హ్యామ్ రోడ్లు, నేషనల్ హైవే ప్రాజెక్టులు, ఆదిలాబాద్, వరంగల్, పెద్దపల్లి ఎయిర్‌పోర్టులు, రీజనల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్లు, టిమ్స్, నిమ్స్ హాస్పిటల్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ఉస్మానియా హాస్పిటల్, హైకోర్టు నూతన భవన నిర్మాణం, జిల్లా కోర్టుల నిర్మాణం వంటి అంశాలపై అధికారులతో మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్ ప్రకారం తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమీ లక్ష్యానికి తీసుకెళ్లే బాధ్యత ఆర్అండ్‌బి శాఖ అధికారులు, ఇంజనీర్లపై ఉందన్నారు. వచ్చే 5,10,15 ఏళ్ల ట్రాఫిక్ అవసరాలను అంచనా వేసి సమగ్రమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రెండేళ్లలో ఆర్అండ్‌బి పరిధిలో కోటి చదరపు అడుగుల నిర్మాణాలు చేపట్టడం గర్వ కారణమని అన్నారు. పలు బృహత్తర ప్రాజెక్టులు, హ్యామ్ రోడ్లు, రీజినల్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కనెక్ట్ అయ్యే రేడియల్ రోడ్లు తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చనున్నాయని పేర్కొ న్నారు. ఎక్స్‌ప్రెస్‌వేలు, ఎలివేటెడ్ కారిడార్లు, కొత్త ఎయిర్ పోర్టులు రాష్ట్ర అభివృద్ధిలో కీలకమని వెల్లడిం చారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న రోడ్ల వివరాలు సింగిల్ లేన్, డబుల్ లేన్, ఫోర్ లేన్ వంటి భవిష్యత్ అవస రాలకు అనుగుణంగా ప్రతి రోడ్డుకు సంబంధించి స్పష్టమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో జరిగే గ్లోబల్ సమ్మిట్‌లో ఆర్అండ్‌బి శాఖ విజన్ డాక్యుమెంట్ వీడియో ప్రదర్శనను సిద్ధం చేయాలని సూచించారు.

ఇప్పటి వరకు చేసిన పనులు, భవిష్యత్ ప్రాజెక్టులు, మన్ననూర్– శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్, భారత్ ఫ్యూచర్ సిటీ– బందరు పోర్టు గ్రీన్ ఫీల్డ్ హైవే, హైదరాబాద్– విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వే తదితర ప్రాజెక్టులన్నీ విజన్ డాక్యు మెంట్‌లో సమగ్రంగా పొందుపరచాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఆర్‌టిసి చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, ఆర్అండ్‌బి ఈఎన్సీలు మోహన్ నాయక్, జయ భారతి, ఎన్‌హెచ్ఎఐ రీజినల్ అధికారి శివ శంకర్, ఆర్అండ్‌బి సిఈలు శ్రీనివాస్ రెడ్డి, బి.వి. రావు, లింగారెడ్డి, నర్సింగ్‌రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం
(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంట్‌లో ప్రశ్నించడం, కేంద్ర మంత్రులకు విజ్ఞప్తులు ఇవ్వాలనుకుంటే విషయాన్ని వివరిస్తే నిర్దేశిత ఫార్మాట్‌లో సమాచారాన్ని, విజ్ఞాపన పత్రాలను ఢిల్లీలోని రాష్ట్ర అధికారులు ఎంపిలకు అందిస్తారని వివరించారు. నీటిపారుదల శాఖ, విద్యుత్ శాఖ, జిఎస్‌టి తదితర విషయాలకు సంబంధించి కేంద్ర నుంచి రాష్ట్రానికి రావలసిన నిధులు, పథకాలకు సంబంధించి గతంలో రాష్ట్ర ప్రభుత్వం లేఖలు రాసిందని, ఆ లేఖలు ఢిల్లీలోని ప్రత్యేక విభాగంలో ఎంపిలకు అందుబాటులో ఉంటాయని, వాటి ఆధారంగా ఎంపిలు పరిశీలించే అవకాశం ఉంటుందన్నారు.

డిసెంబర్ 9 నాటికి ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి కానున్న సందర్భంగా ప్రభుత్వం సాధించిన విజయాల వివరించడంతోపాటు తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు నిర్మాణానికి సంబంధించి '2047 విజన్ డాక్యుమెంట్' ఆవిష్కరణ చేయనున్నట్లు డిప్యూటీ సిఎం తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతానికి కమిటీలు వేస్తున్నాం, కేంద్ర మంత్రులను, ఎంపిలందరినీ ఆహ్వానించాలని భావిస్తున్నామని, ఆసక్తి ఉన్న ఎంపిలు పేర్లు ఇస్తే కమిటీల సభ్యులుగా నమోదు చేస్తామన్నారు. దేశంలో, ప్రపంచంలో ప్రముఖ వ్యక్తులు, సంస్థలతో ఎంపిలకు ఎవరికైనా పరిచయం ఉంటే వివరాలు ఇవ్వాలని, రాష్ట్ర ప్రయోజనాల కోసం వారిని గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానిస్తామని డిప్యూటీ సిఎం తెలిపారు.

**సమిష్టిగా ప్రధానిని కలుద్దాం: ఎంపి ల సూచన**


రాష్ట్ర ప్రయోజనాల విషయంలో అందరం కలిసికట్టుగా ముందుకు వెళదామని మెదక్ బిజెపి ఎంపి రఘునందన్ రావు సమావేశంలో అన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్స్, ఇతర సమస్యలపై ప్రధానమంత్రి సమయం తీసుకుని సమిష్టిగా కలుద్దామని సూచించారు. ఆదిలాబాద్ పటాన్ చెరువు రైల్వే లైన్ సాధ్యాసాధ్యాలు, డిపిఆర్ ఏమైనా చేశారా అని అడిగారు. రాష్ట్రానికి కేటాయించిన ఐఎఎస్, ఐపిఎస్ కేడర్ కేటాయింపు గురించి పూర్తి సమాచారాన్ని అందిస్తే సంబంధిత మంత్రిని పార్టీలకు అతీతంగా కలసి లేఖ ఇద్దామని ప్రతిపాదించారు. రాష్ట్రానికి అవసరం అయిన బొగ్గు గనుల విషయంలో అందరం కలిసి బొగ్గుగనుల శాఖ మంత్రిని కలుద్దామని ప్రతిపాదించారు. రీజనల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్స్, ఇతర రహదారులు, పెండింగ్ అంశాలపై అఖిలపక్ష సభ్యులంతా కలిసి నేరుగా ప్రధానమంత్రికి లేఖ ఇద్దామని మల్లు రవి చెప్పారు. మహబూబ్‌నగర్ ఎయిర్ పోర్ట్‌పై పూర్తి సమాచారానికి సంబంధించి కేంద్రానికి లేఖ రాయాలన్నారు. గద్వాలదోర్నకల్ రైల్వే లైన్ సర్వేపైనా సమాచారాన్ని ఆయన కోరారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తయితే బ్యాక్ వాటర్ వల్ల తమ నియోజకవర్గ ప్రజలు తీవ్రంగా నష్టపోతారని, ముంపు వల్ల లక్షమందికి పైగా ముంపు బారిన పడే అవకాశం ఉందని మహబూబాబాద్ ఎంపి బలరామ్ నాయక్ చెప్పారు. ఈ సమస్యపైనా పరిష్కారం కావాలన్నారు. ములుగు ఏటూరు నాగారం రహదారిని కేంద్రం మంజూరు చేసినా ఇప్పటికి టెండర్ ఖరారు కాలేదని చెప్పారు. అటవీ, పర్యావరణ అనుమతులు రాకపోవడం వల్లే అలస్యం అవుతోందని చెప్పారు. దీనిపై కేంద్రాని లేఖ రాయడం కానీ, పార్లమెంట్ లో ప్రస్తావన చేయడం కానీ చేయాలని అన్నారు. కాగా వివిధ ప్రాంతాలకు చెందిన ఎంపిలు వారి నియోజకవర్గాలలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను కూడా డిప్యూటీ సిఎం దృష్టికి తీసుకువచ్చారు.

## నిరంతర పర్యవేక్షణ అవసరం
(మొదటి పేజీ తరువాయి)

సూచించగలరు. దీర్ఘకాలిక పరిష్కారాలు లభిస్తాయని మేము ఆశిస్తున్నాం' అన్నారు. తక్షణమే ఏమని ఆదేశాలు జారీ చేయాలని ప్రశ్నించారు. కొన్ని ఆదేశాలు ఇచ్చిన వెంటనే శుభ్రమైన గాలి పీల్చగలమా అని ప్రశ్నించారు. అదే సాధ్యమైతే ఎంతో బాగుండేదని అన్నారు. ప్రతి ప్రాంతానికీ ప్రత్యేక పరిష్కారాలు అవసరమని, ప్రభుత్వం ఏ కమిటీ ఏర్పాటు చేసిందో వేచి చూద్దామని ఆయన అన్నారు. దీపావళి వచ్చినప్పుడు మాత్రమే ఢిల్లీలో వాయు కాలుష్యంపై చర్చ వస్తుందని, నిజానికి ఈ సమస్యపై నిరంతర పర్యవేక్షణ అవసరమని ఆయన అన్నారు. తీవ్రమైన పరిస్థితుల్లో కాలుష్యకార్యకలాపాలపై పరిమితులు విధించే గ్రేగెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జిఆర్‌ఎపి) క్రింద ఏడాది పొడవునా నిషేధాలు విధించాలన్న కోరిన అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. దీని బదులు, దీర్ఘకాలిక, సుస్థిర పరిష్కారాలు అవసరమని అభిప్రాయపడింది.

**ఆందోళనకరంగా వాయు నాణ్యత**

ఢిల్లీలో వాయు నాణ్యత వరుసగా ఆందోళనకరంగా మారుతున్నది. శీతాకాలం మొదలుకాకముందే చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వాలు ఉదాశీన వైఖరి అవలంభించడం ఈ దుస్థితికి ప్రధాన కారణం. రాజధానిలో వాయు నాణ్యత సూచీ (ఎక్యూఐ) 327గా నమోదైంది. రాబోయే వారంలో కూడా దాదాపు ఇలాంటి పరిస్థితే ఉండవచ్చని అంచనా. సుమారు పదిహేను రోజులుగా వాయు కాలుష్య తీవ్రత పెరుగుతూ, 'అత్యంత దారుణం' వర్గంలో చేరింది. ఎయిర్ క్వాలిటీ అర్లీ వార్నింగ్ సిస్టమ్ అంచనా ప్రకారం, కనీసం మరో వారం రోజుల పాటు వాయు కాలుష్యం తగ్గకపోవచ్చు. ఢిల్లీలోని వివిధ మానిటరింగ్ స్టేషన్ల రియల్‌టైమ్ వాయు నాణ్యతను చూపే సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సిపిసిబి) ప్రమాణాల ప్రకారం గాలి నాణ్యత ఎఐక్యూ 0–50 మధ్య ఉండాలి. 51–100 మధ్య ఉంటే సంతృప్తికరం. 101–200ని మోస్తరుగా పేర్కొంటారు. 201–300 మధ్య ఉంటే కాలుష్యం దారుణంగా ఉందని అర్థం. ఇక 301–400 మధ్య ఎక్యూఐ ఉంటే, చాలా దారుణమని భావించాలి. 401–500 మధ్య సూచీ అత్యంత తీవ్రతరమని సంకేతం. పూణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటీరియాలజీకి చెందిన డిసిషన్ సపోర్ట్ సిస్టమ్ (డిఎస్ఎస్) అంచనాల ప్రకారం, ఢిల్లీలో వాయు కాలుష్యానికి వాహనాలు 21.6 శాతం కారణమైతే, పంట అవశేషాల దహనం వల్ల ఏర్పడే కాలుష్యం 0.8 శాతం మాత్రమే. ఇలావుంటే, ఈ శీతాకాలంలో ఢిల్లీలో వాయు నాణ్యత చాలా దారుణంగా మారుతూ, తీవ్రం స్థాయిల్లోకి జారిపోతున్నది. దీనిని దృష్టిలో ఉంచుకొని, కాలుష్యంతో సంబంధం ఉన్న ఆరోగ్య క్షీణతను ముందుగానే గుర్తించడానికి నియమిత పరీక్షలు అత్యవసరమని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా పొగతాగే వారు, ఆస్తమా రోగులు, పిల్లలు, అలాగే గుండె లేదా శ్వాస సంబంధిత వ్యాధులు ఉన్నవారు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. వైద్య నిపుణుల ప్రకారం, విషపూరిత వాయు శ్వాసనాళాల్లో వాపు కలిగించడం, ఊపిరితిత్తుల పనితీరును తగ్గించడం, ఇప్పటికే ఉన్న వ్యాధులను మరింత తీవ్రం చేయడం వంటి సమస్యలు సృష్టిస్తాయి. కాబట్టి ముందుగానే ఆరోగ్య పరీక్షలు మరింత కీలకమవుతున్నాయి. దీర్ఘకాలిక శ్వాస ఇబ్బందులతో బాధపడుతున్న రోగులకు దీర్ఘకాలిక మంటలు లేదా ఊపిరితిత్తుల నిర్మాణ మార్పులను గుర్తించేందుకు ఛాతీ ఎక్స్‌రే సూచించవచ్చు. ప్రధాన లక్షణాలు కనిపించే ముందే శ్వాసనాళాల్లో మంటను గుర్తించగల 'ఫ్రాక్షనల్ ఎక్సేల్ నైట్రిక్ ఆక్సైడ్' వంటి ఆధునిక పరీక్షలకు డిమాండ్ పెరుగుతోంది. బహిరంగ ప్రదేశాల్లో పనిచేసేవారు, ట్రాఫిక్ సిబ్బంది, రోజువారీ ప్రయాణికులు తరచుగా వాయు కాలుష్యానికి గురవుతారు. ఇలాంటి వారంతా తమ ఊపిరితిత్తుల పనితీరుకు సంబంధించిన స్పిరోమెట్రీ ప్రొఫైల్‌ను ఒకసారి చేయించుకోవాలని, ఆరు నెలలకు ఒకసారి వాటిని పునరావృత పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. అలసట లేదా ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది అనుభవించే వారికి పల్స్ ఆక్సిమెట్రీ ద్వారా ఆక్సిజన్ శాతాన్ని పర్యవేక్షించడం ఉపయోగకరమని చెప్తున్నారు. కాలుష్యానికి దీర్ఘకాలికంగా గురయ్యే వారికి వార్షిక ఛాతీ పరీక్ష కూడా సిఫార్సు చేసే అవకాశం ఉందని వైద్య నిపుణులు అంటున్నారు.





# జనరల్
STATE & REGIONAL NEWS

## జనరల్ స్థానాల్లో బిసిలను నిలబెట్టి అగ్రకులాలను ఓడిస్తాం

బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాల్‌రాజ్‌గౌడ్

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** గ్రామపంచాయతీ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో బిసిలు పోటీ చేసి, అగ్రకులాలను ఓడించాలని తెలంగాణ బిసి పొలిటికల్ ఫ్రంట్ పిలుపునిచ్చింది. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారకభవన్లో గురువారం ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్‌తో కలిసి ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజ్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బిసిల వంచనకు పాల్పడిందని ఆరోపించారు. బిసి రిజర్వేషన్లపై హైకోర్టులో కేసు పెండింగ్ ఉండగానే జిఒ 46 తీసుకొచ్చి, సర్పంచ్ ఎన్నికలు పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. బిసిల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిరసనగా కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ బిసి ప్రజా ప్రతినిధులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫ్రంట్ నేతలు అంబాల నారాయణ, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

### ఇండస్ట్రియల్ ల్యాండ్ పాలసీపై...
# బిఆర్ఎస్, బిజెపి అసత్య ప్రచారం

ప్రభుత్వం ఏ పని చేసినా ప్రతిపక్షాలు బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నాయి

గాంధీ భవన్‌లో మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం ఏ మంచి పని చేసినా, ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టినా ప్రతిపక్ష పార్టీలు రాద్ధాంతం చేస్తూ బురద చల్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని, అందులో భాగంగానే ఇండస్ట్రియల్ ల్యాండ్ పాలసీపై బిఆర్ఎస్, బిజెపి అసత్య ప్రచారం చేస్తున్నాయని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండస్ట్రియల్ ల్యాండ్ పాలసీలో ఎలాంటి కుంభకోణానికి ఆస్కారమే లేదని, పాలసీ అత్యంత పారదర్శకమైన పాలసీ అని, హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా చేయడమే పాలసీ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీ నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇండస్ట్రియల్ ల్యాండ్ పాలసీ అర్థం కాలేదని, వారు పాలసీని పూర్తిగా అర్థం చేసుకుంటే బాగుంటుందని సూచించారు. గాంధీభవన్‌లో గురువారం మంత్రులతో ముఖాముఖీ కార్యక్రమంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొని ప్రజల సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. అనేక ఫిర్యాదులపై ఆయన అధికారులతో మాట్లాడారు.

అనంతరం గాంధీ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రతిపక్షాలు కావాలనే ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని, ఇండస్ట్రియల్ ల్యాండ్ పాలసీలో ఎలాంటి అవినీతి జరగలేదని వారికి కూడా తెలుసునని, కానీ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులతో ప్రజల్లో స్పందన వస్తుండడంతో తట్టుకోలేక ఇలా దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు పంపాలనే డిమాండ్ ఉందని, ఇది కొత్త డిమాండ్ కాదన్నారు. పైగా ఈ పాలసీని కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చింది కాదని, గతంలో కూడా ఈ పాలసీ ఉందని, దీనిని కాంగ్రెస్ ప్రభుత్వమే కొత్తగా తెచ్చిన పాలసీ మాదిరిగా ప్రతిపక్ష పార్టీలు గొడవ చేస్తున్నాయని విమర్శించారు.

బిఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా ఈ పాలసీపై చర్చ జరిగిందన్నారు. బిఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఈ విధానాన్ని మారుస్తామని అంటున్నారని, ఆ పార్టీ అధికారంలోకి వచ్చేదిలేదని, పాలసీని మార్చేదిలేదని అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇండస్ట్రియల్ పాలసీ రూపకల్పనలో తాను భాగంగా ఉన్నానని, కొత్త ఇండస్ట్రియల్ ల్యాండ్ పాలసీతో రాష్ట్రానికి అదనపు ఆదాయం వస్తుందని మంత్రి చెప్పారు.

### హైదరాబాద్ బుక్ ఫెయిర్ - 2025కి
# ప్రభుత్వం పూర్తి సహకారం

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ స్టేడియంలో ప్రతి సంవత్సరం చాలా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 'హైదరాబాద్ బుక్ ఫెయిర్ – 2025' సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ బుక్ ఫెయిర్ 2025కి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం ఉంటుందన్నారు. ముఖ్యంగా, రాష్ట్రంలోని ప్రముఖ సాహితీవేత్తలు, నూతన రచయితలను ప్రోత్సహించేందుకు ప్రదర్శనలో వారికి ప్రత్యేక స్టాళ్లను ఉచితంగా కేటాయించాలని నిర్వాహక కమిటీని కోరారు. పూర్వకాలపు సాహితీవేత్తలు రచించిన సమాజ హిత పుస్తకాలను సేకరించాలని బుక్ నిర్వాహకులకు మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. వీటిని ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.కోటి వెచ్చించి అటువంటి పుస్తకాలను కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఆనాటి మహానుభావులు రచించిన పుస్తకాలను ప్రతి గ్రామంలో, గ్రామపంచాయతీలో, మహిళా పంచాయతీల్లో, గిరిజన ప్రాంతాల్లో ఈ పుస్తకాలను అందుబాటు ఉంచేలా ప్రయత్నం చేయాలన్నారు. గత సంవత్సరం కంటే ఈ సారి స్టాళ్లను అదనంగా ఏర్పాటు చేయనున్నట్లు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రచురణకర్తలు పాల్గొంటారని, బుక్ ఫెయిర్ మహోత్సవం డిసెంబర్ 19 నుంచి 29 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు యాకూబ్, ప్రధాన కార్యదర్శి ఆర్. వాసు, ఉపాధ్యక్షుడు బాల్ రెడ్డి, కోశాధికారి నారాయణరెడ్డి, శ్రీనివాస్, దినకర్, జర్నలిస్ట్ ఆజామ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# బిసి రిజర్వేషన్లను తగ్గించి బిసిల గొంతు కోసిందే బిఆర్ఎస్

మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసి రిజర్వేషన్లను కాంగ్రెస్ ప్రభుత్వం 17 శాతానికి తగ్గించిందని కెటిఆర్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అసత్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. 2014లో జరిగిన స్థానిక ఎన్నికల్లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, 2019లో బిఆర్ఎస్ ప్రభుత్వం బిసి రిజర్వేషన్లను 22 శాతానికి తగ్గించి, బిసిల గొంతు కోసిందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడుతూ కులగణనలో బిఆర్ఎస్ పాల్గొనలేదని, బిసి రిజర్వేషన్లు నిలిచిపోవాలని కోర్టుల్లో అడ్డంకులను సృష్టించిందన్నారు. బిసి రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పోరాటం ఆగబోదని, కేంద్రంపై మరింత ఒత్తిడి తీసుకొస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితోనే కుల గణన, రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసిందన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం సర్పంచ్ రిజర్వేషన్లకు మండలం యూనిట్‌గా, వార్డు సభ్యుల రిజర్వేషన్లకు గ్రామ పంచాయతీ యూనిట్‌గా పరిగణలోకి తీసుకున్నామని వివరించారు.

కుల గణనను పూర్తి చేసి, అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి, సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేశామని, ఆ కమిషన్ నివేదిక ఆధారంగానే రిజర్వేషన్లను ఖరారయ్యాయని వివరించారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాలను అనుసరించి 50 శాతం రిజర్వేషన్ పరిమితిని తప్పనిసరిగా పాటించాల్సి వచ్చిందన్నారు. కొన్ని మండలాల్లో ఎస్‌సి, ఎస్‌టి జనాభా అధికంగా ఉండటంతో ఆ పరిమితిని దాటి పోకుండా ఉండేందుకు బిసి రిజర్వేషన్లలో కొంత మార్పు జరిగినట్లు స్పష్టం చేశారు.

**'పిసా చట్టం.. సుప్రీం మార్గదర్శకాల ప్రకారమే' గిరిజనులకు రిజర్వేషన్లు**

భద్రాచలం, ములుగు, ఆదిలాబాద్ వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో పిసా చట్టం, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం జనాభా ప్రాతిపదికన 100 శాతం గిరిజనులకు రిజర్వేషన్ల కేటాయించారని, ఇది రాజ్యాంగ బద్ధమైన హక్కు అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. బిఆర్ఎస్ నాయకులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం కులాల మధ్య విభేదాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని సీతక్క మండిపడ్డారు. తమిళనాడులో 1981లో బిసిల రిజర్వేషన్ల పెంపు ప్రక్రియ ప్రారంభమైతే, 1992లో రిజర్వేషన్లు పెరిగాయని గుర్తు చేశారు.

## బిసిలను ధోకా చేసిన ప్రభుత్వం

విద్యార్థుల నిరసన ప్రదర్శనలో ఆర్.కృష్ణయ్య



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ల అంశంలో బిసిలను నమ్మించి దోకా చేసిందని బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య విమర్శించారు. బిసిలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీనిచ్చి, ఏకపక్షంగా జిఒ 46 తెచ్చి 23 శాతం రిజర్వేషన్లు కల్పించి, అమలు చేయడంలో 17 శాతానికి కుదించడం తీవ్ర అన్యాయమన్నారు. పంచాయతీ ఎన్నికలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బిసి జెఎసి ఆధ్వర్యంలో నిజాం కాలేజీ నుంచి లోయర్‌ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు వందలాది మంది విద్యార్థులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనకు రాష్ట్ర బిసి విద్యార్థి సంఘం కన్వీనర్ మోదీ రాందేవ్, బిసి యువజన సంఘం అధ్యక్షులు అంజి నేతృత్వం వహించగా, ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య పాల్గొన్నారు. బిసి రిజర్వేషన్లపై జీఓ 9 అమలులో ఉన్నా, హైకోర్టులో కేసు ఉన్నా ప్రభుత్వం ఎన్నికలకు ఎలా వెళ్తుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో బిసి నేతలు నీలం వెంకటేశ్, ర్యాగ అరుణ్‌కుమార్, కొండా దేవయ్య, భూమన్న, జి.అనంతయ్య, పగిళ్ల సతీశ్, నిఖిల్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



## బిసిలను నట్టేట ముంచిన రాష్ట్ర ప్రభుత్వం

మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ధ్వజం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం బిసిలను నమ్మించి గొంతు కోసిందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ధ్వజమెత్తారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్లపై రెండేళ్లుగా కాలయాపన చేసి, చివరికి బిసిలకు పంచాయతీ ఎన్నికల్లో 23శాతం వరకు రిజర్వేషన్లను తగ్గించి నట్టేటా ముంచిందని విమర్శించారు. ఈ మేరకు గురువారం తెలంగాణ బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ, తెలంగాణ ప్రజాప్రతినిధుల ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపం వద్ద వందలాదిమంది విద్యార్థులు, బిసి నేతలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ జీవో 46 అమలుతో బిసిలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. పంచాయతీ ఎన్నికలు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 12,735 గ్రామ పంచాయతీల్లో కేవలం 2,176 స్థానాల్లోనే బిసిలకు రిజర్వేషన్లు కల్పించారన్నారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు. బిసి రిజర్వేషన్ల అంశంపై రానున్న పార్లమెంట్ సమావేశాలను స్తంభింపజేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, తెలంగాణ ప్రజా ప్రతినిధుల ఫోరం యాదయ్య, రాజు, కుమార్ రవి, జగదీష్, ప్రవీణ్ ,వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రాన్ని గట్టిగా కోరండి

కేరళ సమస్యల తక్షణ పరిష్కారానికి ముఖ్యమంత్రి పినరయి విజయన్

ఆన్‌లైన్ సమావేశంలో దక్షిణ రాష్ట్రాల ఎంపిలను కోరిన సిఎం



**తిరువనంతపురం :** వన్యప్రాణుల సంరక్షణ చట్టానికి సవరణల ఆమోదం, వాయనాడ్ కొండచరియలు విరిగిపడిన ప్రాంతానికి పునరావాసానికి మరింత ఆర్థిక సహాయం అందించడం వంటి వివిధ అంశాలను కేంద్ర ప్రభుత్వం వద్ద ప్రస్తావించాలని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ దక్షిణ రాష్ట్రాలకు చెందిన పార్లమెంట్ సభ్యులను కోరారు. జంతువుల దాడులను నిరోధించడానికి సంబంధించి వివిధ అడ్డంకులను తగ్గించడానికి రాష్ట్ర శాసనసభ కేంద్ర చట్టమైన వన్యప్రాణుల రక్షణ చట్టానికి సవరణలు చేసిందని ఆయన గురువారం ఇక్కడ పార్లమెంట్ సభ్యులు, రాష్ట్ర మంత్రుల ఆన్‌లైన్ సమావేశంలో చెప్పారు. సవరణలను అమలులోకి తీసుకురావాలంటే రాష్ట్రపతి ఆమోదం అవసరమని, దానిని సాధించడానికి ఎంపిలు కలిసికట్టుగా కృషిచేసి సాధించాలని కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి పినరయి విజయన్ కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటన తెలియజేసింది. మానవ వన్యప్రాణుల సంఘర్షణను తగ్గించడానికి కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం కింద రూ.620 కోట్ల ప్రత్యేక సహాయం అందించేలా కేంద్రంపై వత్తిడి పెంచాలని సమావేశంలో సిఎం పినరయి విజయన్ ఎంపిలను కోరారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద కేంద్రం తన వాటాను పెంచాలని, ఈ పథకం కింద నిర్మించే ఇళ్లకు బ్రాండింగ్ అవసరాన్ని మాఫీచేయాలని ఆయన వారిని కోరారు. వాయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల పునర్నిర్మాణానికి రూ.2,221.03కోట్ల సహాయాన్ని కోరగా, కేంద్రం రూ.260.56 కోట్లు మాత్రమే ఇచ్చిందని, రాష్ట్రానికి అవసరమైన ఆర్థిక సహాయం అందించడానికి కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని పార్లమెంట్ సభ్యులకు ముఖ్యమంత్రి సూచించారు. వీటితోపాటు. రాష్ట్ర రుణ పరిమితిని 3.5శాతానికి పెంచడం, 202425 మరియు 202526లో కేరళ రుణ పరిమితి నుంచి కేంద్రం తగ్గించిన మొత్తాలను పునరుద్ధరించడం, జిఎస్‌టి సంస్కరణల కారణంగా రాష్ట్రానికి జరిగిన నష్టాలకు జిఎస్‌టి పరిహారం అందించడం వంటి అంశాలను కూడా ప్రస్తావించాలని ముఖ్యమంత్రి విజయన్ ఎంపిలను కోరారు.

## పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి

తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ




**ప్రజాపక్షం/హైదారబాద్:** రాష్ట్ర ప్రభుత్వం తాజా మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ డిమాండ్ చేశారు. బిల్లులు రాక అనేకమంది సర్పంచ్‌లు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వెంటనే బిల్లులు విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ సుధాకర్‌కి గురువారం వినతి పత్రం అంద చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ బిల్లుల అంశంపై గత ఆరు నెలల కింద మానవ హక్కుల కమిషనర్‌కి ఫిర్యాదు చేశామని, ఆ ఫిర్యాదు ఆధారంగా గురువారం విచారణ ఉన్నందున సర్పంచులు అందరూ హాజరు అయ్యామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య , ఉపాధ్యక్షుడు కేశ బోయిన మల్లయ్య, సముద్రాల రమేష్, నడికుడ రవీందర్రావు, వెంకటరామిరెడ్డి, పాండురంగారెడ్డి, బస్మాపురం సప్న, అంజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాల్లో గెలుపు,ఓటములు సహజం

కెటి.రామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్‌టి రామారావు లాంటి మహానాయకులే కల్వకుర్తిలో ఓడిపోయారని, రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. రానున్న రోజుల్లో బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు, పార్టీ కమిటీలను నియమించనున్నట్టు వెల్లడించారు.సిఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కాకుండా కేవలం రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు బిజెపి, కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంఎల్‌ఎ జైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో గురువారం బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సంద ర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతి, హామీల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఈ విషయమై కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రజల పక్షాన బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పోరాటం చేయాలని సూచించారు.

## పాలసీల పేరుతో స్కాములు చేస్తున్నారు

బిఆర్ఎస్ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చిన తర్వాత ప్రజలు చిత్ర, విచిత్రాలు చూడాల్సిన పరిస్థితి వస్తుందని, పాలసీల పేరుతో స్కాములు చేస్తున్నారని బిఆర్ఎస్ మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. 10వేల ఎకరాల విలువైన భూములను కారుచౌకగా సిఎం రేవంత్‌రెడ్డి తన ఆత్మీయ బంధువులకు అప్పగించేందుకు సిద్ధమయ్యారని, దీనికి సంబంధించి త్వరలోనే ఆ వివరాలు బయటపెడతామన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేయడమే హిల్ట్ పి పాలసీ అని అన్నారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పెరిగిందని చెబుతూ, ఒఆర్ఆర్ వద్ద ఎకరం రూ.137 కోట్లు పలికిందని, హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న భూములను కారు చౌకగా కట్టబెడుతున్నారని ఆరోపించారు. పారిశ్రామిక భూములను ఒక పథకం ప్రకారమే సిఎం రేవంత్ రెడ్డి తక్కువ ధరకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. నాచారం, బాలానగరంలో ఒక గజం స్థలానికి రూ.1,50,000లు మార్కెట్ ధర పలికితే, దీనిని రూ.10వేలకే కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన మండిపడ్డారు. పారిశ్రామికవాడలోని భూములను ఎవరికి కేటాయించారో వారి పేర్లను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, అనంత్ పాల్గొన్నారు.

## కెసిఆర్ దీక్ష, అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్రం

✻ మాజీ మంత్రి హరీష్‌రావు




**ప్రజాపక్షం/సిద్దిపేట :** నవంబర్ 29 కెసిఆర్ దీక్ష ఫలితం..అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్రమని మాజీ మంత్రి హరీహష్‌రావు అన్నారు. నవంబర్ 29, 2009 చరిత్ర మలుపు తిప్పిన రోజని, చారిత్రాత్మక రోజన్నారు. నవంబర్ 29 లేకుంటే డిసెంబర్ 9, జూన్ 2 లేదన్నారు. జూన్ 2 లేకుంటే తెలంగాణ రాష్ట్రం ఎక్కడిదని, రేవంత్‌రెడ్డికి సిఎం పదవి దక్కేనా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తెలుగుదేశం పార్టీలో చంద్రబాబు పంచన వుండేవారని హరీష్‌రావు ఎద్దేవా చేశారు. గురువారం సిద్దిపేట జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన దీక్షా దివాస్ సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి హరీష్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతోనే సిద్దిపేట జిల్లా అయిందని, సిద్దిపేటకు గోదావరి జలాలు, రైలు, మెడికల్ కళాశాల వచ్చిందన్నారు. దేశానికి అన్నంపెట్టె ధాన్యాగారంగా తెలంగాణ మారిందన్నారు. ఆనాడు కెసిఆర్ తెలంగాణ కోసం ఆమరణ దీక్ష చేపట్టినప్పుడు సిద్దిపేట పాత బస్టాండ్ చౌరస్తాలో దీక్ష శిబిరం ఏర్పాటు చేసుకొని.. 1531 రోజులు దీక్షా శిబిరాన్ని నిరంతరంగా నిర్వహించగా. ఎందరో మేధావులు, ఉద్యమకారులు, అన్నివర్గాల నేతలు సందర్శించి సంఘీభావం ప్రకటించినట్లు తెలిపారు. కొన్ని వేల మంది దీక్ష శిబిరంలో పాలుపంచుకున్నట్లు తెలిపారు. 1531 రోజుల దీక్ష శిబిరానికి చిహ్నంగా ఫైలాన్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. మోడల్ బస్టాండ్ నిర్మాణంతో దాన్ని తొలగించారని, మళ్లీ పెడుతామంటే ఆర్టీసివారు అనుమతి ఇవ్వలేదన్నారు. తెలంగాణ ఉద్యమాల జ్ఞాపకాలకు, నిరహారదీక్షలకు చిహ్నంగా సిద్దిపేట క్యాంపు కార్యాలయం ఎదురుగా ఫైలాన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దశాబ్దాల కలను. కోట్ల మంది కలలను నిజం చేసిన గొప్ప నేత కెసిఆర్ అని ప్రశంసించారు.

**✻ 17 శాతం రిజర్వేషన్లతో బిసిలను నట్టేట ముంచిన రేవంత్‌రెడ్డి :** అబద్ధాలు చెప్పి, మాయమాటలు చెప్పి రేవంత్‌రెడ్డి గద్దెనెక్కారని విమర్శించారు. రేవంత్‌రెడ్డికి ఓట్ల రాజకీయం తప్ప రాష్ట్ర ప్రజల మీద శ్రద్ధ లేదన్నారు.

42శాతం బిసిలకు రిజర్వేషన్లు ఇస్తానని నమ్మబలికిన రేవంత్‌రెడ్డి బిసిలకు నట్టేట ముంచి కేవలం 17శాతానికి పరిమితం చేశారన్నారు. రాష్ట్రాన్ని సాధించిన కెసిఆర్‌కు, కాంగ్రెస్ నాయకులకు పోలిక లేదన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్. యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారుక్‌హుస్సేన్, వంటేరు ప్రతాప్‌రెడ్డి, వేలేటి రాధకిషన్‌శర్మ, గుండు భూపేశ్, రాజనర్సు, జంగిటి కనకరాజు, బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలి : డిజిపి బి.శివధర్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో జరగబోయే పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని స్థాయిల పోలీస్ అధికారులు కృషి చేయాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై గురువారం డిజిపి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.హైదరాబాద్ కమిషనరేట్ మినహా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్‌పిలు మొదలుకొని స్టేషన్ హౌస్ ఆఫీసర్ల స్థాయి వరకు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిపి బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్‌పిలు గ్రామీణ ప్రాంతాల్లో జరిగే పంచాయతీ ఎన్నికలు సజావుగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికలను నిస్పాక్షికంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని, ఆరోపణలకు ఆస్కారం ఇవ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో శాంతి భద్రతల అదనపు డిజిపి మహేష్ ఎం. భగవత్, మల్టీ జోన్ 2 అడిషనల్ డిజిపి డి.ఎస్. చౌహాన్, మల్టి జోన్ 1 ఐ.జి.పి. ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, ఏఐజీ రమణ కుమార్, లీగల్ అడ్వైజర్ ఇ. రాములు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం/నందికొండ: నాగార్జునసాగర్ నందికొండ మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలంటూ సమాచార హక్కు మానవహక్కు లా సమితి సభ్యులు నందికొండ మున్సిపాలిటీ కమిషనర్ కు గురువారం వినతి పత్రం అందజేశారు. లా సమితి రాష్ట్ర కోశాధికారి గొట్టిముక్కల శివశంకరా చారి మాట్లాడుతూ నందికొండ మున్సిపాలిటీ పరిధిలో గత కొంతకాలంగా కోతుల బెడద అధికమైందని, కోతుల వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని,మున్సిపాలిటీలో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్‌ను,మూలనపడ్డ చెత్త సేకరణ వాహనాలను తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని,పారిశుద్ధ్య కార్మికులకు రావలసిన ఐదు నెలల జీతభత్యాలను సైతం త్వరితగతిన అందించాలని తమ సంస్థ తరపున నందికొండ మున్సిపల్ కమిషనర్ చింత వేణుకు వినతి పత్రం అందజేశామని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు ఐదు నెలల జీతాల విషయమై ఉన్నతాధికారులతో మాట్లాడటం జరుగుతుందన్నారు. సమాచార హక్కు మానవ హక్కుల సమితి దాసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జి బద్రి పాల్గొన్నారు.

## సబ్ ట్రెజరీ కార్యాలయ భవన నిర్మాణ పనులు పరిశీలన



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలో సబ్ ట్రెజరీ కార్యాలయ భవన నిర్మాణాన్ని సహాయ కోశాధికారి (ఏటీవో) కడారు ప్రేమ్‌చంద్ గురువారం పరిశీలించార. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 4 సబ్ ట్రెజరీ కార్యాలయాలతో పాటు మిర్యాలగూడ సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని సుమారు రూ.40లక్షల వ్యయంతో చేపట్టారు. నూతనంగా ఏటీవోగా బాధ్యతలు చేపట్టిన అనంతరం నిర్మాణాన్ని పరిశీలించి భవన నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న రాష్ట్ర పోలీసు, హౌసింగ్, కార్పోరేషన్ ఏఈ గౌతంతో చర్చించారు. పాత భవనం కొంత భాగం రోడ్డు విస్తరణలో కూల్చి వేయాల్సి ఉంటుందని త్వరగా పూర్తి చేయాలని ఏటీవో కోరగా త్వరలో పూర్తి చేస్తామని ఏఈ అన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీవో ప్రమీల, సీనియర్ అసిస్టెంట్ మెహరున్నీసాబేగం, కాంట్రాక్టర్‌లు ఉన్నారు.



## సజావుగా నామినేషన్ స్వీకరణ ప్రక్రియ

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/నూతనకల్ : నామినేషన్ స్వీకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా రిటర్నింగ్ అధికారులు చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. గురువారం నూతనకల్ మండల కేంద్రంలోని ఎంఆర్‌సి భవనం, మిర్యాల, ఆత్మకూర్(ఎస్) మండలం ఏపూర్ గ్రామ పంచాయితీ కార్యాలయంలో మొదటి విడత గ్రామ పంచాయితీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక నిమిత్తం ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను జిల్లా ఎస్‌పి కె నరసింహాతో కలిసి ఆయన పరిశీలించారు. నూతనకల్ ఎంఆర్‌సి భవనంలో నూతనకల్, వెంకేపల్లి, యడవెల్లి, చిల్పకుంట్ల గ్రామ పంచాయితీ సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు నామినేషన్ స్వీకరించడం జరుగుతుందన్నారు. మిర్యాల గ్రామ పంచాయితీ కార్యాలయంలో మిర్యాల, అల్లగనూరు, లింగంపల్లి, మాచనపల్లి గ్రామ పంచాయితీ సర్పంచులకు, వార్డు మెంబర్లకు, ఏపూరు గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఏపూరు, ఏపూరు తండ, బొప్పారం, కాశిగూడెం, మక్తకొత్తగూడెం, రామన్నగూడెం, మిద్దనపల్లి గ్రామ పంచాయితీ సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని వివరించారు. అలాగే వాహనాలు 100 మీటర్ల దూరంలోనే ఆపేయాలని ఆదేశించారు. డిఎస్‌పి ప్రసన్నకుమార్, తహాశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓలు సునీత, మహ్మద్ హాసీం, ఆర్‌ఓలు ఉన్నారు.

## రైస్‌మిల్లులో ప్రమాదం

### నలుగురు కూలీలకు తీవ్రగాయాలు
### ఇద్దరి పరిస్థితి విషమం





ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : పార్‌బాయిల్డ్ రైస్‌మిల్‌లో ప్రమాదం జరిగి నలుగురు కూలీలకు గాయాలు కాగా అందులో ఇద్దరు కూలీల పరిస్థితి విషమించగా మెరుగైన వైద్యం కోసం సూర్యాపేట ప్రభుత్వ జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించిన సంఘటన గురువారం హుజూర్‌నగర్‌లో జరిగింది. సదరు కూలీలు తెలిపిన వివరాల ప్రకారం హుజూర్‌నగర్ పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులోని సాయిబాలాజీ ఫార్‌బాయిల్డ్ రైస్ మిల్లులో కాలిన వరిపొట్టు బూడిద లారీలో లోడ్ చేస్తుండగా కాలిన బూడిద గుట్ట కూలీ ఒక్కసారిగా కూలీలపై పడడంతో నలుగురు కార్మికుల శరీరంపై పడి వారికి తీవ్రగాయాలు అయ్యాయి. 108 అంబులెన్స్‌లో హుజూర్‌నగర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులంతా కోదాడలోని శ్రీరంగాపురం వాసులమని తెలిపారు. గాయపడిన వారిలో సాతినేని దుర్గ, షేక్ ఫిరోజ్‌లకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం సూర్యాపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు. జాన్‌భి, షేక్ మదార్లకు హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సను అందిస్తున్నారు.

## చరిత్రలో గుర్తించుకోదగిన పవిత్రమైర రోజు దీక్షా దివస్

### మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్ రెడ్డి



ప్రజాపక్షం/నల్లగొండ : కెసిఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో అన్న నినాదంతో కెసిఆర్ బయలుదేరిన రోజు చరిత్రలో గుర్తించుకోదగిన పవిత్ర దినం దిక్షా దివాస్ అని మాజీ మంత్రి,సూర్యపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని జిల్లా బిఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దీక్షా దివాస్,లోకల్ బాడీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కెసిఆర్ ప్రాణాన్ని పణంగా పెట్టి తెలంగాణ సాధించేందుకు బయలు దేరిన రోజు నవంబర్ 29అని సమైక్య ఆంధ్రవాళ్ళు తెలంగాణను అడ్డుకుంటామని చెప్పిన వాళ్ళకు చెంపపెట్టులా నిలిచి రాష్ట్రం సాధించారని అన్నారు. అందుకే మనం వెలుగెత్తి చాటాలని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ తెలంగాణ వాళ్ళ దిష్టి తగిలి అక్కడి కోనసీమ చెట్లు ఎండి పోయాయి అంటున్నారని మీరు చెడిపోవాలని ఎప్పుడు మేము కోరుకోలేదన్నారు. తెలంగాణ జలాలు దోచుకునే కుట్రలు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర కుమార్,ఎమ్మెల్సీ కోటి రెడ్డి,మాజీ జడ్పి చైర్మన్ బండ నరేందర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డి,చిరుమర్తి లింగయ్య,కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి,భాస్కర్ రావు,నోముల భగత్, తదితరులు పాల్గొన్నారు.

## ఆరు వార్డుల్లో బాలల పరిరక్షణ కమిటీల ఏర్పాటు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మిర్యాలగూడ ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో గురువారం మిర్యాలగూడ పట్టణంలో సుమారు ఆరు వార్డుల్లో బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని సీడీపీవో రేఖల మమత గురువారం తెలిపారు. కమిటీలో వార్డు ఆఫీసర్‌ను చైర్మన్‌గా ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌ను కన్వీనర్‌గా, ఏఎన్‌ఎం, సమభావన సభ్యులను, స్కూల్ హెడ్‌మాస్టర్‌ను, వార్డు పోలీసులను, మత పెద్దలను సభ్యులుగా 8.9,17,18, 24వార్డుల్లో ఎన్నుకోవడం జరిగిందన్నారు. కమిటీల ఏర్పాటుతో అక్రమ దత్తత, బాల్య వివాహాలను అడ్డుకోవడం, స్కూల్ డ్రాప్‌ఔట్‌ను నిర్మూలించడం భ్రూణహత్యలను నిర్మూలించే అంశాలపై ప్రతి నెలా మొదటి శుక్రవారం సమావేశాలను ఏర్పాటు చసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగమణి, లీలా కుమారి, నజీమాబేగం, పద్మ, వార్డు ఆఫీసర్లు రమ్య, శ్రీనునాయక్, స్కూల్ టీచర్లు కుర్ర కృష్ణకాంత్, శ్రీనివాస్, కరుణాకర్‌రెడ్డి, మహిళా సంఘాల సభ్యులు నిర్మల, పద్మ, గీత, సుహాసిని, మాదవి, వార్డు పోలీస్ ఆఫీసర్ శివ ప్రసాద్, బిక్కునాయక్, సయ్యద్ సమద్, మట్టయ్య, ఏఎన్‌ఎం భాగ్యమ్మ, ఉమారాణి, నాగమణి, కవిత, మత పెద్దలు అరుణోదయ, అంగన్‌వాడి టీచర్ నర్మద, చిన్నమ్మ, శ్రీదేవి, సరిత, ఝాన్సీరాణి, శారదా, కోమ పార్వతి, విజయలక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

# నిష్పాక్షికంగా ఎన్నికల విధులు

### జిల్లా ఎన్నికల ప్రత్యేక అధికారి కొర్రా లక్ష్మి
### రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిబంధనలను పాటించాలి
### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/నార్కట్ పల్లి: స్థానిక సంస్థల ఎన్నికల విధులను అభ్యర్థుల పట్ల నిష్పక్షపాతంగా, పారదర్శకంగా అధికారులు ఎన్నికల విధులను నిర్వహించాలని సాధారణ పరిశీలకురాలుగా నల్గొండ జిల్లాకు నియమితులైన రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కొర్రా లక్ష్మి సూచించారు. గురువారం గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా ఆమె మండలంలో మొదటి విడత నామినేషన్లు స్వీకరిస్తున్న నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను పరిశీలిస్తూ నామినేషన్లు వేసేందుకు వచ్చిన అభ్యర్థులకు ఇస్తున్న సూచనలు,సలహాలు,ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియమ నిబంధనలను పాటించాలన్నారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, ఆర్‌డిఓ వై .అశోక్ రెడ్డి జిల్లా అబ్జర్వర్ల నోడల్ అధికారి ,పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రమేష్ ఉన్నారు.

### నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ

ప్రజాపక్షం/చిట్యాల: గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా మొదటి విడత నామినేషన్లు స్వీకరించే నామినేషన్ కేంద్రాలను గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకు రాలు రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కొర్ర లక్ష్మి గురువారం ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ముందుగా ఆమె నల్గొండ కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ని కలిసి జిల్లా కలెక్టర్ తో పాటు ,స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్ లతో కలిసి చిట్యాల మండలం,వెలిమినేడు గ్రామపంచాయతీ కార్యాలయంలో వెలిమి నేడు క్లస్టర్‌కు సంబంధించి ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం నామినేషన్ల స్వీకరించే ఆర్‌ఓ గదిని, మెటీరియల్ ను, ఇతర ఏర్పాట్లను పరిశీలించి నామినేషన్ల స్వీకరణ సందర్భంగా అనుసరిస్తున్న ప్రక్రియను అడిగి తెలుసుకుని ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్,నల్లగొండ ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య ఉన్నారు.

# సూర్యాపేటలో మొదటిరోజు సర్పంచ్‌లకు 207..

### వార్డులకు 38.. నామినేషన్లు దాఖలు



ప్రజాపక్షం/సూర్యాపేట : పల్లెపోరు తొలిదశ ఎన్నికలకు పోటీచేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడం గురువారం షురువయ్యాయి. మొదటి విడుత జిల్లాలో తుంగతుర్తి, నాగారం, నూతనకల్, తిరుమలగిరి, జాజిరెడ్డిగూడెం, మద్దిరాల, సూర్యాపేట రూరల్, ఆత్మకూర్(ఎస్) మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ మండలాల పరిధిలో మొత్తం 159 గ్రామ పంచాయితీలు ఉండగా, 1442 వార్డులు ఉన్నాయి. తుంగతుర్తి మండల పరిధిలో 24 గ్రామ పంచాయితీలు, 218 వార్డులు, నాగారం మండలంలో 14 గ్రామ పంచాయితీలు, 132 వార్డులు, నూతనకల్ మండలంలో 17 గ్రామ పంచాయితీలు ఉండగా 166 వార్డులు, తిరుమలగిరి మండలంలో 16 గ్రామ పంచాయితీలు 132 వార్డులు, జాజిరెడ్డిగూడెం మండలంలో 17 గ్రామ పంచాయితీలు, 152 వార్డులు ఉన్నాయి. అలాగే మద్దిరాల మండలంలో 16 గ్రామ పంచాయితీలు 148 వార్డులు, సూర్యాపేట మండలంలో 25 గ్రామ పంచాయితీలు 220 వార్డులు, ఆత్మకూర్(ఎస్) మండలంలో 30 గ్రామ పంచాయితీలు 274 వార్డులు ఉన్నాయి.
మొదటిరోజు దాఖలైన నామినేషన్లను పరిశీలిస్తే ఇలా ఉన్నాయి. తుంగతుర్తి మండల సర్పంచ్‌గా పోటీ చేసే అభ్యర్థులు 24 మంది నామినేషన్లు దాఖలు చేయగా వార్డు మెంబర్లుగా పోటీ చేసే వారు 09 మంది, నాగారం మండలంలో 30 సర్పంచ్ నామినేషన్లు, వార్డులకు 4 నామినేషన్లు, నూతనకల్ మండలంలో సర్పంచ్ పదవికి 34, వార్డులకు 8 నామినేషన్లు, తిరుమలగిరి మండలంలో సర్పంచ్ పదివికి 17 నామినేషన్లు దాఖలు చేయగా వార్డులకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. జాజిరెడ్డిగూడెం మండలంలో సర్పంచ్ పదివికి 15, వార్డులకు 03 నామినేషన్లు దాఖలు అయ్యాయి. మద్దిరాల మండలంలో సర్పంచ్ పదవికి 17, వార్డులకు 2 నామినేషన్లు, సూర్యాపేట మండలంలో సర్పంచ్ పదవి కోసం 40, వార్డులకు 7 నామినేషన్లు దాఖలు చేశారు. ఆత్మకూర్(ఎస్) మండలంలో సర్పంచ్ పదవి కోసం 30, వార్డులకు 5 నామినేషన్లు దాఖలు అయినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ అధికారికంగా ప్రకటించారు.

## యువత స్వయం ఉపాధితో ఎదగాలి



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కొత్త మార్కెట్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎడిబుల్ టీ కప్పుల తయారీ పరిశ్రమ కేంద్రాన్ని ఆయన మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎండి ఫసియోద్దిన్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ రహిత సమాజం ఏర్పాటుకు వారివంతు ప్రయత్నంగా టీ తాగండి కప్పు తినండి కాన్సెప్ట్‌తో క్రంచీకప్స్ యూనిట్‌ను నెలకొల్పిన యాజమాన్యంను అభినందించారు. యువత ప్రైవేట్ రంగాల్లో అందివస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ, మరింత మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని ఆ కాంక్షించారు. కాస్త చదువు, ఇంకాస్త సృజనాత్మకత తోడైతే ఎలాంటి విజయాలైనా సాధించవచ్చన్నారు.

## కొయ్యకాళ్లు కాలిస్తే భూమిలో జీవం హరిస్తుంది

ప్రజాపక్షం/అర్వపల్లి : వరి కొయ్యలు కాల్చడం ద్వారా అధిక నష్టాలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని తిమ్మాపురం పంట పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట పొలాల్లో వరి కొయ్యలు కాల్చడం వల్ల నేలకు పంటకి, ప్రజల ఆరోగ్యానికి భారీ నష్టం జరుగుతుందన్నారు. గడ్డి దహనం చేస్తే నేలలోని జీవాలను నాశనం చేసే మంటల ఉష్ణోగ్రత 300 700 సి వరకు పెరుగుతుందని వివరించారు. ఈ తీవ్ర వేడి వల్ల నేలలో సహజంగా ఉన్న నత్రజని కలిపే సూక్ష్మ జీవులు, నేలకు పుష్టి తెచ్చే బ్యాక్టీరియా, కార్బన్ నిల్వ చేసే జీవాలు అన్ని నాశనం అవుతాయని హెచ్చరించారు. పంట పెరుగుదలకు ప్రధాన ఆధారమైనవి నశిస్తే నేల బలహీనమై పండించే శక్తి తగ్గిపోతుందని తెలిపారు. నేల సేంద్రియ పదార్థం తగ్గిపోయి వరి గడ్డిలో సహజంగా ఉండే నత్రజని, ఫాస్ఫరస్, పొటాష్, కార్బన్ వంటి ముఖ్యమైన పోషకాలు తగలబెట్టే సమయంలో ఇవన్నీ పొగ రూపంలో ఎగిరిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గణేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు శోభారాణి, సత్యం, రైతులు పాల్గొన్నారు.

## బాలసాహిత్య భేరికి కోదాడ విద్యార్థి

ప్రజాపక్షం/ కోదాడ: ఉత్తర అమెరికా తెలుగు సంఘం(నాస) ప్రతిష్టత్మకంగా నవంబర్ 30న ఆన్‌లైన్‌లో నిర్వహించు బాలసాహిత్య భేరికి కోదాడ బాలుర ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి సోమ రమేష్ ఎంపికైన్నట్లు గురువారం హెచ్‌ఎం డి.మార్కండేయులు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు విద్యార్థులకు కథ, వనచ కవిత్వం, గేయం, పద్యం విభాగాలలో పోటీలను నిర్వహించారు. కథ వచన విభాగంలో రమేష్ 3 నిమిషాల వ్యవధిలో తన కథను వినిపిస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థికి మండల విద్యాధికారి ఎం.డి సలీంషరీఫ్, తెలుగు ఉపాధ్యాయులు వీరబ్రహ్మచారి, ముక్కమాల జానకిరామ్, చిన్నప్ప, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

# నల్లగొండలో మొదటి రోజు సర్పంచ్‌లకు 421

### వార్డు సభ్యలకు 234 దాఖలు
### మొదలైన పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ



ప్రజాపక్షం/నల్లగొండ: గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా మొదటి విడత ఎన్నికలు జరిగే నల్లగొండ,చండూరు డివిజన్లలో గురువారం మొదటి రోజు నామినేషన్లు ప్రక్రియ ప్రారంభమయ్యాయి.మొదటి రోజు నామినేషన్ వేయడానికి అభ్యర్థులు మక్కువ చూపకపోయినప్పటికీ నామినేష పత్రాలను తీసుకోవడంలో ముందున్నారు.గ్రామాలలో సర్పంచ్, వార్డ్ మెంబర్ల అభ్యర్డుల ఎంపికలో రాజకీయ పార్టీల నాయకులు బిజీగా ఉండడంతో అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయలేకపోయారు.జిల్లాలో మొదటి విడుత జరుగుతున్న గ్రామపంచాయతీలలో 318 సర్పంచ్‌లకు 421 నామినేషన్ దాఖలు చేశారు.అదేవిధంగా 2870వార్డు లకు గాను కేవలం 234 నామినేషన్ల దాఖలు చేశారు. మండలాల వారిగా చండూర్ మండలంలో 19గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌కి29, వార్డు మెంబర్‌కు166గాను 21 నామినేషన్ల, చిట్యాల 18 పంచాయతీలకు సర్పంచ్‌కి 29,వార్డు మెంబర్‌కు 180గాను 21నామినేషన్ల,గట్టుప్పల్ 7 పంచాయతీలకు సర్పంచ్‌కి10,వార్డు మెంబర్‌కు 68 గాను 4నామినేషన్ల,కనగల్ 31పంచాయతీలకు 44,వార్డు మెంబర్‌కు262గాను 7 నామినేషన్ల,కట్టంగూర్ 22 పంచాయతీలకు 23,వార్డు మెంబర్‌కు206గాను 21నామినేషన్ల,కేతేపల్లి 16 పంచాయతీలకు 31,వార్డు మెంబర్‌కు160 గాను 10నామినేషన్ల,మర్రిగూడ 18పంచాయతీలకు 2,170వార్డు మెంబర్‌కు గాను 9 నామినేషన్ల, మునుగోడు 28 పంచాయతీలకు 33,వార్డు మెంబర్‌కు244గాను 20 నామినేషన్ల,నకిరేకల్ 17పంచాయతీలకు 21,160వార్డు మెంబర్‌కుగాను 11నామినేషన్ల,నల్లగొండ 31పంచాయతీలకు 25,వార్డు మెంబర్‌కు 270గాను 16 నామినేషన్ల,నాంపల్లి 32పంచాయతీలకు 27,వార్డు మెంబర్‌కు276 గాను 16 నామినేషన్ల, నార్కెట్‌పల్లి 29పంచాయతీలకు 47,వార్డు 262మెంబర్‌కు గాను 43 నామినేషన్ల,శాలిగౌరారం 24పంచాయతీలకు 34,వార్డు మెంబర్‌కు 230 గాను 10 నామినేషన్ల, తిప్పర్తి 26పంచాయతీలకు47,వార్డు మెంబర్‌కు 216గాను 25 నామినేషన్ల దాఖలు చేశారు.

# బాల్యవివాహాలను అరికడదాం

### నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : బాల్య వివాహల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిభా పూలే బాలికల విద్యాలయంలో మహాత్మా జ్యోతిభా పూలే బాలికల విద్యాలయంలో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్, ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన బాల్య వివాహ విముక్త భారత్ ప్రథమ వార్షికోత్సవం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగడంతో ముఖ్యంగా ఆడ పిల్లలకే ఎక్కువ నష్టం జరుగుతుందని ఆయన అన్నారు. మొదట చదువు కొనసాగించాడు కష్టమైపోతుందని, కుటుంబానికి బానిసలా సేవలు చేయాల్సి వస్తుందని, చిన్న తనంలోనే సంతానం కలుగడంతో, సహజ ప్రసవానికి అవకాశం లేకుండా ఆపరేషన్ చేయాల్సి వస్తుందని, దీంతో ఆరోగ్యం దెబ్బతింటుందని అన్నారు. భారత ప్రభుత్వం 2030 నాటికి బాల్య వివాహరహిత దేశంగా తయారు చేయడానికి గత సంవత్సరం కేంద్ర మంత్రి అన్నపూర్ణ దేవి చేతులు మీదుగా ప్రారంభమై నేటికీ ఒక సంవత్సరం పూర్తిచేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలోవన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, సిడబ్ల్యూసి చైర్మన్ కృష్ణయ్య,ఐసిడిఎస్ ఇంచార్జి గణేష్, ఎహెచ్‌టియు కృష్ణారెడ్డి,సోనీ,ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ ఎం శోభారాణి,సఖి కౌన్సిలర్ సునిత,మహాత్మా జ్యోతిభా పూలే బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్య,ఉమెన్ హబ్ రాణి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, విద్యార్థులు పాల్గొన్నారు.



## బిసి అభ్యర్థులకు టిఆర్‌పి మద్దతు

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : సర్పంచ్‌గా పోటీ చేసే బీసీ అభ్యర్థులకు టిఆర్పి పూర్తి స్థాయి మద్దతు అందిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ అన్నారు.గురువారం నల్లగొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్లపై 50 సీలింగ్ రాజ్యాంగంలో ఎక్కడా లేదని,అది కేవలం సుప్రీంకోర్టు తీర్పు మాత్రమే అన్నారు. బీసీలకు అన్యాయం జరుగుతోందని కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ ఇచ్చి స్థానిక సంస్థల్లో 17 రిజర్వేషన్ మాత్రమే ఇవ్వడం అనేది మోసమని విమర్శించారు.బీసీల కోసం పోరాడుతున్న ఏకైక నాయకుడు తీన్మార్ మల్లన్ననే నని ఏ బీసీ అభ్యర్థి అయినా సర్పంచ్,వార్డ్ మెంబర్ గా పోటీ చేయాలనుకుంటే,ఉమ్మడి నల్లగొండలో టిఆర్‌పి నాయకులను సంప్రదించి సహాయం పొందవచ్చు అని సూచించారు. బీసీ బిడ్డ పున్న కైలాస్ నేతను తొలగించామని మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి సిఎం రేవంత్ రెడ్డికి లేఖ రాయడం హాస్యాస్పదాయకం అన్నారు.



# ఎన్నికలు శాంతియుతంగా జరపాలి

### జనరల్ పరిశీలకులు రవి



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : పంచాయతీ ఎన్నికలు నిష్పక్షపాతంగా, శాంతియుత వాతావరణంలో జరుపాలని జనరల్ పరిశీలకులు రవి అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ విసి ఛాంబర్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె నరసింహ తో కలిసి ఆయన గ్రామ పంచాయితీ ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఓటర్లకు అవగాహన కల్పించి తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకొని ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియలో పాల్గొనేలా చూడాలన్నారు. ఓటర్ స్లిప్స్ పంపిణీలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలపై వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో నిజ నిర్ధారణ చేసిన తర్వాతనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉద్యోగులు ఎన్నికల్లో అభ్యర్థులకు మద్దతు తెలిపినా, ప్రచారంలో పాల్గొన్నా ఎన్నికల కమిషన్ అట్టి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ మొదటి విడతలో సూర్యాపేట, ఆత్మకూర్(ఎస్), తుంగతుర్తి, తిరుమలగిరి, మద్దిరాల, నాగారం, నూతనకల్, జాజిరెడ్డిగూడెం మండలాలలోని 159 గ్రామ పంచాయితీలకు, 1442 వా ర్డులకు ఎన్నికలు జరగనున్నాయన్నారు. రెండవ విడతలో చివ్వెంల, పెన్‌పహాడ్, కోదాడ, మునగాల, అనంతగిరి, నడిగూడెం, మోతె, చిలుకూరు మండలాలలోని 181 గ్రామ పంచాయితీలకు, 1628 వార్డులకు అలాగే మూడవ విడత హుజూర్‌నగర్, మఠంపల్లి, మేళ్ళచెర్వు, చింతలపాలెం, పాలకీడు, నేరేడుచర్ల, గరిడేపల్లి మండలాల్లోని 146 గ్రామ పంచాయితీలకు, 1318 వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయని మొత్తం ఓటర్లు 6,94,815 మంది ఉన్నట్లు వివరించారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాలు మొదటి విడతలో 44, రెండవ విడతలో 49, మూడవ విడతలో 38 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యాత్మాక ప్రాంతాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని అభ్యర్థుల ఖర్చులు లెక్కించుటకు 23 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 4 స్టాటిక్ టీమ్‌లు నిరంతరం పర్యవేక్షణ చేస్తాయన్నారు.
జిల్లా ఎస్‌పి కె నరసింహ మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ సాఫీగా సాగేందుకు పోలీస్ శాఖ నామినేషన్ కేంద్రాల వద్ద, పోలింగ్ కేంద్రాలలో భద్రత కొరకు బలగాలను ఏర్పాటు చేశామన్నారు. సోషల్ మీడియాలో రాజకీయ ప్రచారం, అసత్య ప్రచారం, ద్వేష పూరిత పోస్టులు, ఓటర్లను ప్రభావితం చేసే సందేశాలు, ఉద్రిక్తతలను రేకెత్తించే వ్యాఖ్యలు కఠినంగా నిషేధించబడిందని జాగ్రత్తగా పర్యవేక్షించాలని సూచించారు. ఎన్నికల సంబంధిత ఫిర్యాదులు, సూచనలు స్వీకరించి చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయబడిందని ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు వంటి అంశాలపై వెంటనే 6281492368 కు ఫిర్యాదు చేయవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్వపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయంలో అర్వపల్లి, కాసరాబాద్ గ్రామ సర్పంచ్‌లకు, వార్డు సభ్యుల ఎన్నిక నిమిత్తం ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశములో జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిఎస్‌పి రవీందర్ రెడ్డి, జడ్‌పి సిఈఓ వివి అప్పారావు, డిపిఓ యాదగిరి, డిఎల్‌పిఓలు నారాయణరెడ్డి, పార్థసారధి, నోడల్ అధికారులు హాజరైనారు.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## ప్రైవేట్ వర్సిటీల పాలన, పర్యవేక్షణపై దర్యాప్తు

**న్యూఢిల్లీ:** ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు, పరిపాలన, నిధులకు సంబంధించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) పర్యవేక్షణపై దర్యాప్తు చేపట్టాలని సుప్రీంకోర్టు గురువారం ఆదేశించింది. అన్ని ప్రైవేట్, ప్రభుత్వేతర, డీమ్డ్ టు బి యూనివర్సిటీల స్థాపనకు దారితీసిన చట్టాలు, నిబంధనలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివరాలు అందించాల్సిందిగా జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లా నేతత్వంలోని ధర్మాసనం కోరింది. ప్రైవేట్ యూనివర్సిటీలు 'లాభనష్టాలతో సంబంధం లేదు' అనే ప్రాతిపదికన పనిచేస్తామనే హామీ నెరవేర్చడానికి తీసుకున్న చర్యలను బహిర్గతం చేయాలని కేంద్రం, రాష్ట్రాలు, యూజీసీలను ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను వచ్చే ఏడాది జనవరి 8కి వాయిదా వేసింది. అయేషా జైన్ అనే విద్యార్థి అమిటీ యూనివర్సిటీపై దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. అవసరమైన అన్ని పత్రాలు సమర్పించినప్పటికీ యూనివర్సిటీ తన జాబితాలో పేరుమార్పు కోసం చేసిన అభ్యర్థనను తిరస్కరించిందని అయేషా జైన్ పిటిషన్‌లో పేర్కొన్నారు.

### అక్రమ వలసదారుల అంశంపై

## ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు

**బిజెపిపై కాంగ్రెస్ ధ్వజం.. గత 11 ఏళ్లలో చర్య తీసుకోలేకపోయిందని విమర్శ**



**రాయ్‌పూర్:** అక్రమ వలసదారుల అంశంపై ప్రజలను బిజెపి తప్పుదారి పట్టిస్తున్నదని కాంగ్రెస్ ఆరోపించింది. గత 11 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ వారిపై ఏ స్పష్టమైన చర్యలూ తీసుకోలేదని ఛత్తీస్‌గఢ్‌కు కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా కూడా వ్యవహరిస్తున్న సీనియర్ నేత సచిన్ పైలెట్ గురువారం బస్తర్ జిల్లా కేంద్రం జగ్దల్పూర్‌లో మీడియాతో మాట్లాడుతూ విమర్శించారు. బిజెపి మాటల్లో చెప్పేది ఒకటి.. చేతల్లో చూపే ది మరొకటని వ్యాఖ్యానించారు. దశాబ్దకాలంగా ఎంతమంది అక్రమ వలసదారులను గుర్తించి, దేశం బయటకి పంపించో కేంద్ర ప్రభుత్వం వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమ వలసదారులు ఎవరున్నా, చట్టపరంగా వారికి ఇక్కడ ఉండటానికి హక్కు లేదని, ఇక్కడ అక్రమంగా నివసించే వారిపై తప్పనిసరిగా చర్య తీసుకోవాల్సిందేనని, అందుకు తాము కూడా పూర్తిగా మద్దతు ఇస్తామని పైలెట్ అన్నారు. కానీ 11 ఏళ్లుగా బిజెపి ప్రసంగాల్లో మాత్రమే అక్రమ వలసదారుల అంశాన్ని ప్రస్తావిస్తూ, ప్రజలను మభ్యపెడుతోంది. 'అస్సాంలో బిజెపి ప్రభుత్వం ఉంది. అక్కడ ఎంతమంది అక్రమ వలసదారులపై చర్య తీసుకున్నారో డేటా చూపాలి' అని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ అక్రమ వలసదారుల పక్షంలో ఉందని తప్పుడు ప్రచారం చేస్తూ, ఎన్నికల సమయంలో ప్రజలను మోసగించే గిమ్మిక్కులకు బిజెపి పాల్పడుతున్నదని అన్నారు. ఇది ఎన్నికల సమయంలో ప్రజలను మోసగించడానికి, సెందుకు ఉపయోగించే గిమ్మిక్ మాత్రమే, అని పైలెట్ అన్నారు. దేశవ్యాప్తంగా న్యాయ–సూత్ర అంశాలపై చర్చించడానికి ఛత్తీస్‌గఢ్‌లో శుక్రవారం నుంచి బిజెపి సమ్మేళనం జరుగుతున్నప్పటికీ, రాష్ట్రంలో జరుగుతున్న నేరాలపై ఎవరూ బాధ్యత తీసుకోవడం లేదని ఆయన విమర్శించారు. ఛత్తీస్‌గఢ్‌లో దోపిడీ, దుర్వినియోగాలు, మహిళలపై నేరాలు జరుగుతున్నాయని, కానీ ఎవ్వరూ బాధ్యత వహించడం లేదని పైలెట్ అన్నారు. ఎన్నికల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) జరుగుతున్న సందర్భంలో, కాంగ్రెస్ ఇచ్చిన ఆధారాలు, పత్రాలపై చర్య ఎందుకు తీసుకోవడం లేదని ఆయన ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. 'బీహార్ ఓటర్ జాబితా నుండి లక్షల మంది పేర్లు ఎలా మాయమయ్యాయి? రాహుల్ గాంధీ ఓటర్ల పేర్ల తొలగింపునకు సంబంధించిన సాక్ష్యాలను చూపిస్తూ పత్రికా సమావేశాన్ని కూడా ఏర్పాటు చేశారు. దురదృష్టవశాత్తూ ఇసి కనీసం విచారణకైనా ఆదేశించలేదు' అని ఆయన అన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగాలని డిమాండ్ చేశారు. దళితులు, ఆదివాసీలు, పేదలు, వెనుకబడిన వర్గాల నిజమైన ఓటర్లు బిజెపి లక్ష్యంగా మారవచ్చని కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేస్తోందని పైలెట్ అన్నారు. 'ఈ దేశంలో ఒక్క నిజమైన ఓటరునైనా బయటకు నెట్టివేయడానికి వీల్లేదు. న్యాయం ఉండాలనే మేము ఒత్తిడి తెస్తూనే ఉంటాం' అని పైలెట్ హామీ ఇచ్చారు. 'అక్రమ వలసదారులు' లేదా 'ఇన్ఫిల్ట్రేటర్స్' అనే పదాన్ని బిజెపి పదే పదే ఉపయోగిస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నదని అంటూ, సమాచారం ఉన్నప్పుడు ఎందుకు చర్య తీసుకోవడం లేదని నిలదీశారు. ఛత్తీస్‌గఢ్‌లో పేద, వెనుకబడిన వర్గాల వారు చాలా మంది ఉన్నారని, వారంతా అక్రమ వలసదారులా అని ప్రశ్నించారు. దేశంలో పంటలు వేస్తూ, కోతలు కోస్తూ తీరిక లేకుండా ఉంటారని, అలాంటప్పుడు డాక్యుమెంట్లు సేకరించడానికి వారికి సమయం ఎక్కడ ఉంటుందని అడిగారు. వారంతా ఈ దేశంలోకి చొరబడినవారని ఎలా నిర్ధారిస్తారో తెలియడంలేదన్నారు. టాప్ మావోయిస్టు కమాండర్ హిడ్మా ఎన్‌కౌంటర్‌పై కాంగ్రెస్ వైఖరిని గురించి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, కాంగ్రెస్‌కు అతి దీర్ఘకాలిక తీవ్రవాద వ్యతిరేక చరిత్ర ఉందని పైలెట్ అన్నారు. 'స్వాతంత్ర్యానికి ముందే, కాంగ్రెస్ దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వానికి ప్రాధాన్యం ఇచ్చింది. తీవ్రవాదం ముందు మేమెప్పుడూ తలవంచలేదు. నక్సలిజం, తీవ్రవాదం, వేర్పాటువాదం ఎదురువచ్చినా మేము ఎదుర్కొని ఓడించాం' అన్నారు.

## ఆధార్ పౌరసత్వానికి ఆధారం కాదు'సుప్రీం'



**న్యూఢిల్లీ:** చొరబాటుదారులు ఆధార్ కార్డులు సంపాదించడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. పౌరులు కానివారు ఆధార్ కలిగిఉంటే... వారికి ఓటు హక్కు కూడా ఇచ్చేయాలా అని ప్రశ్నించింది. ఓటర్ల జాబితాలకు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై విచారణలో భాగంగా అత్యున్నత న్యాయస్థానం గురువారం ఈ వ్యాఖ్యలు చేసింది. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్‌లో 'ఎస్ఐఆర్' కసరత్తుపై ఎన్నికల సంఘం (ఈసీ) నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం విచారణ చేపట్టింది. పౌరసత్వానికి ఆధార్ రుజువు కాదని స్పష్టం చేసింది. 'ఆధార్ సామాజిక సంక్షేమ ప్రయోజనాలు అందరికీ చేరేలా చూసుకోవడానికి ఏర్పాటుచేసింది మాత్రమే. రేషన్ కోసం ఆధార్ పొందిన వ్యక్తిని... ఓటర్‌ను చేయాలా? విదేశాలకు చెందినవారు ఇక్కడ కార్మికుడిగా పనిచేస్తే... వారికి కూడా ఓటు హక్కు కల్పించాలా' అని ధర్మాసనం ప్రశ్నించింది. ఓటరు నమోదు ఫారం 6లో పేర్కొన్న వివరాలు సరైనవో, కావో నిర్ధారించుకునే అధికారం ఈసీకి ఉందని తేల్చి చెప్పింది. కొంతమంది పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ... ఎస్ఐఆర్ ప్రక్రియ సాధారణ పౌరులపై రాజ్యాంగ విరుద్ధమైన భారాన్ని మోపుతుందన్నారు. వారిలో అనేకమంది నిరక్షరాస్యులు ఉన్నారన్నారు. ఈ మొత్తం ప్రక్రియ ప్రజాస్వామ్యాన్ని ప్రభావితం చేస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ నిర్వహించడాన్ని ప్రత్యేకంగా సవాల్ చేసిన పిటిషన్ల విచారణకు సుప్రీం షెడ్యూల్ చేసింది. డిసెంబరు 1లోపు వీటిపై స్పందన తెలియజేయాలని ఈసీని కోరింది.

## కొలంబో చేరిన 'విక్రాంత్', 'ఉదయగిరి'



**న్యూఢిల్లీ:** భారత తొలి స్వదేశీ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్, బహుళమిషన్ స్టెల్త్ ఫ్రిగేట్ ఉదయగిరి కొలంబో చేరాయి. ఈ విషయాన్ని భారత నేవీ అధికారులు తెలిపారు. శ్రీలంక నౌకాదళం 75వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించనున్న అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష (ఐఎఫ్ఆర్) కోసం ఇవి అక్కడికి వెళ్లినట్టు పేర్కొన్నారు. 2025 ఆగస్టు 26న కమిషన్ అయిన ఐఎన్ఎస్ ఉదయగిరికి ఇది తొలి విదేశీ పర్యటన. శ్రీలంక నేవీ వెబ్‌సైట్‌ను ఉటంకిస్తూ, పిటిఐ ఇచ్చిన వివరాలను అనుసరించి నౌకాదళ సహకారానికి ఉదాహరణగా, బంగ్లాదేశ్, భారత దేశానికి చెందిన మూడు యుద్ధనౌకలు ఈనెల 25, 26 తేదీల్లో కొలంబోలోకి చేరాయి. ఐఎఫ్ఆర్ ఈనెల 30వ తేదీ ఆదివారం జరగనుంది.

### 2014 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్

## పరాజయానికి సిఐఎ, మోసాద్ కుట్ర

**కాంగ్రెస్ మాజీ ఎంపి కేత్కర్ ఆరోపణ**



**ముంబయి:** అమెరికా, ఇజ్రాయెల్ గూఢచారి సంస్థలు సిఐఎ, మోసాద్ 2014 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమికి కుట్రపన్నాయని, వ్యూహరచన చేశాయని కాంగ్రెస్ నాయకుడు, ఆ పార్టీ మాజీ ఎంపి కుమార్ కేత్కర్ ఆరోపించారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 145 స్థానాలు గెలుచుకుంది. ఐదేళ్ల తర్వాత 2009 ఎన్నికల్లో 206 సీట్లు సాధించింది. ఈ ధోరణి కొనసాగి ఉంటే, కాంగ్రెస్ 250 సీట్లు గెలిచి సులభంగా అధికారాన్ని నిలబెట్టుకొని ఉండేదని కేత్కర్ అన్నారు. అయితే 2014లో పార్టీ సీట్లు 44కి పడిపోయాయని గుర్తుచేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ అధికారంలోకి రాకూడదని భావించిన సిఐఎ, మోసాద్ కలిసి ప్రణాళికను సిద్ధం చేశాయని అన్నారు. కాంగ్రెస్ సీట్లు ఎట్టి పరిస్థితుల్లోనూ 206 కంటే మించకూడదని ఆ రెండు నిఘా సంస్థలు తీర్మానించుకున్నాయని అన్నారు. కాంగ్రెస్‌ను 206 నుంచి కిందకు దించకపోతే, భారత్‌లో తమ ఆటలు సాగవని కొన్ని సంస్థలు భావించాయని కేత్కర్ ఆరోపించారు. స్థిరమైన కాంగ్రెస్ ప్రభుత్వం లేదా కాంగ్రెస్ ఆధ్వర్యంలోని కూటమి మళ్లీ అధికారంలోకి వస్తే, అవి భారత్ విషయాల్లో జోక్యం చేసుకోవడం, తమ విధానాలను అమలు చేయడం అసాధ్యమవుతుందని ఈ సంస్థలు భావించాయని అని మాజీ జర్నలిస్టు కూడా అయిన కేత్కర్ ఆరోపించారు. అన్ని రాష్ట్రాలు, నియోజకవర్గాలపై పూర్తివివరాలున్న డేటా సిఐఎ, మోసాద్‌ల వద్ద ఉందని అన్నారు. 2014లో అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్‌పై అసంతృప్తి ఉన్నప్పటికీ, అది కాంగ్రెస్‌ను 206 నుంచి 44 సీట్లకు దించిపోయేంత తీవ్రంగా లేదని ఆయన వ్యాఖ్యానించారు. పార్టీకి ప్రతిపక్ష నాయకుడి పదవి పొందడానికి కూడా కావాల్సిన సంఖ్య రాలేదని గుర్తుచేశారు. 2014 నాటి తీర్పును ఆయన ప్రజల తీర్పు కాకుండా, అమెరికా, ఇజ్రాయెల్ నిఘా సంస్థల తీర్పుగా అభివర్ణించారు.

## వైద్య కళాశాలల్లో భారీ అవినీతి

### 10 రాష్ట్రాల్లో ఇడి మెరుపు దాడులు

**న్యూఢిల్లీ:** వైద్య కళాశాలల అనుమతుల వ్యవహారంలో లంచాలు, గోప్య సమాచారం లీక్ కేసు దర్యాప్తులో భాగంగా దేశవ్యాప్తంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు చేపట్టింది. గత కొంత కాలంగా దేశంలోని వివిధ వైద్య కళాశాలల్లో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్నట్లు విమర్శలు వస్తున్న సంగతి విదితమే. ఈ నేపథ్యంలోనే ఈడీ కీలక దర్యాప్తు చేపట్టింది. గురువారం ఏకకాలంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, రాజస్థాన్, బీహార్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీతో సహా 10 రాష్ట్రాల్లోని 15 ప్రాంతాల్లో మెరుపు సోదాలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది జూన్ 30న సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) నిబంధనల కింద ఈ సోదాలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ కేసులో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) అధికారులతో సహా పలువురు ప్రభుత్వ అధికారులకు లంచాలు చెల్లించారని సీబీఐ తన ఎఫ్ఐఆర్‌లో ఆరోపించింది. వైద్య కళాశాలల తనిఖీలకు సంబంధించిన అత్యంత రహస్య సమాచారాన్ని సదరు అధికారులు లంచం తీసుకుని ఆయా కళాశాలల కీలక అధికారులకు, దళారీలకు చేరవేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ రహస్య సమాచారం సహాయంతో కళాశాలల యాజమాన్యాలు తనిఖీకి ముందు అవసరమైన పారామితులను, మౌలిక వసతులను తారుమారు చేసి, అక్రమంగా అకడమిక్ కోర్సులను నిర్వహించడానికి అనుమతులు పొందాయని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి.ఈ భారీ అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఈడీ బందాలు ప్రధానంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఏడు వైద్య కళాశాలల ప్రాంగణాలలో తనిఖీలు నిర్వహించాయి. అంతేకాకుండా సీబీఐ ఎఫ్ఐఆర్‌లో నిందితులుగా పేర్కొనబడిన కొందరు ప్రైవేట్ వ్యక్తులు, దళారుల నివాసాలు కూడా ఈ సోదాలలో భాగంగా ఉన్నాయి. ఈ సోదాల ద్వారా పెద్ద ఎత్తున అక్రమ లావాదేవీలు, మనీలాండరింగ్ కార్యకలాపాలకు సంబంధించిన పత్రాలు, డిజిటల్ సాక్ష్యాలు లభించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

## మనీలాండరింగ్ కేసులో

### విన్జో వ్యవస్థాపకుల అరెస్ట్





**న్యూఢిల్లీ/బెంగళూరు:** ఆన్‌లైన్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫారమ్ విన్జో వ్యవస్థాపకులు సౌమ్యా సిం గ్ రాథోర్, పావన్ నం దాలను మనీ లాండరి ంగ్ ఆరోపణలపై గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అరెస్ట్ చేసింది. బెంగళూరులో ని ఇడిజోనల్ ఆఫీసులో బుధవారం విచారణ అనంతరం ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. అదే రాత్రి కోర్టులో హాజరు పరిచిన అనంతరం ఒక రోజు కస్టడీలోకి పంపారు. రూ. 43 కోట్లు విలువైన గేమర్ల డబ్బును విన్జో తిరిగి చెల్లించలేదని ఇడిఆరోపించింది. 2025 ఆగస్టు 22న రియల్‌మనీ గేమింగ్ నిషేధించిన తర్వాత కూడా ఈ మొత్తాన్ని కంపెనీ వద్దే ఉంచిందని వెల్లడించింది. విన్జో, గేమ్జ్‌క్రాఫ్ట్ కార్యాలయాలపై గత వారం మనీలాండరింగ్ నిరోధక చట్టం అమలులోభాగంగా దాడులు జరిగాయి. గేమర్లను మనుషులతో కాకుండా అల్గోరిథమ్‌తో ఆడేలా మోసపూరితంగా కంపెనీ వ్యవహరించిందని ఇడి ఆరోపించింది. బ్రెజిల్, అమెరికా, జర్మనీ వంటి దేశాల్లోనూ ఇదే ప్లాట్ ఫారమ్ ద్వారా ఆర్ఎంజి ఆపరేట్ చేసినట్లు పేర్కొంది. విన్జోకు చెందిన బాండ్లు, ఎఫ్‌డి లు, మ్యూచువల్ ఫండ్‌లు సహా రూ. 505 కోట్లు విలువైన ఆస్తులను ఇడి ఫ్రీజ్ చేసింది. ఈ భారత సంస్థ డబ్బులను అమెరికా, సింగపూర్‌కు ఓవర్సీస్ ఇన్వెస్ట్‌మెంట్స్ పేరుతో మళ్లించిందని ఇడి తెలిపింది. అమెరికాలో విన్జో పేరిట ఉన్న ఖాతాలో 55 మిలియన్ డాలర్ల (రూ. 490 కోట్లకు పైగా) నిల్వ ఉన్నప్పటికీ, ఆ కంపెనీ 'షెల్ కంపెనీ' మాత్రమే అని ఇడి తన ఫిర్యాదులో పేర్కొంది. ఇలావుంటే, విన్జో, గేమ్జ్‌క్రాఫ్ట్ సంస్థల ప్రతినిధులు తమతమ కంపెనీలపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. చట్టాలకు అనుగుణంగానే వ్యవహరిస్తున్నామని, ఎక్కడా ఉల్లంఘన జరగలేదని పేర్కొన్నారు.

## భారత్–మయన్మార్ సరిహద్దులో ఇడి దాడులు..

**న్యూఢిల్లీ/ఐజాల:** డ్రగ్ ట్రాఫికింగ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో భారత్–మయన్మార్ సరిహద్దు ప్రాంతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) గురువారం మొట్టమొదటిసారిగా దాడులు నిర్వహించింది. మిజోరంలోని ఐజాల్, చాంఫై, అస్సాంలోని శ్రీభూమి (కరీమ్గంజ్), గుజరాత్‌లో అహ్మదాబాద్ ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయి. రూ. 35 లక్షల నగదు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్న ఇడి ఆరుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ. 1.41 కోట్లు విలువచేసే 4.72 కేజీల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకుంది. అరెస్టయిన వారి ఆర్థిక లావాదేవీలు మిజోరం, గుజరాత్ కంపెనీలతో ఉందని గుర్తించింది. భారత్ తూర్పు వైపు మయన్మార్‌తో 1,643 కిమీ పొడవైన సరిహద్దును పంచుకుంటుంది. ఆ ప్రాంతాల్లో దాడులు నిర్వహించడం ఇదే మొదటిసారిమొదటిసారి.

## 26 లక్షల మంది ఓటర్ల పేర్లు సరిపోలడం లేదు

**బెంగాల్‌లో ఎస్ఐఆర్ కసరత్తుపై ఇసి**




**న్యూఢిల్లీ:** పశ్చిమ బెంగాల్ ప్రస్తుత ఓటర్ల జాబితాలలో దాదాపు 26 లక్షల మంది ఓటర్ల పేర్లు 2002 ఓటర్ల జాబితాతో సరిపోలడం లేదని ఎన్నికల సంఘం నివేదించిందని ఒక అధికారి తెలిపారు. గత సారాంశ సవరణ (ఎస్ఐఆర్) కసరత్తులో 20 02 2006 మధ్య వివిధ రాష్ట్రాలలో తయారు చేసిన వాటితో రాష్ట్ర తాజా ఓటర్ల జాబితాను పోల్చిన తర్వాత ఈ వ్యత్యాసం వెలుగులోకి వచ్చిందని ఆయన బుధవారం సాయంత్రం తెలిపారు. ఈసీ వర్గాల ప్రకారం, కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ కింద బుధవారం మధ్యాహ్నం నాటికి పశ్చిమ బెంగాల్‌లో ఆరు కోట్లకు పైగా గణన ఫారమ్‌లను డిజిటలైజ్ చేశారు. 'డిజిటలైజ్ చేసిన తర్వాత ఈ ఫారమ్‌లను మ్యాపింగ్ విధానం కిందకు తీసుకువస్తారు. అక్కడ వాటిని మునుపటి ఎస్ఐఆర్ రికార్డులతో సరిపోల్చుతారు. రాష్ట్రంలోని దాదాపు 26 లక్షల మంది ఓటర్ల పేర్లను గత ఎస్ఐఆర్ జాబితాతో ఇంకా సరిపోల్చలేమని ప్రాథమిక పరిశోధనలు చూపిస్తున్నాయి' అని ఒక అధికారి పీటీఐకి చెప్పారు. డిజిటలైజేషన్ కొనసాగుతున్నందున ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఎన్నికల సందర్భంలో 'మ్యాపింగ్' అంటే 2002లో చివరిగా సంకలనం చేయబడిన ఎస్ఐఆర్ జాబితాలతో తాజాగా ప్రచురించబడిన ఓటరు జాబితాను తనిఖీ చేయడానికి సూచిస్తుంది. ఈ సంవత్సరం మ్యాపింగ్ కసరత్తులో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఓటరు జాబితాలు కూడా చేర్చబడ్డాయి. మరింత సమగ్రమైన, కచ్చితమైన ధ్రువీకరణ ప్రక్రియను నిర్ధారించడానికి ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం తీసుకున్న చర్య అని ఆయన తెలిపారు. మ్యాపింగ్‌లో వ్యత్యాసాలు ఉంటే తుది ఓటర్ల జాబితా నుంచి స్వయంచాలకంగా తొలగించబడటం కాదని అధికారి స్పష్టం చేశారు .

## కొత్త కార్మిక కోడ్‌లను

### తక్షణమే ఉపసంహరించుకోవాలి

**అసంఘటిత కార్మికుల కాంగ్రెస్ డిమాండ్..**

**న్యూఢిల్లీ:** మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త కార్మిక కోడ్‌లను అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇవి కార్మిక వ్యతిరేకమని ఆరోపిస్తూ, వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసింది. గురువారం ఇక్కడ జరిగిన మీడియా సమావేశంలో ఈ సంస్థ చైర్మన్ ఉదిత్ రాజ్ మాట్లాడుతూ, ఈ కార్మిక కోడ్‌లకు వ్యతిరేక ఉద్యమాన్ని దేశ వ్యాప్తంగా ప్రారంభిస్తామని హెచ్చరించారు. కొత్త కార్మిక కోడ్‌లు ప్రమాదకర ధోరణితో ఉన్నాయని అంటూ, కార్మికుల ప్రయోజనాలను కాపాడిన పాత కార్మిక చట్టాలు హత్యకు గురయ్యాయని వ్యాఖ్యానించారు. 44 కోట్ల మంది అసంఘటిత కార్మికుల సంక్షేమాన్ని భారీ కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు తాకట్టు పెట్టారని విమర్శించారు. కార్మికుల హక్కులను కోడ్స్ తగ్గిస్తున్నాయని, సమ్మె చేసే హక్కు కూడా వారికి లేకుండా పోయిందని ఉదిత్ రాజ్ అన్నారు. ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్ 2020, ఆక్యుపేషనల్ సేఫ్టీ అండ్ హెల్త్ కోడ్ 2020, సోషల్ సెక్యూరిటీ కోడ్ 2020, వేతనాల కోడ్ 2019 అనే నాలుగు కొత్త కోడ్‌లు కార్మికులకు మిక్కిలి హానికరమని, వారి హక్కులను హరించడమేగాక, ఉద్యోగ భద్రతను నాశనం చేస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మార్పు కార్పొరేట్ల ప్రయోజనాలకు ఉద్దేశించింది మాత్రమేనని పేర్కొన్నారు. ఈ కార్మిక వ్యతిరేకమైన కొత్త కోడ్‌లను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో భద్రత, ఆరోగ్యంపై కఠినమైన ఉద్యోగ చట్టాలు ఉండేవని, కానీ ఇప్పుడు తనిఖీ వ్యవస్థను బలహీనపరిచి, చాలా సడలింపుల ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకొచ్చారని ఉదిత్ రాజ్ చెప్పారు. కొత్త కార్మిక కోడ్‌లలో ఇన్‌స్పెక్షన్ వ్యవస్థ బలహీనపడడంతో కార్మికుల దోపిడీ పెరుగుతుందని, ఉద్యోగ దాతలకు ఎన్నో చట్టపరమైన పరిమితుల నుంచి మినహాయింపులు లభిస్తాయని ఆయన ఆరోపించారు. కొత్త కోడ్‌ల ప్రకారం గిగ్ వర్కర్లను కేవలం రిజిస్ట్రేషన్ వరకే పరిమితం చేశారని, వారికి ఇఎస్ఐసి లేదా ఇపిఎఫ్ఒ కింద ఎలాంటి అవకాశాలు కల్పించలేదని ఆయన గుర్తుచేశారు. 'హైర్ అండ్ ఫైర్' విధానాన్ని బలపరచడం వల్ల అసంఘటిత కార్మికులకు తీవ్రమైన ఇబ్బందులు వస్తాయని, వారి ఉద్యోగ భద్రత పూర్తిగా నశిస్తుందని అన్నారు. ఈ నాలుగు కార్మిక కోడ్‌లతో కార్మికుల హక్కులు తుడిచిపెట్టుకుపోతాయని, వాటిని వెంటనే రద్దు చేయాలని అన్నారు.



## కొత్త కార్మిక కోడ్‌లు రద్దు చేయాలి

**ఎఐయుడబ్ల్యూసి డిమాండ్**

**న్యూఢిల్లీ:** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త కార్మిక కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ (ఏఐయుడబ్ల్యూసి) డిమాండ్ చేసింది. గురువారం ఏఐయూడబ్ల్యూసీ అధ్యక్షుడు ఉదిత్‌రాజ్ విలేకరులతో మాట్లాడారు. లేబర్‌కోడ్‌లు కార్మిక వ్యతిరేకమని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.ఇందుకోసం దేశవ్యాప్తంగా కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించనున్నట్లు చెప్పారు. కొత్త కార్మిక కోడ్‌లు ప్రమాదకరమైన ధోరణికి నాంది పలుకుతాయని పేర్కొంటూ, కార్మికుల ప్రయోజనా లను, ముఖ్యంగా అసంఘటిత కార్మికుల ప్రయోజనాలను కాపాడే పాత కార్మిక చట్టాలను ఖూనీ చేశారని దుయ్యబట్టారు. 44 కోట్ల మంది అసంఘటిత కార్మికులను పెద్ద కార్పొరేట్లు , ఆశ్రిత పెట్టుబడిదారుల దయాదాక్షిణ్యాలకు వదిలేశారన్నారు. కొత్త కోడ్‌ల ద్వారా కార్మిక హక్కుల్ని కాలరాశారని, వారు ఇకపై సమ్మె చే యలేరన్నారు. నాలుగు లేబర్‌కోడ్‌లు కార్మికులకు అత్యంత హానికరమని, కార్మిక హక్కుల్ని పూర్తిగా హరిస్తాయమని తెలిపారు. కార్మికుల ఉద్యోగ భద్రతను కాలరాయడమేకాక కార్పొరేట్ల ప్రయోజనాలకు కొమ్ముకాస్తాయని ఉదిత్‌రాజ్ ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం ఈ కార్మిక వ్యతిరేక కొత్త కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశ ంలో వత్తి భద్రత, ఆరోగ్యంపై గతంలో కఠినమైన చట్టాలు ఉండేవని, కానీ ఇప్పుడు తనిఖీ వ్యవస్థను రద్దు చేశారని... చాలా సరళతరమైన చట్రాన్ని ప్రవేశపెట్టారని రాజ్ అన్నారు. తనిఖీ వ్యవస్థ బలహీనపడటం వల్ల కార్మికుల శ్రమ దోపిడీ పెరుగుతుందని, యజమానులు అనేక చట్టపరమైన పరిమితుల నుండి మినహాయింపులు పొందుతారని ఆయన ఆరోపించారు.

## సీట్ల సర్దుబాటుపై ఉద్ధవ్, రాజ్ చర్చలు



**ముంబయి:** శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే గురువారం ముంబైలో మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రేను కలిశారు. రాబోయే మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు సీట్ల పంపకాల ఏర్పాట్లపై ఇద్దరు నాయకులు చర్చించినట్లు తెలుస్తోంది. ఉద్ధవ్ సెంట్రల్ ముంబైలోని దాదర్‌లోని రాజ్ నివాసం 'శివతీర్థం' ను సందర్శించారు. ఒకప్పుడు రాజకీయంగా విడిపోయిన బంధువుల మధ్య ఈ సంవత్సరం జరిగిన వరుస సమావేశాలలో ఇది తాజాది. ఇటీవలి కాలంలో వారి పార్టీల మధ్య సయోధ్య, పొత్తుకు సంకేతాలు వస్తున్న నేపథ్యంలో వారు ఒకరికొకరు సన్నిహితంగా ఉంటున్నారు. శివసేన (యూబీటీ), ఎంఎన్ఎస్ ఇంకా అధికారికంగా పొత్తును ప్రకటించనప్పటికీ, ఠాక్రే బంధువులు స్థానిక సంస్థల ఎన్నికలకు, ముఖ్యంగా కీలకమైన బహన్ ముంబై మునిసిపల్ కార్పొరేషన్ (బీఎంసీ), ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతం, పూణే, నాసిక్‌లోని ఇతర పౌర సంస్థల ఎన్నికలకు త్వరలో పొత్తు కుదుర్చుకునే సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో ఉద్ధవ్, రాజ్ పౌర ఎన్నికలకు తమ పార్టీల మధ్య సీట్ల పంపకం, ఓటర్ల జాబితాలో జరిగిన అక్రమాల గురించి చర్చించారని భావిస్తున్నట్లు శివసేన (యూబీటీ) నాయకుడు ఒకరు వెల్లడించారు. ప్రతిపక్షాలు ఈ అంశాన్ని తీవ్రంగా లేవనెత్తుతున్నాయి. శివసేన (యూబీటీ) భాగస్వామి అయిన కాంగ్రెస్... ఎంఎన్ఎస్‌తో పొత్తును ప్రతిఘటిస్తున్నట్లు నివేదించబడిన విషయాన్ని కూడా వారు చర్చించారని ఆయన అన్నారు. కాగా ఈ వారం ప్రారంభంలో ఉద్ధవ్, రాజ్ ముసాయిదా ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, సూచనలను సమర్పించడానికి మరింత సమయం కోరుతూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖ సమర్పించారు. మహారాష్ట్ర ప్రస్తుతం గ్రామీణ, పట్టణ డిసెంబరు 2న 246 మునిసిపల్ కౌన్సిల్‌లు, 42 నగర పంచాయతీలకు ఎన్నికలు జరుగుతాయి. వాటి తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా 336 పంచాయతీ సమితిలు, 32 జిల్లా పరిషత్‌లు, 29 మునిసిపల్ కార్పొరేషన్‌లకు ఎన్నికలు (షెడ్యూల్ ఇంకా ప్రకటించలేదు) జరుగుతాయి. జనవరి 31 నాటికి మొత్తం స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలి.

## దివ్యాంగులకూ ఎస్సీ, ఎస్టీ తరహా చట్టం

**న్యూఢిల్లీ:** దివ్యాంగులను కించపరిచే వారిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా ఎస్సీ/ఎస్టీ చట్టం లాంటి కఠినమైన చట్టాలు అవసరమని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. ఈ దిశగా ఆలోచన చేయాలని కేంద్రానికి సూచించింది. యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా, సమయ్ రైనాకు సంబంధించి పిటిషన్ల విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. కండరాల క్షీణత సమస్యపై అవగాహన కల్పిస్తూ బాధితులతో కలిసి ఓ ప్రదర్శన నిర్వహించాలని సమయ్ రైనాకు సు ప్రీం కోర్టు సూచించింది. ఓ ఆన్‌లైన్ షోలో వెన్నెముక కండరాల క్షీణత(ఎస్ఎంఏ)తో బాధపడుతున్న ఓ చిన్నారికి అవసరమైన ఔషధాల గురించి ప్రస్తావిస్తూ వారిని కించపరిచే విధంగా సమయ్ రైనా మాట్లాడాడు. ఈ షోలో పాల్గొన్న వారిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ అరుదైన వ్యాధిపై పోరాడుతున్న స్వచ్ఛంద సంస్థ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన న్యాయస్థానం... ఆ షోలో పాల్గొన్న వారు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆదేశించింది. దీంతో సమయ్ రైనా క్షమాపణలు చెప్పాడు. రణ్‌వీర్ అలహాబాదియా, సమయ్ రైనాకు సంబంధించిన పిటిషన్లను సుప్రీం కోర్టు గురువారం విచారించింది. బాధితుల తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది అపరాజితా సింగ్.. కమెడియన్ వ్యాఖ్యలు చిన్నారులను కించపరిచేలా ఉన్నాయని న్యాయస్థానం దష్టికి తీసుకెళ్లారు. వారు ఎంతో ప్రతిభావంతులని, ఇలాంటి వ్యాఖ్యలు క్రౌడ్ ఫండింగ్‌కు ఇబ్బందిగా మారుతాయన్నారు. వీటితో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతత్వంలోని ధర్మాసనం ఏకీభవించింది. దివ్యాంగులపై ఎవరైనా కించపరిచే వ్యాఖ్యలు చేస్తే... ఎస్సీ/ఎస్టీ చట్టం మాదిరిగా కఠిన చట్టాన్ని తీసుకువచ్చే విషయంపై ఎందుకు ఆలోచించరని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను సుప్రీం ధర్మాసనం అడిగింది. దివ్యాంగులకు రక్షణ కల్పించేందుకు కఠిన చట్టాలు తీసుకువచ్చే విషయంపై ఆలోచించాలని సూచించింది. వారికి కావాల్సింది గౌరవ, మర్యాదలని, వారి విజయాలను చాటిచెప్పేందుకు మీ వేదికను (ఆన్‌లైన్ షో) ఉపయోగించాలని యూట్యూబర్‌లకు సూచించింది.వాటితో వచ్చే నిధులను బాధితుల చికిత్సకు అందజేయాలని ఆదేశించింది.

## ఢిల్లీలో ఎన్‌కౌంటర్..గ్యాంగ్‌స్టర్ అరెస్ట్



**న్యూఢిల్లీ:** ఢిల్లీ లోని ద్వారకలో గురువారం కాల్పుల ఘటన చోటుచేసుకుంది. యాంటీ నార్కోటిక్స్ సెల్‌కు, హిమాన్షు భావు గ్యాంగ్‌కు చెందిన అంకిత్‌కు మధ్య కాల్పులు జరగ్గా... అతని కుడి కాలుకు బులెట్ తగిలింది. ఈ ఎన్‌కౌంటర్ తర్వాత అంకిత్‌ను యాంటీనార్కోటిక్స్ విభాగం అధికారులు అరెస్టు చేశారు. గత నెల చివర్లో రోహిత్ లాంబాపై నలుగురు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా... హిమాన్షు భావు గ్యాంగ్‌కు కాల్పులతో సంబంధం ఉన్నట్లు తేలింది. ఇప్పటికే నలుగురు నిందితులను అరెస్టు చేయగా, ఇద్దరు ప్రధాన షూటర్లు పరారీలో ఉన్నారు. పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు. పరారీలో ఉన్న నిందితులను అంకిత్, దీపక్‌గా అధికారులు గుర్తించారు. ఈ ఇద్దరు నిందితులపై ఢిల్లీ పోలీసులు రూ.25 వేలు రివార్డు ప్రకటించారు. నజాఫ్‌గఢ్‌లోని సాయిబాబా మందిర్ సమీపంలోకి నిందితుల్లో ఒకడైన అంకిత్ వస్తున్నట్లు ద్వారకాలోని యాంటీ నార్కోటిక్స్ బందానికి సమాచారం అందింది. ఉదయం 8 గంటల సమయంలో అంకిత్ బైక్‌పై వస్తుండగా పోలీసులు పట్టుకోవడానికి ప్రయత్నించారు. అతను తప్పించుకోవడం కోసం పోలీసులపై మూడు రౌండ్లు కాల్పులు జరిపాడు. ఒక బుల్లెట్ పోలీసు కానిస్టేబుల్ బుల్లెట్ ప్రూఫ్ జాకెట్‌ను తాకింది. ఆత్మరక్షణ కోసం పోలీసులు నిందితుడిపై మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో అతడి కాలికి గాయమైంది. ఆ తర్వాత నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.

ప్రజాపక్షం
శుక్రవారం, 28 నవంబరు

# రూపాయి పతనం.. సగటుజీవికి శాపం

రూపాయిని డాలర్‌కు ప్రత్యామ్నాయంగా మారుస్తామని కేంద్ర ప్రభుత్వం ఒకవైపు ప్రగల్భాలు పలుకుతుంటే, మరోవైపు ఫోరెక్స్ మార్కెట్‌లో రూపాయి మారకపు విలువ గతంలో ఎన్నడూ లేనంతగా పతనమవుతున్నది. ఈ సంవత్సరంలో ఇప్పటికే, రికార్డు స్థాయిలో 4.3 శాతం తగ్గుదల నమోదైంది. ఈ పతనాన్ని చాలామంది కేవలం వ్యాపార, వాణిజ్య కోణంలోనే చూడడం దురదృష్టకరం. నిజానికి కరెన్సీ విలువ పడిపోతే, శిక్షపడేది కార్మిక, మధ్యతరగతి వర్గాలకే. దేశ ఆర్థిక వ్యవస్థలో కరెన్సీ విలువ భారీ పతనాన్ని ఎవరు భరిస్తారనే ప్రశ్న తెరపైకి రాకుండా ధనిక కార్పొరేట్ రంగం నిరంతరం ప్రయత్నిస్తునే ఉంటుంది. సమస్యను సృష్టించిన వారు నిజాలు ఎందుకు చెప్తారు. రూపాయి విలువ పతన భారాన్ని ప్రధానంగా భరించేది శ్రామికులు, చిన్న ఉద్యోగులు, రోజు వారి కూలీలు, స్వయం ఉపాధి చేసుకునే వర్గాలే అన్నది క్రూర వాస్తవం. ఇది ఆర్థిక సిద్ధాంతాలపై ఆధారపడిన శాస్త్రీయ అధ్యయనం... భారత్‌సహా ప్రపంచంలోని అనేక దేశాల దయనీయ ముఖచిత్రం. రూపాయి మారకపు విలువ పతనమైతే, అంతర్జాతీయ మార్కెట్‌లో దేశ కొనుగోలు శక్తి క్షీణిస్తుంది. దిగుమతుల రంగం ప్రత్యక్షంగా ప్రభావితమవుతుంది. భారత అవసరాల్లో ఇంధనానిది అగ్రస్థానం. ముడి చమురుకు అధిక మొత్తంలో చెల్లింపుల ప్రభావం కేవలం పెట్రోలు, డీజిల్, గ్యాస్‌పైనే పడుతుందనుకుంటే పొరపాటే. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో దాదాపు అన్ని రకాల ఉత్పత్తి, సేవా రంగాలకు ఇంధనం అత్యవసరం. రవాణా, వ్యవసాయం, పరిశ్రమలు, విద్యుత్ ఉత్పత్తి తదితరావసరాలకు ఇంధనం కీలకం. కాబట్టి, ఇంధన ధర పెరిగితే ఆ ప్రభావం అన్ని ప్రధాన రంగాలపై పడుతుంది. రవాణా ఖర్చులు పెరుగుతాయి. వ్యవసాయ, ఫ్యాక్టరీ ఉత్పత్తుల ఖర్చులు పెరుగుతాయి. ఫలితంగా నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతాయి. సామాన్య ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతుంది. వస్తుసేవలకు డిమాండ్ తగ్గడం ఉద్యోగ, ఉపాధి రంగాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. కార్మికులకు ప్రతిఫలాన్ని డిమాండ్ చేసే పరిస్థితి ఉండదు. తక్కువ ఆదాయం.. తక్కువ కొనుగోళ్లు.. వస్తుసేవలకు తక్కువ డిమాండ్.. వెరసి తక్కువ ఉత్పత్తి.. ఇదో విషవలయం. ఉపాధి కోల్పోయేది.. శ్రమకు తగినంత ప్రతిఫలాన్ని పొందలేక, వచ్చినదానితోనే రాజీపడేది కూడా శ్రామికవర్గమే. పెద్ద కార్పొరేట్ సంస్థలు తమ ఉత్పత్తుల ధరలు పెంచి నష్టాన్ని వినియోగదారుల మీదకు నెట్టేస్తాయి. ధనవంతులకు ఇదొక సమస్య కాదు. పెద్దగా పట్టించుకోరు. ప్రభుత్వాలు కూడా రేట్లు తగ్గించే ప్రయత్నం చేయవు. నష్టం భరించేది 'పనిచేసే' వర్గమే. పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా వేతనాలు పెరగవు. ఇక్కడ మార్కెట్‌లో ధరలు నిర్ణయించేది పెట్టుబడిదారీ వర్గం. కార్మికుల జీతభత్యాలను కూడా ఇదే వర్గం నిర్ణయిస్తుంది, శ్రామికుల జీతాలను, జీవితాలను నిర్ధారిస్తుంది.. శాసిస్తుంది. రూపాయి మారకపు విలువతోపాటు, సామాన్యుడి బతుకు కూడా పతనమవుతుంది. రోజూ గంటల తరబడి కష్టపడే కార్మికులు, డ్రైవర్లు, వెయిటర్లు, డెలివరీ బాయ్స్, కట్టడం కార్మికులు, చిన్న ఉద్యోగులు, ఉపాధి హామీపై పనిచేసే గ్రామీణులు... ఇలా చిన్నాచితకా, మధ్యతగరతి వర్గాలే అలవికాని భారాన్ని మోయాల్సి వస్తుంది. శ్రమ మార్కెట్‌లో అత్యధిక శాతంగా ఉన్న కాంట్రాక్టు కార్మికులు, నిరుద్యోగులు, ప్రచ్ఛన్న నిరుద్యోగులు, గిగ్ కార్మికుల ఆదాయానికి, ఖర్చులకు పొంతన కుదరదు. ధరలు రాకెట్ వేగంతో దూసుకెళితే, ఆదాయాలు నత్తనడకన సాగుతాయి. నవఉదారవాదమే ఇన్ని అనర్థాలకు మూలం. కరెన్సీ విలువ పడిపోవడం సాధారణ ఆర్థిక సంఘటన కానేకాదు. సామాన్య వర్గాల జీవన ప్రమాణాలు తగ్గిపోవడం వారి స్వయంకృతం అంతకంటే కాదు. ఈ దుస్థితి సాధారణ ఆర్థిక చక్రం కాదు... వ్యవస్థీకృత అన్యాయం. పెట్టుబడిదారీ వర్గాలకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వాల నిర్వాకం. పాలకుల విధానాల వైఫల్యమే ఆర్థిక వ్యవస్థలోని అసమానతకు కారణం. దేశ సంపదను సృష్టించేది శ్రామికవర్గమే అయినప్పటికీ, ఆ సంపద విలువను కార్పొరేట్ వర్గాలు నిర్ణయిస్తాయి. ఉత్పత్తి వ్యయం పెరిగితే కంపెనీలు వస్తు, సేవల ధరలు పెంచుతాయి.

ప్రభుత్వాలు తాత్కాలిక ఉపశమనాలు తప్ప, ప్రజలకు ప్రత్యక్ష ఆదాయ మార్గాలు కల్పించవు. సమస్యకు తెరదించవు. రూపాయి విలువ పతనం ఎక్కడ చూసినా ఒక సంఖ్యలా కనిపిస్తుంది. కానీ, ఆ సంఖ్యల వెనుక లెక్కలేనన్ని త్యాగాలు... లక్షలాది అస్తవ్యస్త జీవితాలు... అంతులేని శ్రమ దోపిడీ... అదుపులేని కార్పొరేట్ ఆధిపత్యం. అవసరాలకు, ఆదాయానికి మధ్య అంతులేని అగాధం. ఆర్థిక గణాంకాలు ఏ వివరణలు ఇచ్చినా, రూపాయి విలువ పడిపోతే మొదట నష్టపోయేది కార్మికుడే. కష్టాల సుడిగుండంలో చిక్కుకొని అల్లాడేది సామాన్యుడే. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన నివారణ చర్యలు తీసుకుంటేగానీ, రూపాయి మారక విలువ పతనాన్ని అడ్డుకోవడం సాధ్యం కాదు. సగటు జీవి సమస్యలు తీరవు. జీవితాలు బాగుపడవు. ఆర్థికాభివృద్ధికి నిజమైన అర్థం ఉండదు.

# రేవంత్ సర్కారుకు అడుగడుగునా అవరోధాలు!


ఎస్.కె.జకీర్

రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏ కార్యక్రమం తలపెట్టినా అందులో కుంభకోణం ఉందని ప్రచారం చేయాలన్నది బిఆర్‌ఎస్ పార్టీ ఎజండా. రాష్ట్ర రాజధానిలో పారిశ్రామిక అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి ప్రకటించిన పాలసీని వివాదాస్పదం చేయడానికి కెటిఆర్, హరీశ్ రావు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పరిశ్రమలు ఏర్పాటు కాకుండా భూసేకరణకు అడ్డుకోవడం మొదటి కార్యక్రమంగా బిఆర్‌ఎస్ పనిచేస్తోంది.అలాగే పెట్టుబడులు రాకుండానూ ప్రభుత్వంపై బురద జల్లుతోంది.

అభివృద్ధి అవసరాలకు ప్రభుత్వ భూముల్ని అమ్మడం దీర్ఘకాలంగా కొనసాగుతున్న ప్రక్రియ. మారుతున్న ఆర్థిక పరిస్థితుల్లో ఆదాయ వనరుల కోసం అమ్మడం కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఓ విధానం. ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడులను ఉపసంహరించుకోవడం మొదలు డిఫెన్స్, రైల్వే తదితర శాఖలకు చెందిన భూముల్ని అమ్మడం, లీజుకు ఇవ్వడం కేంద్ర ప్రభుత్వానికి రెగ్యులర్ ప్రాక్టీస్‌గా మారింది. ఆ తరహాలోనే ఉమ్మడి రాష్ట్రంతో పాటు తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా ప్రభుత్వ భూముల్ని అమ్మే ఆనవాయితీ మొదలైంది.

కెసిఆర్ హయాంలో ప్రభుత్వం వివిధ కార్పొరేషన్లు, బోర్డులు, అథారిటీల ద్వారా 453.16 ఎకరాల భూముల విక్రయం జరిగినట్లు గణాంకాల ద్వారా తేలింది. దీంతో ప్రభుత్వానికి సుమారు రూ.31వేల 4కోట్ల మేర ఆదాయం వచ్చింది. హెచ్‌ఎండిఎ ద్వారా జరిగిన అమ్మకాల్లో కోకాపేట్‌లో ఒక్కో ఎకరం వంద కోట్ల రూపాయల చొప్పున గరిష్ట ధర పలికినట్లు కెసిఆర్ ప్రభుత్వం గొప్పగా చెప్పుకున్నది. రాష్ట్రంలో భూముల ధరలకు రెక్కలు వచ్చాయని, మూడెకరాల సాగుభూమి ఉన్న రైతులు కోటీశ్వరులంటూ నాటి సిఎం కెసిఆర్ గర్వంగా ప్రకటించారు. ప్రభుత్వ భూముల్ని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్, హెచ్‌ఎండిఎ ద్వారా విక్రయం చేయడంతో పాటు రాజీవ్ స్వగృహ ఫ్లాట్లు, ప్లాట్లు కూడా వివిధ దశల్లో నిర్మాణంలో ఉండగానే అమ్ముడుపోయాయి. నగరానికి చుట్టూ ఉన్న వివిధ ప్రాంతాల్లో విడతలవారీగా ఈ భూముల విక్రయాలు 2015–23 మధ్యకాలంలో జోరుగా సాగాయి. కరోనా సమయంలోనూ రియల్ ఎస్టేట్ రంగం అద్భుతం గా ఉన్నదని బిఆర్ఎస్ ప్రభుత్వం గొప్పగా చెప్పుకున్నది.

ఒక్కో ప్రాంతంలో ఉన్న మార్కెట్ ధరకు అనుగుణంగా కెసిఆర్ హయాంలో ఖజానాకు నిధులు సమకూరాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2017 వరకు మూడేండ్ల పాటు హెచ్‌ఎండిఎ భూముల విక్రయానికి దూరంగానే ఉన్నది. అప్పటివరకూ టిజిఐఐసి ద్వారానే కొన్ని విక్రయాలు జరిగాయి. 2017 తర్వాత నుంచి హెచ్‌ఎండీఏ ల్యాండ్ సేల్స్‌మీద దృష్టి పెంచింది. ప్రభుత్వ భూముల్ని అమ్మే వ్యాపారిలా కాంగ్రెస్ ప్రభుత్వం మారిందంటూ విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఇప్పటిదాకా బీఆర్‌ఎస్ అమ్మిన భూముల వివరాలను రేవంత్ ప్రభుత్వం వెలుగులోకి తీసుకువచ్చింది.

మొత్తం 13 వాయిదాల్లో 338.62 ఎకరాల భూ విక్రయాల ద్వారా ప్రభుత్వానికి మొత్తం 11 వేల 875 కోట్ల మేర ఆదాయం సమకూరింది. ఇది కాక తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ద్వారా జరిగిన 114.54 ఎకరాల భూవిక్రయాలతో రూ.19 వేల రూ.129 కోట్ల మేర సమకూరింది. మొత్తం 485.82 ఎకరాలను విక్రయించాలని ప్రణాళిక రూపొందించుకున్నా అందులో నాల్గోవంతు మాత్రమే సాకారమైంది. 13 ఇన్‌స్టాల్‌మెంట్లలో మొత్తం 485.82ఎకరాల భూమిని విక్రయించాలనుకున్నా 114.54 ఎకరాలు అమ్ముడుపోవడంతో ప్రభుత్వానికి రూ.19,129 కోట్ల మేర ఆదాయం సమకూరింది. ఈ రెండు ఫేజ్లలో మొత్తం 453.16 ఎకరాల భూమిని విక్రయించింది బిఆర్‌ఎస్ ప్రభుత్వం. ఈ అమ్మకాలద్వారా ఖజానాకు రూ.31వేల 4 కోట్ల మేర ఆదాయం వచ్చింది.

ఇదిలా ఉండగా "రాష్ట్రంలోని పారిశ్రామిక భూములను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రైవేటు వ్యక్తులకు తెగనమ్ముతున్నారు. రేవంత్‌ది ల్యాండ్ లూటింగ్ పాలసీ" అని మాజీ మంత్రి హరీశ్ రావు చెలరేగిపోయారు."రూ.5లక్షల కోట్ల భూములు రూ.5 వేల కోట్లకు అమ్మకమా? బిఆర్‌ఎస్ చూస్తూ ఊరుకోదు" అని కూడా ఆయన నిందించారు. "దమ్ముంటే ఆధారాలతో నిరూపించాలి. అబద్ధాలు ప్రచారం చేయడం బిఆర్‌ఎస్ నాయకులు కెటిఆర్, హరీశ్‌రావుకు వెన్నతో పెట్టిన విద్య. వారు పదేపదే చేస్తున్న రూ.5 లక్షల కోట్ల కుంభకోణం ఆరోపణలు పూర్తిగా నిరాధారం, అవాస్తవం. ఆధారాలులేని ఈ ప్రచారం పచ్చి అబద్ధం, రాజకీయ దురుద్దేశంతో చేస్తున్నదని ఒప్పుకుని రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలి"అని పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఇండ స్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్ఫర్మేషన్ పాలసీపై హరీశ్రావు చేసిన విమర్శలను ఆయన తిప్పికొట్టారు.

తిమ్మిని బమ్మిని చేయడంలో కెటిఆర్, హరీశ్‌రావులను మించిన వారు మరొకరు లేరని శ్రీధర్‌బాబు మండిపడ్డారు. 2023 ఆగస్టులో బిఆర్‌ఎస్ ప్రభుత్వం 19, 20, 21 నెంబర్లతో జారీ చేసిన ఫ్రీహోల్డ్ జీవోల వెనుక రూ. లక్షల కోట్ల గోల్ మాల్ జరిగినట్లు మంత్రి ఆరోపించారు. పారదర్శకంగా రాష్ట్ర ఖజానాకు రూ.4వేల కోట్ల నుంచి రూ.5వేల కోట్ల వరకు ఆదాయాన్ని సమకూర్చేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే కుంభకోణాలు అలవాటైన బీఆర్‌ఎస్ నేతలకు మింగుడు పడటం లేదన్నారు.

2023 అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందు అప్పటి ప్రభుత్వం నుంచి తీసుకున్న లీజు భూములకు ఫ్రీహోల్డ్ హక్కులు ఇచ్చి 100, 200 శాతం ఛార్జీలు విధించి రూ.లక్షల కోట్లను వసూలు చేయాలని ప్రణాళిక రచించారు. ప్రజలు కెసిఆర్ ను తిరస్కరించడంతో వర్కౌట్ కాలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వంతో సంబంధం లేని సిఎం రేవంత్‌రెడ్డి సోదరులపై నిరంతరం ఆరోపణలు చేయడమే బిఆర్‌ఎస్ నాయకులు పనిగా పెట్టుకున్నారు. అలాగే రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా, యువతకు ఉద్యోగాలు దక్కకుండా అడ్డంకులు సృష్టించడం బిఆర్‌ఎస్ ఎజండా. ప్రభుత్వం 9,292 ఎకరాల భూమిని అమ్మకానికి పెట్టిందని దుష్ప్రచారం చేస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టించడానికి తెలంగాణ భవన్ లో వ్యూహరచన జరిగింది. ఈ భూముల్లో పరిశ్రమలకు ప్లాటింగ్ చేసిన ప్రాంతం ఫ్రీహోల్డ్ ప్రాపర్టీ 4,740 ఎకరాలేనని, ఇవి పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు చెందిన భూములని ప్రభుత్వం స్పష్టం చేసింది. మిగిలిన భూములు రోడ్లు, డ్రైనేజీ లాంటి మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగిస్తున్నట్టు కూడా తెలిపింది.

రోజురోజుకూ విస్తరిస్తున్న రాజధాని నగరాన్ని భవిష్యత్తు అవసరాలకు తగినట్లు తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడం బిఆర్‌ఎస్ కు కంటగింపుగా మారింది. దీన్ని ఎలాగయినా అడ్డుకొని తీరాలని ఆ పార్టీ కంకణం కట్టుకున్నట్టు కనిపిస్తున్నది. ఔటర్ రింగ్‌రోడ్డు లోపల, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో 50,60 ఏళ్ల క్రితం నెలకొల్పిన పారిశ్రామిక ఎస్టేట్లు, పార్కుల భూములను 'మల్టీ యూజ్ జోన్లు'గా మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్ఫర్మేషన్ పాలసీ (హెచ్‌ఐఎల్‌టీపీ)2025 పేరిట ప్రభుత్వం కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. నగర అభివృద్ధి, భూముల సక్రమ వినియోగం కోసం ఈ పాలసీని తీసుకొస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటిదాకా పారిశ్రామిక ఎస్టేట్లుగా ఉన్న ప్రాంతాల్లో ఇకపై అపార్ట్‌మెంట్లు, టౌన్ షిప్, ఆఫీసులు, స్కూళ్లు, హాస్పిటళ్లు, హోటళ్లు, టెక్ పార్కులు, రీసెర్చ్ సెంటర్లు నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వనుంది.ఈ అనుమతులు పొందేందుకుగాను ఆయా ప్రాంతాల ప్రభుత్వ రిజిస్ట్రేషన్ (ఎస్ఆర్వో) విలువలో డెవలప్‌మెంట్ ఇంపాక్ట్ ఫీజు కింద రోడ్ల వెడల్పు 80 అడుగులలోపు ఉంటే ఆ ప్రాంతానికి 30శాతం, 80 అడుగుల కన్నా ఎక్కువ వెడల్పు రోడ్లు ఉంటే 50 శాతంగా ఫీజు చెల్లించి ఫ్రీ హోల్డ్‌గా మార్చుకోవచ్చు. ఫ్రీ హోల్డ్‌గా మారితే ఆ భూమిపై పూర్తి యాజమాన్య హక్కులు లభించనున్నాయి. దీంతో ఆ భూమిని వారు తమకు నచ్చిన విధంగా వినియోగించుకునేందుకు, విక్రయించుకునేందుకు కూడా హక్కు పొందుతారు. ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో మొత్తం 22 పారిశ్రామిక పార్కులు, స్టాండ్ అలోన్ భూముల యూనిట్లు ఉన్నాయి. మొత్తం 9,292ఎకరాల భూములు కొత్త పాలసీ కిందకు వస్తున్నాయి. అయితే ఇందులో 4,740 ఎకరాలను ప్లాటెడ్ ఏరియాగా నిర్ణయించారు.

ఇక్కడ పెట్టుబడులు పెట్టి, యువతకు, నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తారనే ఉద్దేశంతో నామమాత్రపు ఫీజుకు గత ప్రభుత్వాలు పారిశ్రామికవేత్తలకు భూములను లీజుకు ఇచ్చాయి. వారికి విద్యుత్, నీరు, ఇతర మౌలిక సదుపాయాలను కూడా కల్పించి ప్రోత్సహిస్తూ వచ్చాయి. ఇలా కేటాయించిన వాటిలో కొన్ని పరిశ్రమలు ఇప్పటికీ కొనసాగుతూ నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నవి. మరికొన్ని పరిశ్రమలు మూత పడ్డాయి. బాలానగర్, కాటేదాన్, కూకట్‌పల్లి, జీడిమెట్ల, చర్లపల్లి, మౌలాలి, నాచారం, ఉప్పల్ వంటి పారిశ్రామికవాడలలో పరిశ్రమలు స్థాపించిన సమయంలో అవి నగర శివారులో ఉండేవి. కానీ,ఆ పరిశ్రమలు ఉన్న ప్రాంతాలు ఇప్పుడు నగరం నడిబొడ్డునకు చేరుకున్నట్లయ్యింది. నగరంలో జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ఆ పరిశ్రమలు నగర పౌరులకు అసౌకర్యంగా, కాలుష్య కారకాలుగా మారుతున్నాయి. ఈ కారణంతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందే కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం 2013లో ఈ పరిశ్రమలన్నిటినీ నగరానికి అవతల ఏర్పాటు చేసుకోవాలంటూ ఒక విధానాన్ని తీసుకొచ్చింది. అయితే దానిని అమలు చేసే క్రమంలో ఆ సమయానికే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ఆ తర్వాత కెసిఆర్ ప్రభుత్వం కూడా ఈ ప్రతిపాదనను తీసుకువచ్చింది. కానీ అమలులోకి మాత్రం తీసుకురాలేకపోయింది. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని సీరియస్‌గా తీసుకున్నది. హైదరాబాద్ ఇండస్ట్రియల్ లాండ్ ట్రాన్స్ఫర్మేషన్ పాలసీ తీసుకు వచ్చింది.

పారిశ్రామిక ఎస్టేట్లను మల్టీ యూజ్ జోన్లుగా మార్చి ఇంపాక్ట్ ఫీజు వసూలు ద్వారా భూమిని ఇతర అవసరాలకు వినియోగించేందుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వనుంది. ఇంపాక్ట్ ఫీజులోనే చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సిఎల్యూ) ఫీజులు కూడా కలిపారు. దీంతో పారిశ్రామికవేత్తలు అప్రూవల్స్ కోసం వేర్వేరు శాఖల వద్దకు తిరగాల్సిన అవసరం లేకుండా పోతుంది. దీనికోసం టిజిఐపాస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మొత్తం ప్రక్రియకు టిజిఐఐసి నోడల్ ఏజెన్సీగా పనిచేయనుంది. మల్టీ యూజ్ కింద అనుమతులు పొందేందుకుగాను పారిశ్రామికవేత్తలు తమకు కేటాయించిన భూమికి సంబంధించి మొత్తం విలువలో 20 శాతాన్ని ప్రారంభ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. మిగతా 80 శాతం ఫీజులను రెండు విడతల్లో చెల్లించవచ్చు. కాగా, దరఖాస్తులను 7 రోజుల్లోగా టిజిఐఐసి స్క్రూటినీ చేస్తుంది. మరో 7 రోజుల్లో ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నేతృత్వంలోని కమిటీ తుది ఆమోదం తెలియజేస్తుంది. తర్వాత వారం రోజుల్లో డిమాండ్ నోటీసును యూనిట్‌దారులకు ఆన్లైన్లో జారీ చేయనున్నారు. ఈ ప్రక్రియ అంతా 45 రోజుల్లో పూర్తవుతుందని ప్రభుత్వం పేర్కొంది. అయితే ప్రతి దశలోనూ గ్రేస్ పీరియడ్‌ను నెల రోజులుగా నిర్ణయించింది. గ్రేస్ పీరియడ్ దాటితే మొత్తం రుసుము ప్రభుత్వ ఖజానాకే వెళుతుందని స్పష్టం చేసింది. ఈ పాలసీ జారీ అయిన తేదీ నుంచి 6 నెలల్లోపు దరఖాస్తులను సమర్పించాలని ఆదేశించింది. ఈ ఆదాయాన్ని భూ మార్పిడి ఫీజులకు, 25 శాతం టిజిఐఐసి వద్దే ఉంచి రాష్ట్ర నలుమూలల పారిశ్రామిక అభివృద్ధికి వినియోగించనుంది. మిగతా మొత్తాన్ని రాష్ట్ర ఆర్థికస్థితిని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంది.

హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ కాదు, హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ లూటింగ్ పాలసీ అని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపణ. ఓఆర్ఆర్ లోపల ఉన్న 9,292 ఎకరాల పారిశ్రామిక పార్కుల భూముల విలువ రూ.5 లక్షల కోట్లు అయితే.. వాటిని రూ.5వేల కోట్లకే ఎందుకు కట్టబెడుతున్నారని ఆయన ప్రశ్నించారు. మిగతా రూ.4.95 లక్షల కోట్లు కుంభకోణం కాదా? అని హరీశ్ రావు అంటున్నారు. 9,292 ఎకరాల్లో రోడ్లు, డ్రైనేజీలు పోగా 4,740 ఎకరాలే ఉంటుందని మంత్రి శ్రీధర్‌బాబు చెబుతున్నది బూటకమన్నది మాజీ మంత్రి విమర్శ. ఈ కుంభకోణం రాష్ట్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్ కంటే రెండు రెట్లు అధికమని ఆయన తెలిపారు.

# రుద్రమదేవి అమరత్వానికి 736 ఏళ్లు

*రాణీ రుద్రమదేవి ఆఖరి రక్తపు బొట్టు 1289 సంవత్సరం నవంబర్ 27న చందుపట్ల గ్రామంలో.*

1262 నుంచి 1289 వరకు కాకతీయ సామ్రాజ్యాన్ని పరిపాలించిన రుద్రమదేవి దక్షిణ భారతదేశంలో మొదటి మహిళా పాలకురాలు. కాకతీయులలో ఏకైక మహిళా పాలకురాలుగా పరిపాలించిన రాణి రుద్రమదేవి, రుద్రదేవ మహారాజు, పటోదృతి, రాయగజకేసరి అనే బిరుదులతో సింహాసనాన్ని అధిష్టించింది. కాకతీయులు వరంగల్, సూర్యాపేట, పిల్లలమర్రి, చందుపట్ల, పానగల్ మీదుగా శ్రీశైలం వెళ్లేవారు. దారిలో ఉన్న చందుపట్ల ఒకప్పుడు వ్యాపార కేంద్రంగా వర్ధిల్లింది. నల్లగొండ జిల్లా నకిరేకల్ జాతీయ రహదారి నుంచి కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలో చారిత్రక చందుపట్ల గ్రామం ఉంది. కాకతీయులు త్రవించిన ' రా' సముద్రం వెనక దక్షిణ దిక్కులో చందుపట్లలో ఈ శాసనం లభించింది. ఈ శాసనం తెలుగులో ఉన్నది. కాయస్థ గంగయ్య సాహిణి మరణించగా అతని మేనల్లుడు దేవుడు జన్నిగ దేవుడు అతని తర్వాత అతని సోదరులు త్రిపురాంతక దేవుడు, అంబదేవుడు మార్జా వాడ ప్రాంతానికి ప్రతినిధులుగా పనిచేశారు. కాయస్థ అనగా ప్రభుత్వ పత్రాలను భద్రపరిచేవారు, కాయస్థ వంశంలో గంగయ సాహిణి తర్వాత అతని మేనల్లులు జన్నిగ దేవుడు. త్రిపురారీ దేవుడు నమ్మకస్తులుగా పనిచేశారు. ఆ తర్వాత పాలన లోకి వచ్చిన కాయస్థ అంబదేవుడు రుద్రమదేవిని ఎదిరించి రుద్రమదేవి రాజ్య భూభాగాలు ఆక్రమించి రాయసహస్రమల్ల అనే బిరుదును పొందాడు. రుద్రమ దేవి పాలనాకాలమంతా యుద్ధాలతోనే గడిచింది. తొలుత స్త్రీ పరిపాలనను, స్త్రీ అధికారాన్ని సహించలేని సామంతులు, దాయాదుల నుంచి ఆమెకు తీవ్ర ప్రతిఘటన ఎదురయ్యింది. తండ్రి గణపతిదేవుని కాలంలో సామంతులుగా ఉన్న రాజులు రుద్రమ సింహాసనం అధిష్టించగానే ఎదురు తిరిగారు.

అంబదేవుడు రుద్రమదేవికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాడు. ఈ తిరుగుబాటును అణచడానికి 80 సంవత్సరాల వృద్ధ వయసులో పోరాడి రుద్రమ మరణించినట్లు నలగొండ జిల్లాలోని నకిరేకల్ మండలంలోని 1289 నాటి చందుపట్ల శాసనం తెలియజేస్తున్నది.1289నవంబర్27 న శివైక్యం పొందినట్లూ కాకతీయ రుద్రమదేవి,సేనాపతి మల్లికార్జున నాయుడులకు పువ్వుల ముమ్మడి అనే బంటు సోమనాథ దేవాలయానికి కొంత భూమిని దానంగా ఇచ్చినట్లు ఆ శాసనంలో కలదు. ఈ శాసనం 1957లో బయటపడింది. 1962 లో భారతీ పత్రికలో చందుపట్ల గ్రామానికి చెందిన డాక్టర్ శ్రీ రంగాచార్యులు మా ఊరిలో కాకతీయుల కాలం నాటి శాసనమున్నది పరిశోధన చేయవలసిందిగా కోరాడు. 1987లో ప్రఖ్యాత చరిత్రకారుడు శ్రీ పరబ్రహ్మ శాస్త్రి ఈ శాసనాన్ని వెలుగులోకి తెచ్చి రుద్రమదేవి మరణాన్ని ప్రపంచానికి తెలియజేశాడు. తెలంగాణలో నల్లమల అడవులు హైదరాబాద్ నుంచి 135 కిలోమీటర్ల దూరంలో మహబూబ్‌నగర్ జిల్లాలోని మన్ననూరులో, అక్కడి నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉండే బౌరాపురం (భ్రమరాంబపురం) మీదుగా కాలినడకన మరో పది కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే మేడిమల్‌కల్ అనే చెంచుపెంట శివారులో దుర్గమ అరణ్యంలో ఒక శిలాశాసనం ఉంది.. ఇటీవల దొరికిన మెడిమెకల్ శాసనం కూడా చందుపట్ల శాసనం తిరుగులేనిదని బలప రుస్తున్నట్లు చరిత్రకారుడు డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణ నిర్ధారించారు.

కాయస్థ అంబదేవుని వల్ల రాణి రుద్రమ హతమైనట్లు, సర్వానాంధ్ర మహీ పతిన్ జిత్వ రణముకే యశో లబ్ధవాన్‌అనే ఆంధ్ర దేశంలో ఉన్న రాజులందరినీ ఓడించి కీర్తి పొందానని తన త్రిపురాంతక శాసనంలో అంబ దేవుడు రాయించుకున్నాడు .దీని ద్వారా ప్రత్యక్షంగా 80 సంవత్సరాల వయసులో ఉన్న రుద్రమదేవిని వధించాను అని అనకుండా పరోక్షంగా ఆంధ్రదేశంలో ఉన్న రాజుల అందరిని ఓడించాను అని చెప్పుకున్నాడు.అసమాన ధైర్య సాహసాలతో శత్రువుల గుండెల్ని చీల్చిన రాణీ రుద్రమదేవి ఆఖరి రక్తపు బొట్టు చిందించింది క్కడే. 1289 సంవత్సరం నవంబర్ 27న చందుపట్ల గ్రామంలో జరిగిన యుద్ధంలో రుద్రమ మరణించింది.

శాసన ప్రాధాన్యత:చందుపట్ల శాసనం కాకతీయ చరిత్రలోనే అత్యంత ప్రముఖమైనదేగాక అరుదైన శాసనం. కాకతీయ రుద్రమదేవి మరణకాలాన్ని ప్రస్తావిస్తున్న శాసనం ఇదొక్కటే. శాసనాకాలం శక సంవత్సరం 1211 మార్గశిర శుద్ధ ద్వాదశి అనగా క్రీస్తుశకం1289 నవంబర్ 27. శాసనంలో కాకతీయ రుద్రమదేవి శివలోకానికి విచ్చేసినట్లు (మరణించడం )ఆమెకు శివలోక ప్రాప్తినుద్దేశించి తమ సేనాని మల్లికార్జున నాయకుడు ప్రాంతీయ అధికారి అయిన పువ్వుల ముమ్మడి గారు చందుపట్ల సోమనాథ దేవాలయాలయమునకు భూదానం చేసినట్లు చెప్పబడినది. గతంలో రుద్రమదేవి క్రీస్తు శకం1296 వరకు జీవించి ఉన్నదని చరిత్రకారులు భావించేవారు. ఈ శాసనం లభించాక రుద్రమదేవి 1289 వరకే జీవించినది అని చెప్పటకు వీలైనది. అదేవిధంగా మహారాణి రుద్రమదేవి, సైనిక అధికారి మల్లికార్జున నాయుడు ఒకేసారి మరణించినట్లు చెప్పబడింది కనుకనే రుద్రమదేవి యుద్ధభూమిలో వీర స్వర్గమలంకరించెనని మన చందుపట్ల శాసనం ద్వారా చెప్పుకోవచ్చు. నల్గొండ అప్పటి కలెక్టర్‌గా ఉన్న పురుషోత్తం రెడ్డి కాకతీయుల కాలం నాటి రుద్రమదేవి మరణాన్ని తెలియజేసే చందుపట్ల శాసనంను శాసన పునరుద్ధరణకు 80000తో ఈ శాసనానికి గద్దె కట్టించి 2007లో ప్రతిష్టించారు. ఆ తరువాత ముక్తేశ్వరరావు నల్గొండ కలెక్టర్‌గా ఉన్నపుడు స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ వారిని ఒప్పించి ఆరు లక్షల యాభై వేల రూపాయలతో 700 కేజీల బరువు గల 12 ఫీట్లు ఎత్తు గల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయించాడు. ఈ విగ్రహాన్ని చందుపట్లలో ప్రతిష్టించారు.

చరిత్రకారుడు శ్రీ పరబ్రహ్మ శాస్త్రి తరువాత రుద్రమదేవి మరణం గూర్చి చందు పట్ల గ్రామ వివేకానంద యువజన మండలి సభ్యులు, కోటగిరి దైవాధీనం, చరిత్ర ఉపన్యాసకులు సూర్యకుమార్, టంగుటూరి సైదులు ఈ ప్రపంచానికి తెలియజేశారు. ప్రభుత్వం అధికారికంగా ప్రతి సంవత్సరం రుద్రమదేవి వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించి కాకతీయుల శౌర్య పరాక్రమ లను నేటి తరానికి తెలియజేయాలి . వరంగల్ లో కాకతీయ ఉత్సవాలను నిర్వహించినప్పుడు రుద్రమదేవి అమరత్వం పొందిన శాసనం లభించిన చందుపట్లలో కూడా కాకతీయ ఉత్సవాలను జరపాలని, చందుపట్లను పర్యాటక కేంద్రంగా మార్చాలని. గ్రామానికి ఎన్నో చారిత్రక విశేషాలు ఉన్నాయి కాబట్టి వాటిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని ప్రజలుకోరుకుంటున్నారు.

**నర్సింగు కోటయ్య**
అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ హిస్టరి, 9985930885

# ఆర్‌ఎస్‌ఎస్‌కు 'కొత్త గాడ్‌ఫాదర్'

**పి. ప్రసాద్**

(నిన్నటి తరువాయి)

గృహ నిర్బంధం నుంచి కూడా సావర్కార్ 1937 లో విడుదలై హిందూ మహాసభ అధ్యక్షులుగా ఎన్నిక అయ్యాడు. 1940 లో ఆర్‌ఎస్‌ఎస్ రెండవ అధినేతగా గోల్వాల్కర్ ఎన్నికయ్యాడు. అయితే ఆర్‌ఎస్‌ఎస్ స్థాపన కంటే ముందే రత్నగిరి జైలులో వున్న సావర్కార్‌ని గోల్వార్కర్ కల్సి స్ఫూర్తి పొందాడు.

1937 ఎన్నికల్లో కొన్ని రాష్ట్రాల్లో భారత జాతీయ కాంగ్రెస్ తన ప్రభుత్వాల్ని ఏర్పాటు చేసింది. వాటి ఆమోదం లేకుండా రెండవ ప్రపంచ యుద్ధంలో 'బ్రిటిష్ ఇండి యా' కూడా పాల్గొంటున్నట్లు బ్రిటన్ ప్రకటించింది. దీనికి నిరసనగా కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజీనామా చేశాయి. ప్రత్యామ్నాయ సర్కార్ల ఏర్పాటు కోసం బ్రిటన్ ప్రయత్నం చేసింది. ఆ వ్యూహంలో భాగంగా ఆర్‌ఎస్‌ఎస్, ముస్లిం లీగు కలవడం గమనార్హం. పరస్పర ప్రత్యర్థులైన రెండు మతాలకి చెందిన మతోన్మాద శక్తులు చేయి కలిపాయి. ద్విజాతి సిద్ధాంతం పేరిట పాకిస్తాన్ ప్రత్యేక దేశంగా ఏర్పడాలనే ముస్లిం లీగ్ 1940 నాటి తీర్మానాన్ని ఆర్‌ఎస్‌ఎస్ బలపరచడం వాటి నిజస్వరూపాన్ని బయట పెట్టుకున్నది.

8–10–1939న కపర్దికి ముంజీ రాసిన లేఖలో మున్ముందు రాట్నం, రైఫిల్ మధ్య యుద్ధం తప్పదని జోస్యం చెప్పాడు. నిజంగానే హిందూ మహాసభ ఆర్గనైజర్ నాథూరాం గాడ్సే 30–1–48 తేదీన గాంధీని హత్య చేశాడు. ఇది కాకతాళీయ సంఘటన కాదు.

గాంధీ హత్య నాటికి కాంగ్రెస్ పార్టీ గానీ, కాంగ్రెస్ ప్రభుత్వం గానీ హిందూ మతతత్వం పట్ల ఏకశిలా ఖండంగా లేవు. అందులోని పటేల్ నుంచి పంత్ వరకూ హిందూ జాతీయవాదం చేత ప్రభావితులే. అయినా గాంధీ హత్య సందర్భంగా పెల్లుబికిన దేశప్రజల ఆగ్రహావేశాల ఫలితంగా తాత్కాలికంగా ఏకమై ఆర్‌ఎస్‌ఎస్ పై నిషేధం విధించాయి. చరిత్రలో ఆర్.ఎస్.ఎస్. తొలిసారి తీవ్రక్లిష్ట స్థితికి గురైనది. 1947 వరకు బ్రిటిష్ ప్రత్యక్ష అండ పొందిన ఆర్‌ఎస్‌ఎస్ ఆ తర్వాత కొత్త ప్రతికూల పరిస్థితిని ఎదుర్కొన్నది. పైగా గాంధీ హత్యతో సంక్షోభంలో పడింది. నాటి నుంచి ఆర్‌ఎస్‌ఎస్ వ్యూహం, ఎత్తుగడలు కీలకమైనవి. గడ్డుస్థితి నుండి బయట పడడానికి ఓ కుట్ర పన్నింది. 1949 లో ఒక రాత్రి అయోధ్యలోని మసీదులో రాముడి విగ్రహాల్ని చేర్చి వాటిని రాముడే చేర్చినట్లు ఒక కల్పిత ప్రచార కుట్రకు పాల్పడడం గమనార్హం!

1952 తొలి ఎన్నికల్లో పోటీ కోసం జన సంఘం పార్టీని ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించింది. మూడు శాతం ఓట్లు, నాలుగు సీట్లు వచ్చాయి. ఆ కొద్ది మేరకు కూడా ప్రధానంగా దేశవిభజన సందర్భంగా మత కల్లోలాలు జరిగిన ప్రాంతాలలో కావడం గమనార్హం. 1925 నుంచి 1940 వరకు ఆర్‌ఎస్‌ఎస్ మహారాష్ట్రకే పరిమితం. గోల్వార్కర్ సారథ్యంలో 1940 తర్వాత ఉత్తరాదిన విస్తరణ కోసం ప్రయత్నం జరిగింది. ముఖ్యంగా దేశ విభజన సందర్భంగా మత కల్లోలాలు తీవ్రంగా జరిగిన ప్రాంతాలైన బెంగాల్, పంజాబ్, ఢిల్లీ వంటి చోట్లకు కొత్తగా విస్తరించింది.

నెహ్రూ, షేక్ అబ్దుల్లా సర్కార్ల మధ్య 1952లో ఢిల్లీ ఒప్పందం జరిగింది. ఆర్‌ఎస్‌ఎస్ ఆర్టికల్ 370 ని వ్యతిరేకించింది. 1962 చైనా, 1965 పాకిస్తాన్ యుద్ధాల్లో రెచ్చగొట్టింది. 1966 లో కుంభమేళాను మొదటిసారి హిందువుల వేడుకను హిందుత్వ వేడుకగా మార్చింది. కొన్ని నెలలకే గోరక్షణ కార్యక్రమం చేపట్టింది. ఆ సమస్య పై 7–11–1966 తేదీన చలో పార్లమెంటు పిలుపు ఇచ్చింది. అది హిందూ సన్యాసుల్ని సమీకరించి అల్లర్లకు దిగింది. నాటి కాల్పుల్లో ఏడుగురు మరణించారు. 1966 కరువు ఆధారంగా తన రాజకీయ పునాదిని పెంచుకుంది. 1967 నాటి జనరల్ ఎన్నికల్లో అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఓడింది. ఆ సందర్భంగా కొన్ని ఉత్తరాది రాష్ట్రాల్లో ఆర్.ఎస్.ఎస్. కి పునాది పడింది. 1969లో కాంగ్రెస్ పార్టీ చీలింది. ఆ చీలికను అవకాశంగా తీసుకొని క్రియాశీల పాత్రను పోషించింది. 1971 నాటి బంగ్లాదేశ్ ఏర్పాటును స్వాగతించి కీర్తించింది. 1973 నాటి గుజరాత్ విద్యార్థుల నవనిర్మాణ సమితిలో ఆర్‌ఎస్‌ఎస్ క్రియాశీల పాత్ర వుంది. జయప్రకాష్ నారాయణ నాయకత్వంలో జరిగిన అధిక ధరల వ్యతిరేక బీహార్ ఉద్యమంలో పాల్గొన్నది. ఎమర్జెన్సీలో నిషేధానికి గురైంది. ఇలా కలిసొచ్చిన లేదా తానే సృష్టించుకున్న లేదా కుట్ర చేసి పొందిన అవకాశాల ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ పలు ఆటుపోట్ల మధ్య కూడా నిలదొక్కుకోగలిగింది.

ఎమర్జెన్సీని సడలించి ఎన్నికలు ప్రకటించిన నేపథ్యంలో జరిగిన 1977 ఎన్నికల్లో జనతా పార్టీ ఏర్పడింది. దాంట్లో జనసంఘ్ పార్టీ కూడా విలీనమైనది. తొలిసారి హిందుత్వ శక్తులు దేశ పార్లమెంటరీ రాజకీయ స్రవంతిలో భాగమైనవి. ఇలా గాంధీ హత్యతో పౌర సమాజం నుంచి దూరమైన ఏకాకి స్థితి నుంచి ప్రధాన రాజకీయ స్రవంతిలో చేరడానికి ఆర్‌ఎస్‌ఎస్‌కు ముప్పై ఏండ్లు పట్టింది. ఎమర్జెన్సీలో నిషేధానికి గురికావడంతో గాంధీని చంపిన గ్రహణం తొలగింది. మొరార్జీ ప్రభుత్వంలో కీలక మంత్రి పదవులు పొందడంతో 30 ఏళ్ళ ఎదురీత దశ ముగిసి వాలు ఈత దశ ప్రారంభమైంది.

1977 జనవరి నుంచి ఆర్‌ఎస్‌ఎస్ కి సొంత రాజకీయ పార్టీ లేదు. 1979లో జనతా సర్కార్ సహా జనతా పార్టీ కూడా విచ్ఛిన్నమైనది. 1980 ఎన్నికల్లో తిరిగి ఇందిరా సర్కా ర్ ఏర్పడింది. ఆర్‌ఎస్‌ఎస్‌కు వాలు ఈత దశ నుండి ఎదురీత దశలోకి తిరిగి వెళ్లే స్థితి ఏర్పడింది. తిరిగి తన అనుబంధ రాజకీయ పార్టీ పునర్నిర్మాణానికి పూనుకుంది. జన సంఘ్ పేరు బదులు ఈసారి భాజపా పేరిట పార్టీని స్థాపించింది. గాంధీయన్ సోషలిజం తన లక్ష్యంగా ప్రకటించుకుంది. గాంధీ హత్యా నేర కోణాన్ని కప్పిపెట్టుకునే ప్రయ త్నం చేసింది. పైగా తనది కూడా సోషలిజం దారిగా చెప్పుకునే ప్రయత్నమిది. 1980 ముంబై మహాసభ ద్వారా బిజెపి స్థాపనకు పూనుకుంది. దీంతో మరో కొత్త దశ మొదలైంది.

కాలగమనంలో గాంధీ పేరు, సోషలిజం నినాదం కూడా లాభంలేదని ఆర్‌ఎస్‌ఎస్ గుర్తించింది. అయోధ్య ఎజెండాను తిరిగి తలకు ఎత్తుకుంది. అద్వానీ రథయాత్ర కొంత బలాన్నిస్తే, సరళీకరణ విధానాలు మరింత కొత్త బలాన్ని ఇచ్చాయి. నగ్నమైన ఎజండాతో దేశ ప్రజల్లోకి వెళ్లగలిగే స్థితికి చేరింది. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజల మానసిక స్థితిని బాబ్రీ మసీదు కూల్చివేతకు ఆమోదనీయంగా అది మలుచుకోగల దశకు చేరుకుంది. భారత రాజకీయ రంగంలో కొత్త పరిణామమిది. బహిరంగ మత విద్వేష ఎజెండాను ఆదరించే ఒక గణనీయ వర్గాన్ని పౌర సమాజంలో సృష్టించింది. ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిస్ట్ దారిలో అతి పెద్ద విజయమది.

ఆర్‌ఎస్‌ఎస్‌కి అమెరికా ప్రత్యక్ష ప్రోత్సాహం ఇచ్చే స్థితి ఏర్పడడం భారత రాజ్య వ్యవస్థలో కీలక పరిణామం. అంతిమంగా అదో అంతరంగిక రహస్య రాజ్య వ్యవస్థ ఏర్పాటుకి పునాది వేసింది. అదే 'డీప్ స్టేట్' గా ఉనికిలోకి వచ్చింది. అది 2014 ఎన్నికల్లో బిజెపిని అధికారానికి తేవడానికి తెర వెనక కీలక పాత్రని పోషించింది.

ఓ వైపు డీప్ స్టేట్, మరోవైపు బడా కార్పొరేట్ వ్యవస్థ నడుం బిగించి పథకం ప్రకారం హిందుత్వ మత విద్వేష భావజాలాన్ని కృత్రిమంగా సృష్టించి, సాధారణ హిందువుల మనసుల్లో రెచ్చగొట్టిన ఫలితంగా 2014లో ఢిల్లీలో బిజెపి అధికారం చేపట్టింది. మూడోసారి 2024 లో ఆర్.ఎస్.ఎస్. ఆశించిన ఫలితాలు వచ్చి వుంటే, తమ అంచనా ప్రకారం నూరేళ్ళ పండగ రోజుకి మనదేశం నగ్నమైన ఫాసిస్టు రాజ్యంగా ఏర్పడి వుండేది.

నేటి రాజ్యాంగ చట్టం ఎత్తివేత, కొలీజియం వ్యవస్థ రద్దు వంటి కొన్ని చర్యలను చేపట్టకుండా దేశాన్ని నగ్న ఫాసిస్టు రాజ్యంగా మార్చడం సాధ్యం కాదు. అందుకు తగ్గ ఆధిక్యత రాలేదు. ఆ దిశలో గత 16 నెలలుగా వ్యూహాత్మంగా పావులు కదుపుతున్నది. ఆర్.ఎస్.ఎస్.కి 1947 తర్వాత అంతర్జాతీయ ప్రత్యక్ష గాడ్ ఫాదర్ లేదు. సరళీకరణతో తిరిగి కొత్త అంతర్జాతీయ గాడ్ ఫాదర్ దొరికాడు. గోద్రా తర్వాత మోడీ పర్యటన పై అమెరికా బయటకు నిషేధం విధించినా అంతర్గతంగా భారత్ లో తమ భావి వ్యూహానికి అర్హునిగా ఎంచుకుంది.2014 తర్వాత లోతైన బంధం ఏర్పడింది.

విభిన్న జాతులు, భాషలు, కులాలు, మతాలు, సంస్కృతులు సహజీవనంచేసే మన దేశాన్ని ఏకశిలా సదృశ్య హిందుత్వ రాజ్యంగా మార్చడం ఆర్‌ఎస్‌ఎస్ కి అంత తేలికైన కాదు. ఇదే వాస్తవాన్ని వర్తమాన చరిత్ర నిరూపిస్తున్నది. ఫ్యూడల్ రాజరిక, మనువాదాల గూర్చి, సనాతన ధర్మాల గూర్చి ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారం చేయడం తెలిసిందే. దాని అంతిమ లక్ష్యం నిజమైన పూర్వకాల మనువాద రాజ్య వ్యవస్థ నిర్మాణం లేదా పునరుద్ధరణ కాదు. ఆకులు, దుంపలు తిని బ్రతికే పురాతన మనువాద సంస్కృతి పునరుద్ధరణ జరగదు. ఆ వైపు ఆర్.ఎస్.ఎస్. అడుగు వేయలేదు. బడా కార్పొరేట్ల ప్రయోజనాలు నెరవేర్చడం ప్రధానం. ద్రవ్య పెట్టుబడిదారీ వర్గ లక్ష్యాలను నెరవేర్చడం ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యంగా ఉంటుంది. అది శ్రామిక ప్రజలతో పాటు సకల పీడిత, తాడిత వర్గాల ప్రజలకు వ్యతిరేకమైంది.

ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని ఓడించే లక్ష్య సాధన కోసం దీక్ష వహిద్దాం. అన్ని రాజకీయరంగంలోనే కాక తాత్విక, సాంఘిక, ఆర్థికరంగాల్లో కూడా ఓడించే బహుముఖ దృష్టితో పనిచేసి సమగ్ర విజయాన్ని సాధించడానికి దీక్ష వహి ద్దాం.

*(అభిప్రాయాలు రచయితవి)*

**('కమ్యూనిజం' మాసపత్రిక సౌజన్యంతో)**

# సిపిఐ పార్టీతోనే గ్రామాభివృద్ధి



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** సిపిఐ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, మండల కార్యదర్శి కావటి యాదగిరి అన్నారు. గురువారం మండలంలోని శ్రీమన్నారాయణపురం గ్రామంలో సిపిఐ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఇటుకల హనుమాజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి యాదగిరి హాజరై మాట్లాడుతూ గ్రామ పంచాయితి ఎన్నికలలో సిపిఐ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను, వార్డు మెంబర్లను గెలిపించాలని మండల ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు కంచనపల్లి గ్రామంలో 10 కుటుంబాలు సిపిఐ పార్టీలో చేరగా వారిని సిపిఐ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు రేణుబాబు, బిక్షపతి, యాదగిరి, గౌరయ్య, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు మండల వ్యాప్తంగా 28 నామినేషన్లు

**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని సర్పంచ్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. గురువారం సర్పంచ్ అభ్యర్థులకు మండల వ్యాప్తంగా 28 నామినేషన్లు రాగా 18 వార్డు సభ్యులు నామినేషన్లు దరఖాస్తులు దాఖలు చేశారుఅందులో అప్రరాజుపల్లిలో రెండు తీగలవేణిలో మూడు మచ్చర్లలో మూడు బొల్లెపల్లిలో ఏడు గూడూరు గ్రామపంచాయతీ పరిధిలో ఒకటి సర్పంచ్ ఆరు వార్డు సభ్యులు నామినేషన్ దాఖలు చుశారు.

అదేవిధంగా మత్రిమిట్ట ఐదు బొద్దుగోండ ఒకటి పోనుగోడు ఒక స్థానానికి సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్ వేయగా బొద్దుగోండ పరిదిలో ఆరు గురు వార్డు సభ్యులు నామినేషన్ దాఖాలు చేశారు. ఇందులో మట్టెవాడలో ఎవరు సర్పంచ్ వార్డుమెంబర్లకు నామినేషన్స్ దాఖలు చేయలేదు.

## జిల్లాకు రాష్ట్ర బిసి సంక్షేమ కమిషనర్, పంచాయతీ ఎన్నికల పరిశీలకులు రాక



**ప్రజాపక్షం/ వరంగల్ :** రాష్ట్ర ఎన్నికల సంఘుంచే వరంగల్ జిల్లాకు నియమించబడిన రాష్ట్ర బిసి సంక్షేమ కమిషనర్, పంచాయతీ ఎన్నికల జిల్లా పరిశీలకులు బి.బాల మాయదేవి ఐఏఎస్‌కు గురువారం వరంగల్ కలెక్టరేట్ లో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద పూల మొక్క అందించి స్వాగతం పలికారు. కలెక్టరేట్ ఛాంబర్ లోసాధారణ పరిశీలకులు బి.బాల మాయదేవి, వ్యయ పరిశీలకులు సునాయన చౌహాన్ లతో కలెక్టర్ సమావేశమమై జిల్లాలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ, పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్య, ఎన్నికల ఏర్పాట్లు తదితర అంశాలపైచర్చించారు. స్థానిక సంస్థల, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ముగ్గురు పిల్లల అనర్హుల నిబంధన ఎత్తివేస్తూ జీవోను ఉత్తర్వులను విడుదల చేశారు.

## గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల నామినేషన్ల పర్వం ప్రారంభం

**ప్రజాపక్షం / వేలేరు :** గ్రామపంచాయితీ సర్పంచ్ ఎన్నికలకు సంబందించి మొదటి దఫా ఎన్నికలలో బాగంగా హనుమకొండ జిల్లా వేలేరు మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది, మొదటిరోజు సర్పంచ్ అభ్యర్థులుగా ముగ్గురు వ్యక్తులు నామినేషన్‌లు దాఖలు చేయగా వార్డు సభ్యులుగా ఇద్దరు వ్యక్తులు మాత్రమే నామినేషన్‌లు దాఖలు చేయడం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి అల్లం సతీష్ మాట్లాడుతూ యూత్ సభ్యుడిగా ఉన్నప్పుడే గ్రామఅభివృద్ధికోసం అనేక కార్యక్రమాలు చేశానని అలాగే ఉపసర్పంచ్‌గా అయ్యాక గ్రామంలోని అంతర్గ రోడ్డులు, బండతండ, రోడ్డు మార్గంలో, చింతలతండ మార్గంలోని కట్టపైన రోడ్డు వెడల్పుకోసం మొరం పోయించడంకోసం కృషిచేసిన వ్యక్తిని కనుక సర్పంచ్‌గా గెలిపిస్తే మొదటగా కెనాల్ కోసం భూమిని కోల్పోతున్న భూనిర్వాసితులకు నష్ట పరిహారంతోపాటు ఇంటికోఉద్యోగం ఇవ్వడం కోసం అధికార యంత్రాగానితో ఎంతకైనా పోరాటం చేయడమేకాకుండా గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేస్తాను కనుక నన్నే సర్పంచ్ అభ్యర్థిగా గెలిపించాలని గ్రామప్రజలను కోరారు.నామినేషన్ల పర్వాన్ని పరిశీలించిన సిఇఒ రవినాయక్,ఎంపిడిఒ వీరేషం,ఎంపిఒ నాగరాజు కార్యక్రమంలో గ్రాపంచాయితీ కార్యదర్శి క్రాంతి ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ పరశురామ్‌కు అంబేద్కర్, పూలే జాతీయ అవార్డు




**ప్రజాపక్షం / జనగామ :** కరెన్సీపై అంబేద్కర్ పోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేరిపోతుల పరశురామ్‌కు అంబేద్కర్, పూల అవార్డు దక్కింది. ఢిల్లీలోని అంబేద్కర్ ఆడిటోరియంలో 76వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పూలే అంబేద్కర్ ఫౌండేషన్ చైర్మన్ మాజీ మంత్రి పివి రత్నం ఈ అవార్డును ప్రదానం చేశారు. జేరిపోతుల పరశురామ్ విద్యార్థి, యువజన వికలాంగుల, దళిత సంఘాల్లో అనేప పదవులు చేపట్టి దళితుల అభ్యున్నతి కోసం పనిచేశారు. కళా వేదిక ఏర్పాటు, వయోజన విద్య, బాల కార్మికుల నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 2016లో కరెన్సీపై అంబేద్కర్ పోటో సాదన సమితి ఏర్పాటు చేసి ఆర్‌బిఐ స్ఫూర్తి ప్రధాత అబేద్కర్ ఫోటోను కరెన్సీపై పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అనేక కార్యక్రమాలు చేపట్టిన పరశురామ్‌ను డిల్లీలో అంబేద్కర్ పూలే అవార్డులో సత్కరించారు.

## భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్‌గా ఉదయ్ కుమార్




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి నూతనంగా మున్సిపల్ కమిషనర్‌గా కె.ఉదయ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా విధుల్లో చేరిన అనంతరం ఉద్యోగులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రజలకు ఉన్నటువంటి సమస్యలను ముందుగానే తెలుసుకొని వాటి పరిష్కారానికి సం బంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జనగామలో మొదటి రోజు 108 నామినేషన్లు

**ప్రజాపక్షం/జనగామ:** గ్రామ పంచాయితీ నామినేషన్ల పర్వం మొదలైంది. జనగామ జిల్లాలో మొదటి రోజు 108 నామినేషన్లు ధాఖల్ అయ్యాయి. మొదటి విడతగా చిల్పూర్‌లో 17,స్టేషన్‌ఘనూర్ 15, రఘునాథపల్లి 36,జఫర్‌గడ్ 21,లింగాలఘనపురం 21 మొత్తం 110 పంచాయితీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభం అయ్యింది. ఐదు మండల్లో 108 నామినేషన్లు ధాకల్ అయినట్లు అధికారు తెలిపారు. చిల్పూర్‌లో 17,స్టేషన్‌ఘనపూర్‌లో 17,రఘునాథపల్లిలో 35, జఫర్‌గడ్‌లో 24, లింగాలఘనపూర్‌లో 15 నామినేషన్లు ధాఖల్ అయ్యాయి. మొదటి రోజు 108 నామినేషన్లు ధాఖల్ కాగా శుక్రవారం, శనివారం పెద్ద సంఖ్యలో నామినేషన్లు ధాఖల్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో గ్రామాల్లో మరింతగా రాజకీయ వేడి మొదలైంది. 1024 వార్డులకు ఎన్నికలు జరగనుండగా 44 నామినేషన్లు ధాఖల్ అయ్యాయి.

## మండలంలో పెట్రోల్ బంక్ ఉన్నా లేనట్టే!

**ప్రజాపక్షం/కన్నాయిగూడెం:** మండలంలోని ముప్పనపల్లి జిసిసి పెట్రోల్ బంక్‌లో గత వారం రోజుల నుండి డిజిల్, పెట్రోల్ అందుబాటులో లేకపోవడంతో మండలంలోని వాహనాదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రభుత్వం నిబంధనల ప్రకారం బంక్‌లో సుమారు డిజిల్ ధర రూ.96.37, పెట్రోల్ ధర రూ.108.19 ఉండగా మండలంలోని పలు గ్రామాల కిరాణా షాపుల్లో బ్లాక్‌లో రూ.20 నుండి రూ.30ల అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీనితో వాహనదారులు, వ్యవసాయ ట్రాక్టర్ యజమానులు అనేక ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తుందని, మండలంలో పెట్రోల్ బంక్ ఉన్నా లేనట్టేనని బహిర్గతంగానే చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జిసిసి ప్రెటల్ బంక్‌లో డిజిల్, పెట్రోల్ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరగాలి

ఎన్నికల జనరల్ అబ్జర్వర్ నిఖిల



**ప్రజాపక్షం/ జనగామ :** గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు నిఖిల నోడల్ అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబందించ జిల్లాకి జనరల్ అబ్జర్వర్‌గా నిఖిల నియామకం అయిన నేపథ్యంలో గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నోడల్ అధికారులతో సమావేశం నిర్వయించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశింఇచి పరిశీలకురాలు నిఖిల మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించి ప్రతి అంశం మీద అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రశాంత వాతావరణంలో పారదర్శంగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలన్నారు. అనంతరం లింగాలఘనపురం గ్రామ పంచాయతీని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్‌తో కలిస సందర్శించి నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి తప్పులు, పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. నామినేషన్లు దాఖల్ చేసే క్రమంలో కావలసిన ధృవ పత్రాలుఏ సమర్పించడం లాంటి విషయాలను అభ్యర్థులకు తెలియజేయాలన్నారు. నామినేషన్ల ఫారాలను జాగ్రత్తగా ఒకటికి రెండు సార్లు అధికారులు సరిచూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేషన్ కుమార్ జిల్లా పరిషత్ సిఈఓ మాధురి షా, వ్యవసాయ పరిశీలకులు జయశ్రీ, డిఆర్‌డిఓ వసంత, డిపిఓ నవీన్‌తో పాటు నోడల్ అధికారులు పాల్గొన్నారు.

**కలెక్టరేట్‌లో మీడియా సెంటర్ ప్రారంభం**

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గురువారం జిల్లా కలెక్టరేట్‌లో మీడియా సెంటర్, సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ సహాయ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్‌తో కలిసి జనరల్ అబ్జర్వర్ నిఖిల ప్రారంభించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మీడియా సెంటర్, సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పత్రిక ప్రకటనలు, సోషల్ మీడియా ప్రచారంపై మీడియా సెంటర్ ద్వారా నిఘా పెట్టడం జరుగుతందన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబందించి సమాచారాన్న ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్‌ఓ పల్లవి, ఈడెం గౌతమ్ పాల్గొన్నారు.

## నాలుగు మండలాల్లో 82 జిపిలకు 45 నామినేషన్లు దాఖలు

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు 4 మండలాల్లోని గణపురం, కొత్తపల్లిగోరి, రేగొండ, మొగుళ్లపల్లి మండలాల్లోని 82 గ్రామ పంచాయతిలకు 45, 712 వార్డులకు 35 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ తెలిపారు. మొదటి విడతలో 4 మండలాల్లోని 82 గ్రామ పంచాయతీల పరిధిలోని 712 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణను ఈ నెల 27న ఉదయం 10.30 గంటల నుండి 29 న సాయంత్రం 5 గంటల వరకు సమయం ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను పాటిస్తూ నిర్ణీత సమయంలో నామినేషన్లు దాఖలు చేసేందుకు అన్ని రిటర్నింగ్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు ప్రక్రియ పర్యవేక్షణకు నోడల్ అధికారులు, ఎస్ఎస్టి, ఎఫ్ఎస్టీ, ఎంసిసి టీములు పటిష్ట పర్యవేక్షణ చేయాలని, ఎన్నికలు నిర్వహణలో ప్రజలు యంత్రాంగానికి సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు. ఏదేని ఫిర్యాదులు కు 24 గంటలు పని చేయు విధంగా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూము 9030632608 నంబర్ కు కాల్ చేయాలని ఆయన తెలిపారు.

## ప్రతి డివిజన్‌లో జెసిబిలు, సక్కింగ్ మిషన్ వినియోగానికి షెడ్యూల్ రూపొందించండి

నగర్ మేయర్ గుండు సుధారాణి



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** నగరంలోని 66 డివిజన్‌లలో జెసిబిల, సక్కింగ్ మిషన్ల వినియోగానికి షెడ్యూల్ రూపొందించాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. గురువారం బాలసముద్రంలో బల్దియా నిర్వహిస్తున్న వెహికిల్ షెడ్‌ను కమిషనర్ చాహత్ బాజ్ పాయ్‌తో కలిసి క్షేత్ర స్థాయిలో సందర్శించి సమర్థవంతంగా చేపట్టుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో భాగంగా బల్దియా పరిధిలో రెండు సర్కిల్‌ల వారిగా 6 జెసిబి వాహనాలు అందుబాటులో ఉంచి కనీసం ప్రతి 15 రోజులకు ఒక సారి ఒక డివిజన్‌లో ప్రత్యేకంగా వినియోగానికి చర్యలు చేపట్టాలని తద్వారా కార్పొరేటర్‌లు వారి డివిజన్‌లలో శానిటేషన్ పనుల నిర్వహణకు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. కార్పొరేటర్‌లకు ఇట్టి సమాచారాన్ని అందజేయాలని అన్నారు. సక్షన్ వాహనానికి షెడ్యూల్ రూపొందించి నీరు నిలిచిఉండే ప్రాంతాల్లో ఈ యంత్రం ద్వారా తొలగింపు చేపట్టేలా చూడాలని ఇట్టి వాహన కదలికలు ఐసిసిసి కి అనుసంధించాలని అన్నారు. డంప్ యార్డు, ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లలో పంక్చర్ యూనిట్ ఏర్పాటు చేయాలని అన్నారు. చెత్త తరలింపు వాహనాలు ఎక్కడైనా అకస్మాత్తుగా బ్రేక్ డౌన్ ఐతే వాటికి మరమ్మత్తులు చేపట్టడానికి ఒక మొబైల్ వాహనాన్ని ఏర్పాటు చేసి అత్యవసరంగా మరమ్మత్తులు అందించేలా చూడాలని ఆదేశించారు. కొన్ని స్వచ్ఛ ఆటోలకు మైక్‌సెట్‌లు లేవని వెంటనే ఏర్పాటు చేసి తడి పొడి చెత్తను వేరుగా అందించేలా అవగాహన కలిగించాలని అన్నారు. మరమ్మత్తులకు గురైన స్వచ్ఛ ఆటోలకు వెంటనే మరమ్మత్తులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని మేయర్ తెలిపారు. ఎస్ఈ సత్యనారాయణ, సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఇఇలు మహేందర్, రవికుమార్, మాధవిలత, డిఈలు రాజ్‌కుమార్, రాగి శ్రీకాంత్, సానిటరీ సూపర్‌వైజర్ గోల్కొండ శ్రీను, ఎఇలు ఫణి, సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మూడు దశల్లో ఎన్నికల నిర్వహణ

హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



**ప్రజాపక్షం/హనుమకొండ :** గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, మూడు దశలలో ఎన్నికల నిర్వహణ జరుగుతుందని, గురువారం నుంచి నామినేషన్‌లను స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హన్మకొండ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు మూడు దశలలో నిర్వహించడం జరుగుతుందని మొదటి విడతలో భిమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మూడు మండలాలలోని 69 గ్రామపంచాయతీలకు 658 వార్డు లకు గురువరం నుండే నామినేషన్‌ల స్వీకరిస్తున్నట్లు, డిసెంబర్ 11న గురువారం ఉదయం 7 గంటల నుండి మ ధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహించి మధ్యాహ్నం రెండు గంటల నుండి ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. రెండవ దశ పోలింగ్ ధర్మసాగర్, హసన్‌పర్తి, ఐనవోలు, వేలేరు, పరకాల మొత్తం ఐదు మండలాలలోని 73 గ్రామ పంచాయతీలకు , 694 వార్డ్ లకు, తేదీ.30.11.2025 ఆదివారం నామినేషన్ ల స్వీకరణ ప్రారంభం అవుతుందని, తేదీ.14.12.2025 ఆదివారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహించి మధ్యాహ్నం రెండు గంటల నుండి ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు.మూడవ దశలో ఆత్మకూరు, దామెర,నడికూడ, శాయంపేట్ నాలుగు మండలాలలోని 68 గ్రామ పంచాయతీలకు , 634 వార్డ్ లకు తేదీ.03.12.2025 బుధవారం రోజున నామినేషన్ ల స్వీకరణ ప్రారంభం అవుతుందని తేదీ.17.12.2025 బుధవారం ఉదయం 7 గంటల నుండి మ ధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహించి మధ్యాహ్నం రెండు గంటల నుండి ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. 2.9.2025 ఫోటో ఎలక్టోరల్ రోల్ ప్రకారం జిల్లాలోని 12 మండలాల్లో మొత్తం 3,70,871 ఓటర్లు ఉండగా 1,80,666 పురుషులు, 1,90 ,201 మహిళలు, నలుగురు ట్రాన్స్జెండార్స్ ఉన్నారని అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కగా అమలయ్యేలా నోడల్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. 2382 బ్యాలెట్ బాక్సులు అవసరముండగా 20 శాతం అధికంగా 3070 బ్యాలెట్ బాక్స్ లను అందుబాటులో వుంచినట్లు అన్నారు. పోలింగ్ కేంద్రాల వారిగా పోలింగ్ మెటీరియల్ కిట్లుపంపిణీ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల నిర్వహణకు 1480 పి ఓ లు, 1891 ఓపిఓ లను నియమించినట్లు తెలిపారు. మొదటి విడతలో పోలింగ్ జరిగే 658 పోలింగ్ స్టేషన్ల లో సమస్యాత్మకమైన 14 గ్రామ పంచాయతీ ల్లోని 166 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తున్నట్లు, అదేవిధంగా రెండవ విడతలో 18 గ్రామ పంచాయతీల్లోని 208 పోలింగ్ కేం ద్రాలలో, మూడవ విడతలో 20 గ్రామ పంచాయతీల్లోని, 212 సమస్యాత్మకమైన పోలింగ్ కేం ద్రాలలో వెబ్ కాస్టింగ్ తో పాటు 66 మంది మైక్రో అబ్జార్వర్లను నియమించామని తెలిపారు. ప్రతి మండలంలో క్లస్టర్ లను ఏర్పాటు చేశామని నామినేషన్ దాఖలాలు చేసే అభ్యర్థులు వారి క్లస్టర్ లో సూచించిన గ్రామపంచాయతీలలో నామినేషన్ సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఓటింగ్ ప్రక్రియ వెబ్ కాస్టింగ్ వీడియోగ్రఫీ ద్వారా రికార్డ్ చేయడం జరుగుతుందని అన్నారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను పరిశీలించడానికి వ్యయ పరిశీలకులను కూడా సిద్ధం చేశామని , సర్పంచ్ గా పోటీ చేసే అభ్యర్థులు 5 వేల జనాభాకుపైగా ఉన్న గ్రామాలలో సర్పంచ్ అభ్యర్థి 2 లక్షల 50 వేల రూపాయల వరకు వార్డ్ సభ్యులకు 50 వేల రూపాయలు, 5 వేల జనాభా తక్కువగా ఉన్న గ్రామాలలో ఒక లక్ష 50 వేల రూపాయలు వార్డ్ సభ్యులు 30 వేలవరకు ఖర్చు చేసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ప్రతి మండలానికి రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్ లు, జిల్లా సరిహద్దుల్లో 4 ఎస్ ఎస్ టి బృందాలు కటాక్షపూర్, ఎల్కతుర్తి, ఫున్నేల్ క్రాస్ రోడ్, పెద్దపెండ్యాల వద్ద ఏర్పాటు చేసినట్లు తెలిపారు.2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ ఎస్టీ లకు, ఎస్‌సిపిసి సర్వే 2024 డాటా ప్రకారం బీసీలకు ఇతరులకు డెడికేషన్ కమిటీ 46 జీవో నెంబర్‌ను అనుసరించి రిజర్వేషన్లు కల్పించడం జరిగిందని అన్నారు. ఎన్నికల అభ్యర్థులకు ప్రజలకు ఏమైనా సందేహాలు ఉంటే జిల్లా కేంద్రంలో, స్థానిక ఎంపీడీవో కార్యాలయాలలో హెల్ప్ లైన్ డెస్క్ లను ఏర్పాటు చేశామని వీటి ద్వారా తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా జిల్లా కలెక్టరేట్ లో ఎన్నికల సహాయక కేంద్రం 24 గంటల పాటు పనిచేస్తుందని, ఎన్నికలకు సంబంధించి సందేహాలు, ఫిర్యాదుల కోసం సహాయక కేంద్రం ఫోన్ నెంబర్ 7981975495 ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలో సర్పంచ్, వార్డ్ సభ్యుల ఎన్నికలు పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని కలెక్టర్ స్నేహ శబరిష్ కోరారు.

# కెటిఆర్ అహంకారపు మాటలు శోచనీయం

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి




**ప్రజాపక్షం/స్టేషన్ ఘన్‌పూర్/జనగామ :** అహంకారం, బలుపుతో మాట్లాడితే పెద్ద నాయకులు కాలేరని, దాన్ని ప్రజలు హర్షించరని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం స్టేషన్ ఘన్‌పూర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. మాజీ మంత్రి కెటిఆర్‌పై ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కెటిఆర్ సభ్యత, సంస్కారం మర్చి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను కెటిఆర్‌లాగా అయ్య పేరు చెప్పుకొని.. కుటుంబం పేరు చెప్పుకొని రాజకీయాలు చేయడం లేదన్నారు. నేను సొంతంగా ఎదిగిన నాయకుడిని అన్నారు. కెసిఆర్ లేకపోతే కెటిఆర్ ఎక్కడ ఉండేవాడో ఆయన ఊహకే వదిలేస్తున్నాను. కడియం శ్రీహరి 100 శాతం దమ్మున్న నాయకుడన్నారు. నీతి, విలువల గురించి మాట్లాడే నైతిక అర్హత కెటిఆర్‌కు లేదన్నారు. పదేళ్లలో 36 మంది ఎమ్మెల్యేలను చేర్చుకొని అందులో ఇద్దరికి మంత్రి పదవులు ఇచ్చినపుడు నీతి, విలువలు గుర్తు రాలేదా అన్నారు. గీకుడుగాళ్లు, గోకుడుగాళ్లు, తాగుబోతులను వెంటేసుకొని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. బలుపు, అహంకారంతో మాట్లాడితే ప్రజలు హర్షించరన్నారు. తెల్లారి లేస్తే ప్రెస్‌మీట్లు పెట్టి ప్రతిపక్షాలపైన ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకున్నాడన్నారు. రాజకీయాల్లో అందరూ లక్ష్యంతోనే పనిచేస్తారని, కాని మంచి నాయకునిగా ఎదగాలంటే అహంకారం, బలుపు తగ్గించుకొని సభ్యతా, సంస్కారంతో మాట్లాడాలన్నారు. కెటిఆర్ నాయకత్వంపై పలు అనుమానాలు వ్యక్తవుతున్నాయన్నారు. కెటిఆర్ నాయకత్వంపై నమ్మకం లేకనే కవిత వెళ్లిందన్నారు. కెటిఆర్‌కు సిగ్గుంటే కవిత ఆరోపనలకు సమాధానం చెప్పాలన్నారు. చెల్లికి సమాధానం చెప్పలేని దద్దమ్మ, సన్యాసి కెటిఆర్ అన్నారు. తన దగ్గర ఆధారాలున్నాయి కాబట్టే కవిత ఆ విధంగా ఆరోపణలు చేస్తుందన్నారు. ముందు నీ చెల్లికి సమాదానం చెప్పి కుటుంబాన్ని చక్కదిద్దుకోవాలని సలహా ఇచ్చారు. కెటిఆర్ నాయకత్వం నచ్చకనే హరీశ్‌రావు దూరంగా ఉంటున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సిరీస్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బ్రహ్మారెడ్డి, చైర్మన్ తీగల కర్ణాకర్, మాజీ జెడ్‌పిటిసి బేబి శ్రీనివాస్, మాజీ ఎంపిపి రేఖ గట్టయ్య, తెల్లాకుల రామకృష్ణ, సతీష్, మాజీ సర్పంచ్ కత్తుల కట్టయ్య, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మేడారం జాతర ఏర్పాట్లలో అలసత్వం తగదు

జిల్లా ఎస్పి సుధీర్ రామ్‌నాథ్ కేకన్



**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లా కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన మేడారం జాతర సమీక్ష సమావేశంలో ములుగు జిల్లా ఎస్పి సుధీర్ రామ్‌నాథ్ కేకన్ మాట్లాడుతూ రానున్న మేడారం మహా జాతరకు విచ్చేస్తున్న భక్తుల కోసం పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని, జాతర ఏర్పాట్లలో ఎటువంటి అలసత్వం వహించరాదని ములుగు జిల్లా ఎస్పి సుధీర్ రామ్నాథ్ కేకన్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పనులపై విస్రృతంగా చర్చించారు. ప్రతి అధికారి కూడా వారికి అప్పగించిన ప్రతి పనిని నిబద్ధతతో చేయాలని జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మన పైన ఉందని దిశా నిర్ధేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డి శివ ఉపాధ్యాయ, డిసిఆర్‌బి డిఎస్‌పి కిషోర్ కుమార్, సిఎస్‌బి డిఎస్‌బి నందిరామ్, ములుగు డిఎస్‌పి రవీందర్, ములుగు జిల్లా సిఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్ ఎస్‌ఐలు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు, వ్యవసాయ, కార్మిక వ్యతిరేక విధానాలు ఉపసంహరించుకోవాలి

బికెయంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు

**ప్రజాపక్షం/ వరంగల్ :** కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన కార్మిక హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించాలని, రైతు , వ్యవసాయ కార్మిక డిమాండ్స్ ఆమోదించాలని భారతీయ ఖేత్‌మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం దేశవ్యాప్తంగా లక్షలాది మంది అణచివేతను సైతం అధిగమించి కార్మికులు, కర్షకులు, కూలీలు రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు సమర శంఖం పూరించారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి కార్మిక, కర్షక, ఉపాధి కూలీల వ్యతిరేక విధానాలను విడనాడాలన్నారు. రైతు పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని, గిరిజన హక్కులను కాపాడడానికి అటవీ హక్కుల చట్టం సక్రమంగా అమలు జరపాలన్నారు. మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాల విడనాడకుంటే పోరాటాలు ఉధృతమవుతాయని హెచ్చరించారు.

# ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిద్దాం

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** త్వరలో నిర్వహింబడే గ్రామ పంచాయితీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకుగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాల్సిందిగా వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు పిలుపు నిచ్చారు. నెలవారి నేర సమీక్షా సమావేశంలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ అధ్వర్యంలో గురువారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన పోలీస్ అధికారులు పాల్గన్న ఈ సమావేశంలో ముందుగా త్వరలో మూడు విడతలు జరగబోయే పంచాయతీ ఎన్నికలను సజావు నిర్వహించేందుకు గాను తీసుకోవాల్సిన ముందస్తూ చర్యలపై పోలీస్ కమిషనర్ అధికారులతో చర్చించడంతో పాటు, పోలీస్ స్టేషన్ వారిగా ఎన్నికలు జరిగే గ్రామ పంచాయితీల వివరా లతో పాటు సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, గ్రామాల వివరాలను పోలీస్ కమిషనర్ సంబంధించిన స్టేషన్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి పోలీస్ అధికారి ప్రణాళికబద్ధంగా పనిచేయాల్సి వుంటుందని. ఎన్నికల వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు ముందస్తూ చర్యలు తీసుకోవాల్సి వుంటుందని. నామినేషన్ మొదలుకొని ఎన్నికలు ముగిసే వరకు పోలీస్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి వుంటుందని. సరైన రీతిలో బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని. గతంలో ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడిన నేరస్తులతో పాటు, ఎన్నిక సమయంలో నేరాలకు పాల్పడేవారు, పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులను బెండోవర్ చేయాలని, ఎన్నికలు జరిగే గ్రామాలకు పోలీస్ అధికారులు నిరంతరం సందర్శిస్తూ ఎన్నికలను సజావుగా కొనసాగేందుకుగా స్థానిక గ్రామస్తులతో సమన్వయం చేసుకోవాలని. సమావేశంలో డిసిపిలు అంకిత్ కుమార్,రాజమహేంద్ర నాయక్, కవిత, ఎఎస్‌పిలు శుభం, చెతన్య, అదనపు డిసిపిలు రవి,ప్రభాకర్, బాలస్వామి, సురేశ్‌కుమార్,శ్రీనివాస్‌తో పాటు ఏసిపిలు, ఇన్స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఎస్.ఐలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## గిరిజన మ్యూజియాన్ని సందర్శించిన గి.సం.శా అదనపు కార్యదర్శి

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఐటిడిఏ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గిరిజన మ్యూజియాన్ని గిరిజన సంక్షేమశాఖ అదనపు కార్యదర్శి సర్వేశ్వర్‌రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మ్యూజియంలో పొందు పరిచిన గిరిజన ఆదివాసీ తెగలకు చెందిన ఆచార వ్యవహారాల వస్తు సామాగ్రిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంతరించి పోతున్న సంస్కృతి సంప్రదాయాలను ముందు తరం వారికి తెలిసే విధంగా గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయడం భవిష్యత్ తరాలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వచ్చే సందర్శకుల ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకుని అందుకు తగినట్లుగా తీర్చిదిద్దాలన్నారు. పిల్లలు, పెద్దలు విల్లంబులు వేసేందుకు వేర్వేరుగా ఏర్పాటు చేయాలని, చిన్నారులకు క్రీడా స్థలాలు, యువకుల కోసం బాక్స్ క్రికెట్ నెట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కువ సంఖ్యలో సందర్శకులు వచ్చేలా కొత్తకొత్త డిజైన్లు రూపొందించి మ్యూజియంలో పొందు పరచాలని చెప్పారు. ఏపిఓ జనరల్ డేవిడ్ రాజ్, డిడి అశోక్, డిఎస్ఓ ప్రభాకర్ తో పాటు శాఖాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసిన : నూతి సత్యనారాయణ

**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన వైరాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నూతి సత్యనారాయణ గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ కూడా మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## స్థానిక పోరులో సత్తా చాటుదాం

సిపిఐ నాయకుడు చంద్రగిరిశ్రీనివాసరావు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటేందుకు సిద్ధం కావాలని, సిపిఐ మద్దతు దారులకు ఘన విజయాన్ని అందించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, లక్ష్మీ దేవిపల్లి మండల బాధ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు అన్నారు.మండల పరిధిలోని గ్రామాలకు కావాల్సిన మౌళిక వసతులు, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ఇప్పటికే 80 శాతం మేర పనులు పూర్తి చేశామని, మరికొన్ని పనులు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ఈ అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయంవైపు పయణించాలని సూచించారు. ప్రజలకు సేవలందించే అభ్యర్థులను ఎంపిక చేసి మద్దతు తెలపాలని, ప్రచార కార్యక్రమాలు ముమ్మురంగా నిర్వహించాలని సూచించారు.లక్ష్మీ దేవిపల్లి మండల కార్యదర్శి ధీటి లక్ష్మీ పతి, జిల్లా సమితి సభ్యులు కె రత్నకుమారి, గుత్తుల సత్యనారాయణ, దారా శ్రీనివాస్ లక్ష్మారెడ్డి, మంద నిర్మల, నూనావత్ గోవింద్, సపావట్ రవి, బానోత్ నెహ్రు, జర్పుల ఉపేందర్ పాల్గొన్నారు.

## ఘనంగా పోటు ప్రసాద్ ప్రథమ వర్ధంతి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సిపిఐ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు, ఖమ్మం జిల్లా మాజీ కార్యదర్శి పోటు ప్రసాద్ ప్రథమ వర్ధంతి సిపిఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో పోటు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్ళర్పించారు.విద్యార్థి,యువజన, కార్మిక రంగాల్లో సుదీర్ఘకాలం పనిచేసిన పోటు ప్రసాద్ అనేక పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, ఖమ్మం జిల్లా కార్యదర్శిగా సేవలందించి పార్టీ విస్తరణకు కృషి చేశారని, తన తుదిశ్వాస వరకు కష్ట జీవుల విముక్తి కోసం పనిచేశారని కొనియాడారు. కమ్యూనిస్టు నేతగా నిబద్దత గల నాయకునిగా అనేక పలువురికి ఆదర్శప్రాయుడని చెప్పారు. పోటు ఆశాయల సాధన కోసం కమ్యూనిస్టులంతా పునరాంకితం కావాలని పిలుపునిచ్చారు.లక్ష్మీ దేవిపల్లి మండల కార్యదర్శి ధీటి లక్ష్మీ పతి, జిల్లా సమితి సభ్యులు రత్నకుమారి, గుత్తుల సత్యనారాయణ, దార శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, మంద నిర్మల, గోవింద్, రవి,నెహ్రు, జర్పుల ఉపేందర్ పాల్గొన్నారు.


## తొలి రోజే 17 సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్లు

నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన జెడ్‌పిసిఇఒ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రఘునాథపాలెం మండలంలో తొలి రోజు సర్పంచ్ స్థానాలకు 17 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. గురువారం ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా మండల పరిధిలో 37 గ్రామ పంచాయతీలకు గాను 17 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. సర్పంచ్ స్థానాలకు చిమ్మపుడిలో ఒకటి, ఈర్లపుడిలో ఒకటి, జికె బంజరలో మూడు, కోటపాడులో ఒకటి, కెవి బంజరలో ఒకటి, మంచుకొండలో ఒ క టి, పంగిడిలో ఒకటి, పాపటపల్లిలో ఐదు, రాంక్యాతండాలో ఒకటి, రేగులచలకలో ఒకటి, వి.వెంకటాయపాలెంలో ఒకటి మొత్తం 17 మంది అ భ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వి.వెంకటాయపాలెం గ్రామంలో సిపిఐ మద్దతుతో శాఖమూరి శ్రీనివాసరావు సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. పాపటపల్లిలో వి.ద్రాక్షావతి సర్పంచ్ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. అదేవిధంగా పలువురు వార్డు స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మీడియా సెంటర్‌ను ప్రారంభించిన అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్‌లోని డిపిఆర్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసిఎంసి)ను అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి గురువారం ప్రారంభించారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. డిపిఆర్‌వో ఎంఎ గౌస్, డిపివో ఆశాలత, అదనపు పిఆర్‌వో ఎండి అయూబ్ ఖాన్, ఎంసిఎంసి కమిటీ సభ్యులు, కార్యాలయ టైపి స్ట్ ప్రవళిక, కంప్యూటర్ ఆపరేటర్లు నవీన్, హరీష్, సిబ్బందిశ్రీనివాసరావు, చావా నారాయణ, తాజుద్దీన్, మంగ,అధికారులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



**ప్రజాపక్షం/ఇల్లందు:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు గురువారం ఇల్లందు జనరల్ మేనేజర్ వి కృష్ణయ్యకు గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం(ఐఎఫ్‌టియు)ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. జిఎల్‌బికేఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల శ్రీనివాస్, పోశం బాబు, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కొక్కుసారంగపాణి, ఏరియా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి ఉపేందర్ రావు, మోహన్‌రావు, పాల్గొన్నారు.

# నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు

నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఎన్నికల నిబంధనల ప్రకారం పారదర్శకంగా విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మొదటి విడత గ్రామ పంచాయతీ నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గురువారం నుండి మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. రఘునాథపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చింతగుర్తి, గణేశ్వరం, రఘునాథపాలెం గ్రామాల నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తనిఖీ చేశారు. దాఖలు చేసే నామినేషన్ పత్రాలను పరిశీలించారు. ఎన్నికల విధులు, బాధ్యతల పట్ల సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఎలాంటి లోటు పాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆ దేశించారు. ఎన్నికల విధుల పట్ల అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ తర్వాత పోటీ అభ్యర్థుల ప్రకటన, వారి గుర్తులు, కేటాయింపు తదితర అంశాలపై పూర్తి బాధ్యతతో అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో ఏడు మండలాల్లో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 192 సర్పంచ్, 1740 వార్డు సభ్యుల స్థానాలకు గు రువారం నుండి ఈనెల 29 శనివారం వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. మొ దటి విడతలో మూడువేల సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు ఎన్నికల నిర్వహణలో సంపూర్ణ మద్దతు ఎన్నికల సిబ్బందికి అందించాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అ వసరమైన మేర అధికారులు, సిబ్బంది, పోలీస్ సుమారు ఎనిమిది వేల మంది నియమాకం పూర్తి చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల వివరాలు, ఓటర్ జాబితా వివరా లు, సంబంధిత పోటీ చేసే అభ్యర్థులకు సమాచారం అం దిస్తామన్నారు. నామినేషన్ కేంద్రాల వంద మీటర్ల పరిధిలో ఎటువంటి ర్యాలీలు, ప్రచారాలకు అనుమతి లేదని ఎన్నికల ప్రచారం నిమిత్తం ర్యాలీ, సమావేశాల నిర్వహణకు ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల్లో ప్రలోభాలకు గురి చేసేందుకు అక్రమంగా నగదు, మ ద్యం తరలిస్తే పట్టుకుని సీజ్ చేయడం జరుగుతుందన్నారు.

# బాల్య వివాహాలను నిర్మూలించాలి




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో ఒక్క బాల్య వివాహం కూడా జరగకుండా నిర్మూలించాలని జిల్లా బాలల సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ గుంటుపల్లి భారతిరాణి పిలుపు నిచ్చారు. జాతీయ బాల్య వివాహ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ (ఎయిడ్) సంస్థ, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం గాంధీచౌక్‌లోని బాలికల జూనియర్ కళాశాలలో 100 రోజుల బాల్య వివాహ నిరోధక కార్యచరణ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన భారతిరాణి మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన అనేది ప్రజల భాగస్వామ్యంతో జరుగుతుందన్నారు. బాలికలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆ తర్వాతే వివాహం గురించి ఆలోచించాలని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి వెల్పుల విజేత మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమం ద్వారా ఆడపిల్లల యొక్క విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల పట్ల నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బాలల సమస్యల పరిష్కారానికి చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు కాల్ చేసి తెలపాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి చైతన్య జైని మాట్లాడుతూ ఆడపిల్లలు కౌమర దశలో వచ్చే మార్పుల పట్ల ఆందోళన చెందకుండా ఉండాలన్నారు. రక్తహీనత రాకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని తెలిపారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు మాట్లాడుతూ బాల బాలికలు మత్తు పదార్థాలు, సామాజిక మాధ్యమాలు, చరవాణి వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎయిడ్ సంస్థ డైరెక్టర్ వాణి హరి ప్రసాదరావు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా మూడేళ్లుగా బాల్య వివాహాల నిర్మూలనపై, లైంగిక దాడులపై , బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణాపై క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రంగవల్లుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

## విజ్ఞానానికి తొలిమెట్టు సైన్స్ ఫెయిర్

జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధికి బాల విద్యా విజ్ఞానానికి సైన్స్ ఫెయిర్ వేదికలు తొలిమెట్టు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక సెయింట్ మేరీస్ స్కూల్లో 53వ జాతీయ సైన్స్ ఫెయిర్ ముగింపు కార్యక్రమం జరిగింది. విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. సైన్స్ ఫెయిర్ ద్వారా అవగాహన చేసుకున్న అంశాలపై నిత్యం మననం చేసుకుంటే భవిష్యత్‌లో ఉపయోగపడతాయని చెప్పారు. శాస్త్రవేత్తల కృషి పట్టుదల వల్ల నేడు దేశంలో శాస్త్ర సాంకేతికంగా ముందుకు సాగుతుందన్నారు. ప్రతీ విద్యార్థి మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ జీవితాన్ని చదవాలని చెప్పారు. అనంతరం జిల్లా విద్యాధికారి బి నాగలక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థుల జ్ఞాన సంపత్తిని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గనగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులను అందజేశారు. పరిక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, అప్రమత్తంగా లేకుంటే జరిగే నష్టాలపై నైనిక ఇచ్చిన సందేశాన్ని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రారంభమైన నామినేషన్ల ఘట్టం




**ప్రజాపక్షం/ ఖమ్మం :** పంచాయతీ ఎన్నికల తొలి దశకు సంబంధించి గురువారం నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి దశలో ఏడు మండలాల పరిధిలోని 192 గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు 1740 వార్డులకు నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. పలువురు అభ్యర్థులు తమ మద్దతుదారులతో వచ్చి నామినేషన్లు దాఖలు చేశారు.తొలి రోజున 192 పంచాయతీలకు సంబంధించి 99 మంది నామినేషన్లను దాఖలు చేశారు. 1740 వార్డులకు గా ను తొలి రోజున 49 మంది వార్డు సభ్యులు నామినేషన్లను ఎన్నికల అధికారులకు అందజేశారు. ఈ దఫా సాధారణ నియమాలతో పాటు తప్పని సరిగా నూతన బ్యాంక్ ఖాతా ఏర్పాటు చేయాలన్న నిబంధన ఇబ్బందికరంగా మా రింది. దీనితో బరిలో నిలిచే అభ్యర్థులు బ్యాంకుల చుట్టు తిరుగుతున్నారు. సిపిఐ మద్దతుతో వి. వెంకటాయపాలెం సర్పంచ్ అభ్యర్థిగా శా ఖమూరి శ్రీనివాసరావు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. చిన్నగోపతి సర్పంచ్ అభ్యర్థిగా సిపిఐ నాయకుడు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. నేరడలో సర్పంచ్ అభ్యర్థిగా దూసరి నేతాజీ నామినేషన్లను దాఖలు చేశారు.

# 'స్థానిక' విచిత్రం

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్

గిరిజన తెగల మధ్య రగడ

భద్రాచలం సర్పంచ్ సీటుకు యమ డిమాండ్




**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం ఏజెన్సీలో స్థానిక ఎన్నికల వ్యవహారం చిత్రవిచిత్రమైన పుంతలు తొక్కుతోంది. పంచాయితీ ఎన్నికల్లో ఆదివాసీలకే అవకాశం ఇవ్వాలని, అక్రమంగా గిరిజన హోదా అనుభవిస్తున్న లంబాడీలకు అవకాశం కల్పిస్తే సహించేది లేదని ఆదివాసీ ఐఖ్యకార్యచరణ సమితి తేల్చి చెప్పడంతో భద్రాచలం ఏజెన్సీలో గ్రామపంచాయితీ ఎన్నికల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. మరో ప్రక్క లంబాడీలను ఎస్టి జాబితా నుండి తొలగించాలని స్వ యంగా స్థానిక ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు కోర్టులో పిటీషన్ దాఖలు చేయడంతో ఆదివాసీలకు మరింత బలం చేకూరింది. ఇదిలా ఉండగా భద్రాచలం నియోజకవర్గంలో కాంగ్రెస్ రెండు గ్రూపులుగా కొనసాగుతోంది. ఎంఎల్‌ఏ వెంకట్రావుది ఒకగ్రూపు కాగా అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్యది మరో వర్గం. వీరిద్దరి మధ్య ప్రస్తుతం పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఇప్పుడు స్థానిక ఎన్నికల సందర్భంగా ఎవరి తీరు వారిదే అన్న చందంగా ఉంది. స్థానిక ఎంఎల్‌ఏ డా.తెల్లం పూ నెం కృష్ణ అనే మాజీ వార్డు మెంబర్‌ను సర్పంచ్ అభ్యర్థిగా ఖరారు చేశారు. దీంతో గు రుగా ఉన్న ఆయన భద్రాచలం మొదలుకుని వాజేడు వరకు తన వర్గాన్ని రంగంలోనికి దింపుతున్నట్లు తెలుస్తోంది. ఈనెల 29 వరకు నామినేషన్లు సమర్పించేందుకు అవకాశం ఉండటంతో జాబితా సిద్ధం చేసినట్లు ప్రచారం సాగుతోంది.స్థానిక ఎన్నికల తతంగం గిరిజన తెగల మధ్య ఉన్న రగడ మరింత రచ్చకెక్కేలా చేస్తోంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీ, లంబాడీల మధ్య అస్తిత్వ పోరాటం సాగుతోంది. తామే నిజమైన ఆదివాసీలమని, లంబాడీలు దొడ్డిదారిన వచ్చిన తమ ఫలాలను అనుభవిస్తున్నారని ఆదివాసీలు మండిపడుతున్నారు. భద్రాచలం రెవెన్యూ డివిజన్‌లో రాజకీయ పార్టీలు లంబాడీలకు మద్దతు పలికితే సహించేది లేదని, గిరిజన ప్రజాప్రతినిధులు తెగకు అన్యాయం చేస్తే ఊరుకోబోమని ఆదివాసీలు పెద్ద ఎత్తున పట్టుపడుతున్నారు.గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి యమ డిమాండ్ ఉంది. గ్రామపంచాయితీల్లో భద్రాచలం మేజర్ గ్రామ పంచాయితీకి వచ్చే ఆదాయం, నిధులు దండిగా నే ఉంటాయి. తెగ డిమాండ్ ఉన్న భద్రాచలం స ర్పంచ్ స్థానం అనూహ్యంగా ఎవరికి ద క్కను ందో అనేది ఈనెల 29న నామినేషన్ల ఉపసంహరణ తర్వాత ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

## స్థానిక ఎన్నికల కోలాహలం

**సర్పంచ్-82, వార్డు మెంబర్స్‌గా 87 దాఖలు**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో స్థానిక ఎన్నికల కోలాహలం మొదలైంది. మూడు విడతల్లో జరగనున్న ఈ ఎన్నికలకు తొలి విడతలో భాగంగా గురువారం మంచి రోజు కావడంతో ప్రధాన పార్టీలు బలపరిచిన అభ్యర్థులు వారివారి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. జిల్లాలో ఏర్పాటు చేసిన నామినేషన్ పత్రాల స్వీకరణ కేంద్రాల వద్ద అభ్యర్థులు పోటీలు పడీ మరీ మందీ మర్బాలంతో చేరుకుని నామినేషన్లు వేశారు. జిల్లా వ్యప్తంగా తొలివిడతలోని ఎనిమిది మండలాల పరిధిలో 159 సర్పంచ్ స్థానాలకు గానూ 82 మంది నామినేషన్ పత్రాలు సమర్పించారు. అదే విధంగా 1436 వార్డు మెంబర్ స్థానాలకు గానూ 87 మంది వారివారి నామినేషన్ పత్రాలు సమర్పించారు. నామినేషన్లు వేసేందుకు ఈనెల 29వ తేది సాయంత్రం 5 గం.ల వరకు సమయం ఉండటంతో భారీగా నామినేషన్ పత్రాలు దాఖలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా నామినేషన్ సమయంలో ఆయా అభ్యర్థులను బలపరుస్తున్న రాజకీయ పార్టీలు సందడి చేశాయి. ఇక గెలుపు తమదే అన్న రీతిలో వారి తీరు సాగింది.

# జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు






**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలోని ఆయా స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు సిబ్బందితో కలిసి విస్తృత తనిఖీలు చేపడుతున్నట్లు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. అర్ధరాత్రి సమయంలో తిరుగుతున్న అనుమానితులను నిలువరించి వారి వివరాలు, వేలిముద్రలను సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. విజబుల్ పోలీసింగ్ పటిష్టంగా అమలు చేస్తేనే నేరాలు నియంత్రణలో ఉంటాయన్నారు. పోలీసు గస్తీ, పెట్రోలింగ్ ముమ్మరం చేశామన్నారు. హోటళ్లు, లాడ్జిలపై సోదాలు చేసి అనుమానితుల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు అన్ని స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, పోలీసు అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. అదేవిధంగా జిల్లాలో ఉన్న రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి గంజాయి, రేషన్ బియ్యం, ఇసుక వంటి అక్రమ రవాణాను కట్టడిచేస్తున్నట్లు సిపి వివరించారు. అన్ని రకాల వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు.

## మేడారంజాతరకు ప్రత్యేక బస్సులు

ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ సరిరామ్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్దదైన సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్ల భక్తుల కొరకు ఖమ్మం నూతన బస్టాండ్ ను ంచి ప్రతి ఆదివారం మేడారంకు ప్రత్యేక బస్సు సర్వీస్ నడపనున్నట్లు ఆర్టిసి రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ గురువారం తెలిపారు. 2026 జనవరి 28 నుంచి 31 వరకు సమ్మక్క సారలమ్మ జాతర జరగనుందని ముందస్తుగా టిజిఎస్ ఆర్టిసి ఖమ్మం డిపో నుంచి ప్రతి ఆదివారం ఎక్స్‌ప్రెస్ బస్సు ఖమ్మం నూతన బస్టాండ్ నుంచి బయలు దేరుతుంది ఈనెల 30 నుంచి జ నవరి 31 వరకు ప్రత్యేక బస్ సర్వీసు ఉంటుందని తెలిపారు. ఖమ్మం డిపో నుంచి ప్రతి ఆదివారం ఉదయం ఆరు గంటలకు బస్సు బయలు దేరుతుందని తిరిగి మేదారం నుండి సాయంత్రం 5.30కు బయలు దేరుతుందని తెలిపారు. ఖమ్మం నుంచి మేడారంకు ఛార్జీ పెద్దలకు రూ. 230, పిల్లలకు రూ.120, ఇల్లందు నుంచి మేదారంకు పెద్దలకు రూ. 170, పిల్లలకు రూ.90 ఉంటుందని ఆర్ఎం తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎం కోరారు.

## జిల్లాలో ప్రత్యేక వైద్య శిబిరాలు

**ప్రజాపక్షం/భద్రాద్ర కొత్తగూడెం :** జిల్లాలో సికిల్ సెల్, తలసేమియా రోగుల కోసం ఈనెల 28,29 తేదీల్లో రెండు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. 28వ తేదిన దుమ్ముగూడెం మండలం నర్సాపురంలోని రైతు వేదిక వద్ద మ.12.30 గం. నుండి మ.2 గం. నుండి భద్రాచలం రైతువేదిక వద్ద, 29వ తేదిన ఉ.8 గం. నుండి అశ్వారాపుపేట మద్యాహ్నం 2 గం. నుండి సా.6 గం. వరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తారని చెప్పారు. హైదరాబాద్ నుండి ప్రత్యేక వైద్య నిపుణులు వస్తున్నారని,సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## సమాచార హక్కు చట్టంతో పారదర్శక పాలన

కమీషనర్ బోరెడ్డి అయోధ్యా రెడ్డి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సమాచార హక్కు చట్టంతో పారదర్శక పాలన సాధ్యమవుతుందని ఆ చట్టం కమీషనర్ బోరెడ్డి అయోధ్యా రెడ్డి అన్నారు.భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాళ్ శ్రేష్ట. అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు పాల్గొన్నారు. అందిన దరఖాస్తులకు సరైన సమయంలో సమాచారం అందించాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు, పౌర సమాచార అధికారులు, సహాయ పౌర సమాచార అధికారులు పాల్గొన్నారు.

# క్రీడ

## భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మకు రికార్డు ధర

### లారాకు 1.10 కోట్లు..



మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ మెగా వేలం ఆసక్తిక రంగా సాగింది. ఇటీవలే వరల్డ్ కప్‌లో అదరగొట్టిన దీప్తి శర్మ రూ.3.20 కోట్లు పలికింది. మ్యాచ్ విన్నర్ అయిన దీప్తిని ఆర్‌టిఎం ద్వారా యుపి వారియర్స్ సొంతం చేసుకుంది. ప్రపంచకప్‌లో రెండు శతకాలతో రెచ్చిపోయిన లారా వొల్వార్డ్త్ ను రూ.1.20 కోట్లు ఢిల్లీ క్యాపిటల్స్ పట్టేసింది. అయితే.. ఆస్ట్రేలియా కెప్టెన్ అలీసా హీలీకి మాత్రం వేలంలో చుక్కెదురైంది. ఇప్పటివరకూ వేలంలో ఏ ఫ్రాంచైజీ ఎవరిని కొనుగోలు చేసిందో చూద్దాం. డబ్ల్యూపిఎల్ నాలుగో సీజన్ వేలంలో స్టార్ ఆటగాళ్లపై కాసుల వర్షం కురుస్తోంది. గురువారం మధ్యాహ్నం 3:00 గంటల తర్వాత ఢిల్లీలో మెగా వేలం మొదలైంది. ఆక్షనీర్ మల్లికా సాగర్ నిర్వహిస్తున్న ఈ వేలంలో న్యూజిలాండ్ కెప్టెన్ సోఫీ డెవినె రూ.2 కోట్లు పలికింది. ఆల్‌రౌండర్ అయిన డెవినె కోసం ఢిల్లీ, గుజరాత్ జెయింట్స్ పోటీపడ్డాయి. చివరకు గుజరాత్ భారీ ధరతో కివీస్ స్టార్‌ను కొన్నది. అనంతరం.. యుపి వారియర్స్ ఫ్రాంచైజీ ఆర్‌టిఎం ద్వారా దీప్తి శర్మను రూ.3.20కోట్లకు దక్కించుకుంది. ప్రపంచకప్‌లో రెండు శతకాలతో మెరిసిన దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వొల్వార్త్ కూడా కోటి కొల్లగొట్టింది. టాపార్డర్ బ్యాటర్ అయిన లారాను ఢిల్లీ క్యాపిటల్స్ రూ.1.10 కోట్లకు హస్తగతం చేసుకుంది. మెగా వేలంలో భారత పేసర్ రేణుకా సింగ్ రూ.60 లక్షలకు గుజరాత్ జెయింట్స్ గూటికి చేరింది. సెమీఫైనల్లో టీమిండియాపై సెంచరీ బాదిన ఆస్ట్రేలియా అమ్మాయి ఫొబె లిచ్‌ఫీల్ రూ.1.20 కోట్లు పలికింది. అయితే.. అలీసా హీలీ, తంజిమ్ బ్రిట్స్ వంటి స్టార్ ప్లేయర్లను ఎవరూ కొనేందుకు ఆసక్తి చూపించలేదు. గత సీజన్‌లో ఢిల్లీని నడిపించిన మేగ్ లానింగ్‌ను రూ.1.9కోట్లకు యూపీ వారియర్స్ సొంతం చేసుకుంది. ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ సోఫీ ఎకిల్‌స్టోన్‌ను రూ.80 లక్షలకు యుపి తీసుకుంది. న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ అమేలియా కేర్‌ను ముంబై ఇండియన్స్ రూ.3కోట్లకు తీసుకుంది.

## జనవరి 9 నుంచి మహిళల ప్రీమియర్ లీగ్



మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్‌కు ముహూర్తం ఖరారైంది. మెగా వేలం రోజునే టోర్నీ ఆరంభ తేదీని బిసిసిఐ వెల్లడించింది. ఊహించినట్టుగానే జనవరిలోనే నాలుగో సీజన్ ప్రారంభం కానుంది. అయితే.. ముందుగా వినిపించిన జనవరి 7న కాకుండా జనవరి 9 నుంచి సీజన్ మొదలవ్వనుందని డబ్ల్యూపిఎల్ చైర్మన్ జయేశ్ జార్జ్ పేర్కొన్నారు. పురుషుల టీ20 ప్రపంచ కప్ నేపథ్యంలో డబ్ల్యూపిఎల్ షెడ్యూల్‌ను ముందుకు జరిపిన విషయం తెలిసిందే. డబ్ల్యూపిఎల్ నాలుగో సీజన్ మ్యాచ్‌లకు ఈసారి రెండు వేదికలనే ఖరారు చేశారు. నవీ ముంబై , వడోదరలోనే అన్ని మ్యాచ్‌లు నిర్వహిస్తామని డబ్ల్యూపిఎల్ చైర్మన్ జయేశ్ జార్జ్ తెలిపారు. జనవరి 9న నవీ ముంబైలో టోర్నీ ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 5న వడోదరలో ఫైనల్ బిసిసిఐ తెలిపింది. త్వరలోనే పూర్తి షెడ్యూల్ విడుదల చేయనున్నారు. డబ్ల్యూపిఎల్ మూడో సీజన్ నాలుగు నగరాల్లో జరిగింది. ముంబై, బెంగళూరు, లక్నో, వడోదరలో మ్యాచ్‌లు నిర్వహించారు. అయితే.. కొన్ని కారణాల వల్ల ఈసారి రెండు నగరాలను మాత్రమే ఎంచుకున్నారు. ఇప్పటివరకూ జరిగిన మూడు సీజన్లలో ముంబై ఇండియన్స్ రెండు పర్యాయాలు, ఆర్సీబీడబ్ల్యూపిఎల్ ఒకసారి విజేతగా నిలిచాయి. దాంతో.. నాలుగో సీజన్‌లో ఛాంపియన్‌గా నిలిచేందుకు ఢిల్లీ సిద్ధమవుతుండగా.. తొలిసారి ట్రోఫీని ముద్దాడాలని యుపి వారియర్స్, గుజరాత్ జెయింట్స్ పట్టుదలతో ఉన్నాయి. నాలుగో ఎడిషన్ కోసం ఐదు ఫ్రాంచైజీలు అట్టిపెట్టుకున్న క్రికెటర్లు వీళ్లే..

**ముంబై ఇండియన్స్ :** నాట్ సీవర్ బ్రంట్ (రూ.3.5 కోట్లు), హర్మన్‌ప్రీత్ కౌర్ (రూ.2.5 కోట్లు), హేలీ మాథ్యూస్(రూ.1.7కోట్లు), అమన్‌జోత్ కౌర్(రూ.1.0కోట్లు), జి. కమలిని(రూ.50 లక్షలు).

**ఢిల్లీ క్యాపిటల్స్ :** జెమీమా రోడ్రిగ్స్,(రూ.2.2 కోట్లు) షఫాలీ వర్మ(రూ.2.2 కోట్లు), మరినే కాప్(రూ.2.2 కోట్లు), అనాబెల్ సథర్‌లాండ్‌రూ.2.2 కోట్లు), నిక్కీ ప్రసాద్ అన్‌క్యాప్డ్‌రూ.50 లక్షలు).

**యుపి వారియర్స్ :** శ్వేతా షెరావత్ (రూ.50 లక్షలు).

**ఆర్సీబీ :** స్మృతి మంధాన(రూ.3.5 కోట్లు), రీచా ఘోష్(రూ.2.75కోట్లు), ఎలీసా పెర్రీ(రూ.2 కోట్లు), శ్రేయాంక పాటిల్ (రూ.60లక్షలు)లను మాత్రమే రీటైన్ చేసుకుంది.

**గుజరాత్ జెయింట్స్ :** బేత్ మూనీ(రూ.3.5కోట్లు), అష్ గార్డ్‌నర్(రూ.2.5కోట్లు).

## కోటి కొల్లగొట్టిన తెలుగమ్మాయి

మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ మెగా వేలంలో ప్రతిభావంతులపై కోట్లు కుమ్మరిస్తున్నాయి ఫ్రాంచైజీలు. టీమిండియా విజయంలో కీలకపాత్ర పోషించిన స్పిన్నర్ శ్రీ చరణి కోటి కొల్లగొట్టింది. మ్యాచ్ విన్నర్ అయిన తెలుగమ్మాయిని రూ.1.30కోట్లకు ఢిల్లీ క్యాపిటల్స్ సొంతం చేసుకుంది. వన్డే ప్రపంచ కప్‌లో 14 వికెట్లతో రాణించిన శ్రీ చరణి కోసం ఫ్రాంచైజీలు పోటీపడ్డాయి. గత సీజన్‌లో రూ.55 లక్షలకే ఈ స్పిన్నర్‌ను తీసుకున్న ఢిల్లీ ఈసారి మెగా వేలంలో రూ.1.30 కోట్లు చెల్లించేందుకు సిద్ధమైంది. వరల్డ్ కప్‌లో భారత జట్టు విజయాల్లో కీలకమైన పేసర్ క్రాంతి గౌడ్ సైతం కోటిన్నర పలికింది. పవర్ ప్లేలో చెలరేగిపోయే ఈ స్పీడ్‌స్టర్‌ను యుపి వారియర్స్ ఆర్‌టిఎం ద్వారా రూ.50 లక్షలకు తీసుకుంది. నిరుడు ఢిల్లీకి ఆడిన రాధా యాదవ్‌ను ఈసారి మాజీ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు దక్కించుకుంది. వేలంలో ఈ ఆల్‌రౌండర్‌ను రూ.65 లక్షల కు సొంతం చేసుకుంది ఆర్సీబీ డబ్ల్యూపిఎల్ మూడో సీజన్లో ఆర్సీబీకి ఆడిన ఆశా శోభన వేలంలో భారీ ధర పలికింది. యుపి రూ.1.10కోట్లకు కొన్నది. ఇంగ్లాండ్ పేసర్ లారెన్ బెల్ కూడా వేలంలో కోటికి ముందర ఆగిపోయింది. లైన్ అండ్ లెంగ్త్‌తో బ్యాటర్లను ఇరుకున పెట్టే ఈ పేస్ గన్‌ను ఆర్సీబీ రూ.90 లక్షలకు దక్కించుకుంది.



# ఫోకస్




## ‘చీకటి’లో వెలుగు రేఖ లిహువా





ఎలాంటి శారీరక వైకల్యం లేకపోయినా, ఎంతో మంది జీవితాలను నిరాశగా, నిస్సత్తువతో వెళ్లదీస్తుంటారు. అతి కొద్దిమంది మాత్రమే వైకల్యాలను అధిగమించి, సమాజంపై తమదైన ముద్ర వేస్తారు. అత్యంత ప్రతికూల పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయకుండా, ఆశను, ధైర్యాన్ని, సేవాభావాన్ని వెలిగిస్తూ సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తారు. అలాంటి వారిలో చైనాలోని జెజియాంగ్ రాష్ట్రం, జియాసింగ్‌కు చెందిన జూ లిహువా ఒకరు. 1957లో జన్మించిన ఆమె, జీవితంలోని కీలక దశలో గ్రేడ్ 1 దృష్టి వైకల్యాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. కళ్లలో వెలుగు తగ్గినా, ఆమె హృదయంలోని వెలుగు మాత్రం మరింత ప్రకాశించింది. సాధారణంగా దృష్టి కోల్పోవడం అంటే జీవితమే చీకటిలో కలిసినట్లు అనిపిస్తుంది. కానీ, లిహువా దాన్ని శాపంగా కాక, సమాజానికి సేవ చేయాలనే సంకల్పంగా మార్చుకుంది. ఆమె స్వయంగా సంపూర్ణ దృష్టి లేకపోయినా, దృష్టివైకల్యంతో బాధపడుతున్న వేలాది మందికి వెలుగువంటి వ్యక్తిగా మారింది. ఇప్పుడు ఆమె జెజియాంగ్ అసోసియేషన్ ఆఫ్ ది బ్లైండ్ సంస్థ అధ్యక్షురాలు... జియాసింగ్ డిసేబుల్డ్ పీపుల్స్ ఫెడరేషన్ ప్రెసిడియం ఉపాధ్యక్షురాలు. చైనా ప్రభుత్వానికి సలహాలు, సూచనలు అందించే అత్యంత కీలకమైన ‘చైనీస్ పీపుల్స్ పొలిటికల్ కాన్‌స్టిట్యూటివ్ కాన్ఫరెన్స్’ (సిపిపిసిసి) జియాసింగ్ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు.. ’లిహువా మసాజ్ ఇనిస్టిట్యూట్’ స్థాపకురాలు. ఇన్ని పదవుల వెనుక ఆమె సేవాభావం, కష్టపడి పనిచేసే తత్వం, పనిపట్ల నిబద్ధత, ఇతరులకు మార్గదర్శకం చేయాలనే తపన ఉన్నాయి. అంగవైకల్యం ఉన్నప్పటికీ, తన జీవితాన్ని అర్థవంతంగా తీరిదిద్దుకున్న రోల్‌మోడల్‌గా లిహువా గౌరవ మర్యాదలు అందుకుంటున్నది. జెజియాంగ్ రాష్ట్రంలోని అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల్లో ఆమెకు స్థానం దక్కింది. లిహువా స్థాపించిన మసాజ్ ఇనిస్టిట్యూట్ అనేది కేవలం చికిత్సా కేంద్రం మాత్రమే కాదు.. దృష్టివైకల్యం ఉన్న వ్యక్తులకు ఉపాధి, నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం అందించే ఆశాకిరణం. ఆమె శిక్షణనిచ్చిన అనేక మంది ఈరోజు తమ జీవితం స్వతంత్రంగా నిర్మించుకుంటున్నారు. మనోధైర్యం ఉండాలేగానీ, జీవితంలో అడ్డంకులు ఎదుర్కోవడానికి, ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి వైకల్యాలు అడ్డుకావని ఆమె జీవితం పాఠాలు నేర్పుతుంది. చీకటిలో ఉన్నప్పుడు చాలామంది వెలుగును కోరుకుంటారు. కానీ కొందరు మాత్రం తామే వెలుగై ఇతరుల చీకట్లను తొలగిస్తారు. లిహువా అలాంటి అరుదైన వెలుగు. ఆమె జీవితం లక్షలాది మంది దివ్యాంకుల ధైర్యం.

## మలివయసు సమస్యలు..



మలివయసు వారిని ప్రతి నిత్యం ఇబ్బందికి గురిచేసే ముఖ్యమైన సమస్య మలబద్ధకం. తగినంత శారీరక శ్రమ లేకపోవటం, దానికి తోడు సరిగా నమల లేక పీచు పదార్థాలుకూరగాయల వంటివి బాగా తగ్గించి, నమలాల్సిన అవసరం అంతగా లేని తేలిగ్గా తినటానికి వీలైన శుద్ధి చేసిన (రిఫైన్డ్) పదార్థాలనే ఎక్కువగా తీసుకోవటం వల్ల ఈ సమస్య మరింతగా ముదురుతుంది. కాబట్టి దీనికి పరిష్కారమేమిటో మనకు తేలిగానే అర్థమవుతోంది. పీచు ఎక్కువగా ఉండే కూరగాయలు, పండ్లు, ముడి ధాన్యాల వంటివి ఎక్కువగా తినాలి. నీరు సమృద్ధిగా తాగాలి. పీచు లేని, బాగా శుద్ధి చేసిన పదార్థాలు తగ్గించాలి. ముఖ్యంగా ప్రతిరోజూ మలవిసర్జన జరిగితేనే హాయిగా ఉంటుందన్న భావన నుంచి బయటపడటం అవసరం. మలవిసర్జన రోజుకు మూడు సార్ల నుంచీ వారానికి మూడు సార్ల వరకూ... సహజమే. కాబట్టి ప్రతి రోజూ విసర్జన జరగాల్సిందేనన్న భావనతో ఆలోచనలన్నీ దానిచుట్టూనే తిప్పుకోవటం అనవసరం. మలబద్ధకం ఇబ్బంది పెడుతున్నప్పుడు వైద్యులను సంప్రదిస్తే ఆహారపరమైన మార్పులతో పాటు అవసరాన్ని బట్టి సబ్జాగింజల పొట్టు వంటి సహజమైన, నీటిలో కలుపుకొని తాగే పొడి వంటివాటినీ సిఫార్సు చేస్తారు, వీటితో తేలికగానే బయటపడొచ్చు. ఇక కారణాలు వేరైనా మలివయసులో స్త్రీపురుషులు ఇవరువురినీ కూడా మూత్రం ఆపుకోలేని సమస్య ఇబ్బంది పెట్టొచ్చు. 50 ఏళ్లు దాటిన స్త్రీలకు కటి కండరాలు బలహీనపడటం వల్ల మూత్రం లీకవటం, ఆపుకోలేకపోవటం, తరచూ వెళ్లాల్సి వస్తుండటం వంటి బాధలు చాలా ఇబ్బంది పెడతాయి. అలాగే పురుషుల్లో ఈ వయసుకు వచ్చేసరికి ప్రోస్టేటు గ్రంథి ఉబ్బటం వల్ల మూత్రం ఆపుకోలేకపోవటం, బొట్టు బొట్లుగా రావటం, ఎంత వెళ్లినా ఇంకా పూర్తి విసర్జనకాని భావన కలగటం వంటి లక్షణాలు వేధిస్తుంటాయి. వీరు ఒక్కసారి వైద్యులకు చూపించుకుని సమస్యేమిటన్నది కచ్చితంగా నిర్ధారణ చేయించుకోవటం ముఖ్యం. ఎందుకంటే ఈ వయసులో కొన్నిరకాల క్యాన్సర్లలో కూడా ఇలాంటి లక్షణాలే కనబడొచ్చు. కాబట్టి వీటిని నిర్లక్ష్యం చెయ్యరాదు. మూత్రం ఆపుకోలేని సమస్యకు ఇప్పుడు స్త్రీపురుషులకు ఇరువురికీ కూడా చాలా రకాల చికిత్సా మార్గాలు, పరిష్కారాలున్నాయి. కాబట్టి వీటి గురించి వైద్యులతో చర్చించటం ఉత్తమం.

ఈ మధ్యకాలంలో వయసుతో సంబంధం లేకుండా మధుమేహం, అధిక రక్తపోటు వంటి సమస్యలు పెరుగుతున్నాయి. మలివయసులో ఈ సమస్యలు అధికం. యుక్తవయసు నుంచీ ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించటం ద్వారా వీటిని సాధ్యమైనంత వరకూ దరిజేరకుండా చూసుకోవచ్చుగానీ అన్నిసార్లూ వీటిని పూర్తిగా తప్పించుకోలేకపోవచ్చు. వీటిని నిర్లక్ష్యం చేస్తే గుండెజబ్బులు, పక్షవాతం వంటి రకరకాల సమస్యలు వెంటాడతాయి. కాబట్టి తరచూ పరీక్షలు చేయించుకుంటూ, చికిత్స కొనసాగిస్తూ వీటిని కచ్చితంగా అదుపులో ఉంచుకోవాలి. అలాగే మలివయసులో ఎదురయ్యే మరో పెద్ద సమస్య క్యాన్సర్. స్త్రీలలో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు, పురుషుల్లో ప్రోస్టేటు గ్రంథి క్యాన్సర్ల వంటివి ఎక్కువ. వూపిరితిత్తులు, పెద్దపేగు క్యాన్సర్ల వంటివి ఇద్దరిలోనూ కనబడుతుంటాయి. కాబట్టి ఒంట్లో ఎక్కడైనా గడ్డలు రావటం, వీడకుండా దగ్గు వేధించటం, మలవిసర్జన అలవాట్లు మారిపోవటం, రక్తం కనబడటం, బరువు తగ్గిపోవటం, పుండ్లు మానకపోవటం వంటి లక్షణాలేవైనా కనబడితే వాటిని ఏమాత్రం నిర్లక్ష్యం చెయ్యకుండా వైద్యుల దృష్టికి తీసుకువెళ్లాలి.

### రక్తపోటు.. మధుమేహం సరేసరి


## సమస్యల పరిష్కారానికి పోరాడే వారిని ఆదరించండి

### సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌నర్సింహ్మా పిలుపు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** సమస్యల పరిష్కారానికి పోరాడే వారిని ప్రజలు ఆదరించాలని, జిల్లాలో జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఐ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా పిలుపునిచ్చారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 50 గ్రామపంచాయతీల్లో సిపిఐ అభ్యర్థులు సర్పంచులుగా కొన్నిచోట్ల వార్డు మెంబర్లుగా పోటీ చేస్తున్నారని తెలిపారు. సిపిఐ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా ప్రజలరు కోరారు. సమావేశంలో సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర ప్రచారజాతాకు నాయకత్వం వహించి జిల్లాకు విచ్చేసిన బాల్‌నర్సింహ్మాను సిపిఐ జిల్లాసమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించా రు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్.ఆనంద్‌జి, రాష్ట్ర సమితి సభ్యులు కేశవులుగౌడ్, జిల్లాకార్యవర్గ సభ్యులు ఈర్ల చంద్రమౌళి, ఆర్.ఇందిర, కొమ్ము భరత్, తుమ్మల శివుడు, ప్రేమ్‌కుమార్, కిరణ్‌కుమార్, గోపాల్, బండి లక్ష్మి పతి, సయ్యద్, ఖాజమైనోద్దిన్, కుతుబుద్దిన్, నరేష్, మధుగౌడ్ పాల్గొన్నారు.

## సిపిఐలో భారీ చేరికలు



**ప్రజాపక్షం/చింతకాని :** కమ్యునిస్టుల అవసరం నేటికాలంలో ప్రజలకు అవసరం ఉందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా చింతకాని బస్వాపురం గ్రామంలో పలు పార్టీల నుండి గురువారం జితేందర్‌రెడ్డి సమక్షంలో సిపిఐలో భారీగా చేరారు. జితేందర్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బస్వాపురంలో జరిగిన సభలో జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ సామాన్య ప్రజలందరూ కమ్యునిస్టుల పాలన కోసం ఎదురు చూస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో కమ్యునిస్టులదేపై చేయి అవుతుందన్నారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో బస్వాపురంలో సిపిఐ జెండా రెపరపలాడాలని ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు,పావులూరి మల్లిఖార్జునరావు, సిజిల్లా కౌన్సిల్ సభ్యులు రాసాల మోహనరావు మండల సహాయ కార్యదర్శి మార్గం శ్రీను, నాయకులు కన్నెబోయిన విజయమ్మ, బొడ్డు కొండలరావు, ఆవుల నర్సింహారావు, బద్దల సైదులు, శాఖ కార్యదర్శి బద్దల నర్సింహారావు, పుల్ల వెంకయ్య, కుక్కల సైదులు, దొంతగాని రాంబాబు, తిరుమలరావు, శ్రీకాంత్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధత గల కమ్యూనిస్టు పోటు ప్రసాద్

### వర్ధంతి సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/ఖమ్మం :** నిబద్ధత గల కమ్యూనిస్టు పోటు ప్రసాద్ అని, తుది శ్వాస వరకు పార్టీ విస్తరణకు, పేదల అభ్యున్నతికి కృషి చేశారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ఆయన నమ్మిన సిద్దాంతాన్ని ఆచరణలో చూపిన మహోన్నతుడు అన్నారు. సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి పోటు ప్రసాద్ ప్రథమ వర్ధంతి సభ గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఎస్‌కె జానిమియా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హేమంతరావు మాట్లాడుతూ సాయుధ పోరాట వారోత్స కుటుంబంలో జన్మించిన పోటు ప్రసాద్ తుదిశ్వాస వరకు అదే పంథాను కొనసాగించారన్నారు. విద్యార్థి దశలో విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం ముఖ్యంగా ఖమ్మంలో పిజి కళాశాల సాధన కోసం జరిగిన విద్యార్థి ఉద్యమంలో పోటు ప్రసాద్ క్రియాశీలక భూమిక పోషించారని ఆయన తెలిపారు. కార్మిక సంఘ నాయకుడిగా పని చేసిన పోటు ప్రసాద్ సంఘటిత, అసంఘటిత రంగాలలో బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించారన్నారు. కమ్యూనిస్టు పార్టీ శత వసంత సంబురాలు ఖమ్మంలో జరగబోతున్నాయని ఈ సమయంలో పోటు ప్రసాద్‌లేని లోటు అడుగడుగునా కనిపిస్తుందన్నారు. జాతీయ మహాసభలను ఖమ్మంలో నిర్వహించాలని తలపెట్టిన ఆలోచనపరుడు ప్రసాద్ అని ఆయన వర్ధంతి సందర్భంగా ప్రసాద్ ఆలోచనలను, ఆశయాల ను ప్రజల్లోకి తీసుకు పోవడమే మనం ఆయనకు ఇచ్చే సరైన నివాళి అన్నారు. అభ్యుదయవాదిగా, నికార్సయిన కమ్యూనిస్టుగా జీవించిన ప్రసాద్ కమ్యూనిస్టు ఉద్యమం ఉన్నంత కాలం చిరస్థాయిగా నిలిచి ఉంటారని హేమంతరావు తెలిపారు. అంతకు ముందు పోటు ప్రసాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్ధంతి సభలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, బిజి క్లెమెంట్, మహ్మద్ సలాం, పోటు ప్రసాద్ తనయుడు సాత్విక్, సతీమణి నిర్మల, సోదరి పోటు కళావతి తదితరులు పాల్గొన్నారు.

**40వ డివిజన్‌లో...** సిపిఐ నాయకుడు పోటు ప్రసాద్ ప్రథమ వర్ధంతి సభను 40వ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. డివిజన్ ఏర్పాటు చేసిన ప్రసాద్ స్మారక స్తూపం వద్ద పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బిజి క్లెమెంట్ అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ 40వ డివిజన్‌లో పార్టీ శాఖ ఏర్పాటుకు పోటు ప్రసాద్ విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, పోటు కళావతి, తోట రామాంజనేయులు, గాదె లక్ష్మి నారాయణ, పోటు పూర్ణ, వరదా నర్సింహారావు, పోటు నిర్మల తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరా నగర్ పైలాన్ వద్ద :** ఇందిరా నగర్ పైలాన్ వద్ద పోటు ప్రసాద్ ప్రథమ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పోటు ప్రసాద్ స్మారక స్తూపానికి సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, పోటు ప్రసాద్ తనయుడు సాత్విక్ పోటు ప్రసాద్ స్మారక స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నాయకులు ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, పోటు కళావతి, పోటు నిర్మల, తాటి వెంకటేశ్వరరావు, పగడాల మల్లేష్, ఏనుగు గాంధీ, వరదా నర్సింహారావు, బండారుపల్లి నవీన్, సత్యనారాయణరెడ్డి, వెంకన్న, నాగేశ్వరరావు, ఎఐవైఎఫ్, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, ఆముదాల వెంకన్న, జాకీర్, తాటి నిర్మల, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.





## ‘ఎస్‌టియు’ బలోపేతానికి కృషి

### ఎస్‌టియు రాష్ట్ర కార్యవర్గంలో చోటు దక్కిన నాయకులు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఎస్‌టియు రాష్ట్ర కార్యవర్గంలో హనుమకొండ జిల్లా నుంచి ముగ్గురికి చోటు లభించినట్లు సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామగోని రాంబాబు, వేమునూరి రాంబాబు తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నామాని సాంబయ్య, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా సూర రమేష్, రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ మెంబర్‌గా మాలోత్ గణపతి నియామకం అయ్యారని వారు తెలిపారు. నామాని సాంబయ్య పరకాల మండలంలో పిజి హెచ్ ఎంగా, సూర రమేష్ శాయంపేట మండలంలో స్కూల్ అసిస్టెంట్‌గా, మాలోత్ గణపతి సోమిడి ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర కార్యవర్గంలో చోటు దక్కిన సాంబయ్య, రమేష్, గణపతిలు మాట్లాడుతూ జిల్లాలో ఎస్‌టియు సంఘం బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.







## కార్మికుల శ్రమ దోచుకుంటున్న కాంట్రాక్టర్లు

### మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి సురేష్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికుల శ్రమను ఏజెన్సీ కాంట్రాక్టర్లు దోచుకుంటున్నారని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ ఆరోపించారు. వేతనాల పెంపు కోసం చేపట్టబోయే ఆందోళన డిమాండ్ నోటీసును మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రి అడ్మినిస్ట్రేట్ అధికారి డాక్టర్ ప్రేరణకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ కాల పరిమితి ముగిసిన పాత ఐహెచ్‌ఎఫ్‌ఎంఎస్ ఏజెన్సీ టెండర్లను రద్దు చేసి నూతన టెండర్లలో ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్‌వైజర్ కార్మికులకు కనీస వేతనం 26 వేలకు పెంచుతూ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 1 నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన బాట పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ దవాఖానలో శానిటరీ భద్రత రోగి సంరక్షణ కోసం ప్రభుత్వం మూడు సంవత్సరాలకోసారి ఏజెన్సీలోని ఎంపిక చేస్తారని, 2022 సంవత్సరంలో ప్రభుత్వం ఐహెచ్‌ఎఫ్‌ఎంఎస్ టెండర్ల ద్వారా ప్రస్తుత ఏజెన్సీలను నియమించారని వాటి మూడు సంవత్సరాల కాలపరిమితి దాటి ఆరు నెలలు గడుస్తున్నాదని అయినా ఇప్పటికీ కొత్త ఏజెన్సీల ఏర్పాటు ప్రక్రియని ప్రభుత్వం ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత టెండర్లలో కొన్ని తప్పిదాల కారణంగా ఏజెన్సీ కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా కార్మికుల శ్రమను దోచుకున్నారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచుతూ నూతన టెండర్ల నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీని కోసం డిసెంబర్ 1 నుంచి వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాల కొనసాగించి ఐదున చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్‌ఎంఒలు డాక్టర్ గణేష్, డా.శిరీష, డా.ఇషిన్ ముస్తాక్, ఆసుపత్రి బ్రాంచ్ యూనియన్, కార్మికులు రంగన్న, రామకృష్ణ, శ్రీను, అంజి, గంగాధర్, మల్లమ్మ, వరలక్ష్మి, జ్యోతి, నాగలక్ష్మి , సునిత, చంద్రకళ, లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## తాగునీటి సౌకర్యం కల్పించాలని వినతి



ప్రజాపక్షం/గోదావరిఖని : రామగుండం పట్టణంలోని హౌసింగ్‌బోర్డుకాలనీ ప్రజలకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ సూచన మేరకు రామగండం నగరపాలక ఇన్‌ఛార్జి కమిషనర్ జె.అరుణశ్రీకి వినతిపత్రం అందజేసినట్లు కాంగ్రెస్ నాయకులు రాజేష్, అహ్మద్‌లు తెలిపారు. ప్రధాన పైపులైన్ నుంచి ఇళ్ల వరకు వేసిన పైపు లైన్లకు కనెక్షన్ ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఈ మేరకు తాగునీటి సమస్య త్వరగా పరిష్కరిస్తామని ఇన్‌ఛార్జి కమిషనర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలు చేయాలి



ప్రజాపక్షం/మల్లాపూర్ : తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ రాజా గౌడ్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించి ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేయాలని ఏలాంటి సందేహాలు ఉన్న ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు, కాగా మండల వ్యాప్తంగా ఏడు క్లస్టర్లకు గాను ఐదు సర్పంచ్ 5 నామినేషన్లు వార్డు కు,1 నామినేషన్ రాగ స్వీకరించినట్లు ఎంపీడీవో అలువాల శ్రీకాంత్ తెలిపారు. ఏసీఎల్బీ వెంట, ఎమ్మార్వో రమేష్‌ఎంపీడీవో శ్రీకాంత్, ఎంపీ ఓ జగదీష్, రిటర్నింగ్ అధికారులు ఉన్నారు.

## జిల్లాకు చేరుకున్న సాధారణ, వ్యయ పరిశీలకులు




ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సాధారణ, వ్యయ పరిశీలకులు పీ రవి కుమార్, కే రాజ్ కుమార్ గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ను మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ అధికారులు జిల్లా కేంద్రంలోని పంచాయతీ రాజ్ అతిథి గృహంలో అందుబాటులో ఉంటారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఏమైనా ఫిర్యాదులు చేయాలనుకునే వారు వారిని సంప్రదించవచ్చు.

**కంట్రోల్ రూమ్ తనిఖీ చేసిన ఎన్నికల సాధారణ పరిశీలకులు**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్, హెల్ప్ లైన్, మీడియా సెంటర్ ను గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా జిల్లాకు కేటాయించిన సాధారణ పరిశీలకులు రవి కుమార్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కంట్రోల్ రూమ్, హెల్ప్ లైన్, మీడియా సెంటర్ ను పరిశీలించి, ఇప్పటి వరకు ఎన్ని ఫిర్యాదులు వచ్చాయో ఆరా తీశారు. అన్ని వివరాలు రికార్డులో రాయాలని, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు భారతి, ప్రకాష్, డీపీఆర్ఓ లక్ష్మణ్ కుమార్, కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్ సిబ్బంది ఉన్నారు.

## అక్రమ ఇసుక టిప్పర్లను పట్టివేత



ప్రజాపక్షం/ధర్మపురి : ఆరెపెల్లి గ్రామ గోదావరి నదీ తీరం నుండి భారీ మొత్తంలో అక్రమంగా ఇసుకను ఇతర పట్టణాలకు తరలిస్తున్నారనే సమాచారంతో బుధవారం అర్ధరాత్రి ధర్మపురి తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది మెరుపుదాడులు జరిపి ఆరు ఇసుక రవాణా టిప్పర్లను పట్టుకున్నారు.జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం ఆరెపెల్లి,మగ్గిడి గోదావరి నది నుండి పోలీసుల కళ్లుగప్పి రాత్రిపూట అక్రమంగా ఇసుక రవాణా అవుతున్నదనే పక్కా సమాచారంతో తహసీల్దార్ శ్రీనివాస్ నేతృత్వంలో 18మంది సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. ఆరెపెల్లి వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగానున్న 6 టిప్పర్లు పట్టుబడ్డాయి.పట్టుకున్న టిప్పర్లను రెవెన్యూ అధికారులు ధర్మపురి పోలీస్ స్టేషన్ కు తరలించారు.గురువారం ధర్మపురి ఆర్ ఐ ఫిర్యాదు మేరకు టిప్పర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై మహేష్ చెప్పారు.కాగా పట్టుకున్న ఇసుక విలువ బహిరంగ మార్కెట్లో రూ.10 లక్షల వరకు ఉంటుందని అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

## ఎన్నికల నియామాలని పాటించాలి: ఏసిపి



ప్రజాపక్షం/శంకరపట్నం: ప్రజలందరూ ఎన్నికల నియమాలని పాటిస్తూ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని హుజురాబాద్ ఏసిపి మధవి అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గురువారం హుజురాబాద్ ఏసిపి మధవి, రూరల్ సిఐ పి.వెంకట్, ఎస్ఐ శేఖర్ రెడ్డిలతో కలసి మండలంలోని తాడికల్, ఎరడపల్లి, అర్కండ్ల, మఖ్త, కేశవపట్నం, కరీంపేట, ఇప్పలపల్లి, అంబాలపూర్ గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు ప్రజలతో మాట్లాడి ఎన్నికల మోడల్ కోడ్‌ఆఫ్ కండక్ట్ ఎంసీసీ నిబంధలను విశదీకరించారని, రాజకీయ ప్రలోభాలు నగదు మద్యం వంటి వాటికి లోనవ్వకుండా ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అభ్యర్థులు ప్రచార వాహనాలకు అనుమతి తీసుకోవాలని నిర్దేశించిన సమయం వరకే ప్రచారం నిర్వహించుకోవాలని సూచించారు. శాంతియుతంగా, స్వచ్ఛంగా నిబంధనలు పాటిస్తూ ఎన్నికల్లో పాల్గోనాలని సూచించారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

# ఎన్నికల విధులు నిజాయితీగా నిర్వహించాలి

ఇన్‌చార్జి కలెక్టర్, ఎన్నికల అధికారి గరిమ అగర్వాల్





ప్రజాపక్షం రాజన్న సిరిసిల్ల : గ్రామ పంచాయతీ ఎన్నికలలో అధికారులు తమ ఎన్నికల విధులను నిజాయితీగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగర్వాల్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎఫ్ఎస్‌టీ, ఎస్ ఎస్ టీ, జోనల్ అధికారులకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో జిల్లా సాధారణ, వ్యయ పరిశీలకులు పీ రవి కుమార్, కే రాజ్ కుమార్‌తో కలిసి ఇంచార్జి కలెక్టర్ గురువారం ఎన్నికల వ్యయ వివరాల నమోదు, ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ ఎన్నికలు రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఒక్కరికి సమానమైన హక్కు కల్పిస్తూ పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ఎలాంటి రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొన కూడదని స్పష్టం చేశారు. పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటుచేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఎన్నికల సమయంలో జరుగుతున్న ఉల్లంఘనలను, నగదు, మద్యం పంపిణీని గుర్తించడం, రిపోర్ట్ చేయడం ఆధారాలు సేకరించడం, రికార్డు చేయడం చాలా కీలకమని, ఎన్నికల సమయంలో అక్రమ డబ్బు, నగదు సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విధుల్లో భాగంగా ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వలెన్స్ బృందాలు నగదు ,ఇతర ఆభరణాలు సీజ్ చేసినప్పుడు తప్పనిసరిగా వీడియో ఫుటేజ్ తీసుకోవాలని, ఏ మాత్రం నిర్లక్షం ప్రదర్శించ వద్దని సూచించారు.ఎన్నికలకు సంబంధించి అక్రమ నగదు, మద్యం పంపిణీ అరికట్టడమే మన లక్ష్యమని, సాధారణ ప్రజలకు అసౌకర్యం కలగకుండా వీలైనంత వరకు జాగ్రత్తలు వహించాలని అన్నారు.

నగదు సీజ్ చేసే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని, నగదు సీజ్ చేసే సమయంలో ఎక్కడ అప్పీల్ చేయాలనే అంశం స్పష్టంగా తెలియజేస్తూ రశీదు అందించాలని అన్నారు. ర్యాలీలను క్షుణ్ణంగా పరిశీలించాలని, వినియోగించిన వాహనాలు, భోజనాలు తదితర ప్రతి అంశాన్ని పరిశీలించి వివరాలు నమోదు, రికార్డ్ చేయాలని సూచించారు. అక్రమ నగదు, మద్యం పంపిణీ జరగకుండా జాగ్రత్తలు వహించాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై అప్రమత్తంగా ఉంటూ ఆధారాలు సేకరించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తరువాత రూ. 50 వేల కంటే ఎక్కువ డబ్బు తరలిస్తే పట్టుకొని, వీడియో తీసి పంచనామా చేయాలని, అనంతరం పట్టుకున్న డబ్బుకు సంబంధించి రసీదు అందజేయాలని సూచించారు. ఎన్నికల ప్రచారం, ర్యాలీలకు అనుమతి ఇవ్వడం, వాటిని పరిశీలించడం, ఖర్చుపై వివరించారు. ఈ సమావేశంలో నోడల్ అధికారులు శేషాద్రి, భారతి, జడ్పీ డిప్యూటీ సీఈఓ గీత, డీపీఓ షరీఫుద్దిన్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తొలివిడత నామినేషన్ ప్రక్రియలో పటిష్ట బందోబస్తు: సిపి



ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ జిల్లాలో మూడుదశల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడత ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల ప్రక్రియ ప్రక్రియ ప్రశాంతంగా నిష్పక్షపాతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కరీంనగర్ సిపి గౌష్ ఆలం తెలిపారు. మొదటి విడతలో చొప్పదండి, రామడుగు, గంగాధర, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాల్లో నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని పేర్కొన్నారు. దీనికోసం జిల్లా వ్యాప్తంగా 33 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటివద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తునట్లు సిపి పేర్కొన్నారు. పలు గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను స్థానిక పోలీసు అధికారులతో కలిసి గురువారం సందర్శించారు. ఎన్నికలు సజావుగా సాగేలా ఆయా కేంద్రాల వద్ద పోలింగ్ రోజు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల నియమావి అమల్లోకి వచ్చిందనందున శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపడుత్నునట్లు తెలిపారు. రూరల్ ఏసిపి విజయ్ కుమార్, చొప్పదండి సిఐ ప్రదీప్ కుమార్, ఎస్సైలు రామడుగు (రాజు), గంగాధర చొప్పదండి(నరేష్‌రెడ్డి))లు పాల్గొన్నారు.

## ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట భద్రత



ప్రజాపక్షం/ముత్తారం : గ్రామ పంచాయతీ ఎన్నికలు గోదావరి ఖని సబ్ డివిజన్ లో ప్రశాంతంగా జరిగేలా పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని ఏసీపీ మడత రమేష్ తెలిపారు.గురువారం ముత్తారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను ఏసీపీ తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ రికార్డ్స్ ను పరిశీలించి, కేడి, డీసి, సస్పెక్ట్ షీట్ లు పరిశీలించారు.వారి ప్రస్తుత చర్యల గురించి ఎస్సై రవికుమార్ ని అడిగి తెలుసుకున్నారు.స్టేషన్ వెర్టికల్స్, ఎఫ్ ఐఆర్ ఇండెక్స్ మొదలైన రికార్డ్స్ తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ విషయంలో మండలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై కి తెలిపారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూసుకోవాలని సూచించారు. నిరంతరం పోలీసులు పెట్రొలింగ్ నిర్వహించాలని పోలీస్ స్టేషన్ అధికారులకు సూచించారు.ఈ తనిఖీల్లో మంథని సీఐ రాజు గౌడ్, ముత్తారం ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్స్ తో పాటు సిబ్బంది ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు వేగవంతం

కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్: నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కమాన్ పూర్,రామగిరి మండలాల్లో విస్తృతంగా పర్యటించారు.కమాన్ పూర్ మండలం ఎంపిడిఓ కార్యాలయం, జడ్పిహెచ్ఎస్, ఐ.ఈ.ఆర్.సి సెంటర్ , గుండారం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం,రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం, పన్నూరు గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం, ఎం.పి.పి.ఎస్. పన్నూరు పాఠశాల ను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి అదే రోజు రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం నాణ్యతను రెగ్యులర్ గా చెక్ చేయాలని అన్నారు. కల్వచర్ల ఐకేపి ధాన్యం కొనుగోలు కేంద్రం పరిధిలో ధాన్యం కొనుగోలు10 రోజుల్లో పూర్తి చేయాలని అన్నారు. కమాన్ పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఐ.ఈ.ఆర్.సి సెంటర్ లో అవసరమైన ఫర్నిచర్ ప్రతిపాదన సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ సమయంలో ఏదైనా డాక్యుమెంట్ సబ్మిట్ చేయని పక్షంలో ఆ వివరాలతో కూడిన రసీదు అందించాలని , ఎప్పటి వరకు డాక్యుమెంట్ సబ్మిట్ చేయాలో గడువు రసీదు లో పొందుపర్చాలని కలెక్టర్ తెలిపారు.పన్నూరు గ్రామంలోని నామినేషన్ సెంటర్ పరిశీలించిన కలెక్టర్ ప్రతి నామినేషన్ టిపోల్ లో నమోదు చేయాలని అన్నారు. నామినేషన్ స్వీకరణ సమయంలో గ్రామం లోని ఓటర్ జాబితాలో పేరు ఉందో లేదో క్రాస్ చెక్ చేసుకోవాలని, అనంతరం ఎం.పి.పి.ఎస్ పన్నూరు స్కూల్ ను ఆకస్మికంగా పరిశీలించి విద్యార్థుల యొక్క హాజరు వివరాలు మరియు స్టాఫ్ వివరాలు తదితర విషయాలపై ఆరా తీశారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట రామగిరి ఎంపీడీవో శైలజ రాణి, తహసిల్దార్ సుమన్,కమాన్ పూర్ ఎంపిఓ సౌమ్య, ఏపిఎం పద్మ,సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## రామగుండం అభివృద్ధికి బిఆర్‌ఎస్ అడ్డు

మాజీ మంత్రి హరీష్‌రావు దిష్టిబొమ్మ దహనం



ప్రజాపక్షం/గోదావరిఖని : రామగుండం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరగకుండా బిఆర్ఎస్ నాయకులు అటంకాలు కల్పిస్తున్నారని, ప్రజలు ఎన్నికల్లో ఓడించి వారికి బుద్ధి చెప్పిన వారిలో మార్పు రావడంలేదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహంకాళి స్వామి, గట్ల రమేష్, బొంతల రాజేష్, దీటి బాలరాజ్‌లు అన్నారు. గురువారం గోదావరిఖని ప్రధాన చౌరస్తా వద్ద మాజీ మంత్రి హరీష్‌రావు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. రామగుండంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న నూతన పవర్ ప్రాజెక్టుల విషయంలో అవాస్తవ ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్న మాజీ మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ నిరసన తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో బిస్టేషన్ విద్యుత్తు ప్లాంటు విస్తరణ విషయంలో రామగుండం ప్రాంతం వివక్షకు గురైందని ఆవేదన వ్యక్తం చేసిన బిఆర్ఎస్ నేతలు ఈ ప్రాంతానికి ఎందుకు న్యాయం చేయలేకపోయారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక రెండుమార్లు ఎన్నికల సమయంలో బిస్టేషన్ విస్తరించి నూతన పవర్ ప్రాజెక్టులను నెలకొల్పుతామని ఇక్కడి ప్రజలకు ఇచ్చిన హామీలను ఎందుకు నిలబెట్టుకోలేదన్నారు. పిట్‌హెడ్ స్టేషన్‌లో తక్కువ వ్యయంతో రామగుండంలో విద్యుత్తు ఉత్పత్తి చేసే అవకాశమున్న, ఇక్కడ కాకుండా దూర ప్రాంతమైన యాదాద్రిలో ప్లాంట్లు నెలకొల్పి ఎక్కువ వ్యయంతో ఉత్పత్తి చేసేలా అప్పటి రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం మోపి, జెన్‌కోను వేల కోట్ల అప్పుల్లో మునిగేలా చేసింది బిఆర్ఎస్ నేతలు కాదా? అని వారు ప్రశ్నించారు. రామగుండం ప్రాంత ప్రజల కలలను ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ నేరవేరుస్తున్నారని అడ్డుకుంటే ప్రజలే బిఆర్‌ఎస్ పార్టీ నాయకులకు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాతపెల్లి ఎల్లయ్య, ఎండి.ముస్తాఫా, దొంత శ్రీను, కొమ్ము వేణు, బాలరాజ్‌కుమార్, దాతు శ్రీనివాస్, చెరుకు బుచ్చిరెడ్డి, బొమ్మక రాజేష్, తిప్పారపు శ్రీనివాస్, సింహాచలం, ధూళికట్ట సతీష్, కొప్పుల శంకర్, సన్నీభాయ్, గడ్డం శ్రీనివాస్, నజీమోద్దీన్, కౌటం సతీష్, నజీమ్, కుడిదెలపాల్గొన్నారు.

## జిపి రిజర్వేషన్లలో బిసిలకు మొండి చెయ్యి!



ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: గత కొంత కాలంగా ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలు రానే వచ్చాయి, కాగా ప్రభుత్వం ప్రకటించిన పాత రిజర్వేషన్ ప్రక్రియలో ఎల్లారెడ్డిపేట మండల గ్రామ పంచాయితీలలో బీసీలు తమకు అనుకూలించిన విధంగా లేవని ఎక్కువ శాతం నేతల నుండి తీవ్ర అసహనం వ్యక్తం అవుతుంది. అనుకున్నది ఒకటి అయినది ఒకటి అన్న చందంగా రిజర్వేషన్ల తీరు మారిందని దీంతో బీసీ వర్గాల ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించిందని చెప్పకతప్పదు. మండలంలో 26 సర్పంచ్ స్థానాలు, 226 వార్డులు ఉండగా ఎన్నికల బరిలో పోటీలో దిగేందుకు సర్వం సిద్ధం చేసుకున్న తమకు ఈ రిజర్వేషన్లు భంగపాటు కలుగజేసిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని వర్గాలలో ప్రకంపనలు సృష్టించే విధంగా ఉందంటున్నారు. బీసీల సంఖ్య అధికంగా వున్న కొన్ని స్థానలలో ప్రభుత్వం సంఖ్య పరంగా సీట్లు కేటాయించలేదని, ప్రభుత్వం పునఃపరిశీలన చేయవలసిన అవసరం ఉందని కొందరు నాయకులు, ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఎదిఏమైన ఈ రిజర్వేషన్లతో మండంలోని బిసి అభ్యర్థులకు ప్రభుత్వం మొండి చెయ్యి చూపించిందనేది వాస్తవం అని అంటున్నారు.

## 6.34 కోట్లతో నర్సాపూర్, ఎర్ర చెరువుల సుందరీకరణ

మాజీ మంత్రి హరీష్‌రావు



ప్రజాపక్షం/సిద్దిపేట: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎర్రచెరువు, నర్సాపూర్ చెరువు సుందరీకరణ, అభివృద్ధికి 6.34 నిధులు మంజూరైనట్లు మాజీ మంత్రి హరీష్‌రావు వెల్లడించారు. గురువారం సాయంత్రం ఎర్రచెరువు, నర్సాపూర్ చెరువును మున్సిపల్ కమిషనర్ అశ్రీత్ కుమార్ సంబధిత అధికారులతో కలసి పరిశీలించారు. నర్సాపూర్ చెరువు అభివృద్ధికి 3.20 కోట్లు, ఎర్రచెరువుకు 3.14 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. చెరువులోని మురికినీరు చేరకుండ చెరువు ప్రక్క నుండి తూములోకి మురికినీరు వెళ్లే విధంగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. మురికి నీరు చేరి గుర్రపు డెక్కలు మొలవటం కారణంగా దోమలు రావటం, మహిళలు బతుకమ్మ పండగకు వెళ్లినప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా నర్సాపూర్ చెరువులో పూర్తిగా మురికినీరు వుండటం వల్ల ఆ ప్రాంత వాసులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. అందుకుగాను ఎస్‌టిపి ప్రాంతం నుండి చెరువు కిందకు మురికి నీటి డ్రైనేజీ నిర్మించాలన్నారు. అదేవిధంగా తీవ్ర వర్షాలతో వరద ప్రాంతాల నుండి వరద నీటి చెరువులో చేరి కలుషితంగా మారుతుందన్నారు. ఆవరద నీరు కూడ డ్రైనేజీ ద్వారా వెల్లేవిధంగా చూడాలన్నారు. వచ్చే కొద్ది రోజుల్లోనే ఎర్రచెరువు, నర్సాపూర్ చెరువుల్లో మురికి నీటికి స్వస్తి పలికి స్వచ్ఛమైన నీరు ఉండేవిధంగా పరిసరాలు మరింత శుభ్రంగా, ఆరోగ్యవంతంగా మారేందుకు అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు.

**సిద్దిపేట డిగ్రీ పద తరగతి గదుల నిర్మాణం వేగవంతం పూర్తి చేయాలి**

సిద్దిపేట డిగ్రీ కళాశాల మూడు సార్లు ఎప్లస్, న్యాక్ గ్రేడింగ్ సాధించిన కళాశాల కాబట్టి ఈ కళాశాల యొక్క చారిత్రాక గుర్తింపుకు కాపాడాలని డిగ్రీ కళాశాల అధ్యాపకులకు మాజీ మంత్రి హరీష్‌రావు సూచించారు. డిగ్రీ కళాశాల ప్రవేశల సంఖ్య, లెక్చరర్ల సమస్యల గురించి ఆరాతీశారు. అలాగే కాంట్రాక్టు లెక్చరర్ల. అతిథి లెక్చరర్ల జీతాలు వస్తున్నాయా అని ఆరా తీశారు. అలాదే పది అదనపు గదుల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, సంబధిత ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

## శిశు మరణాలను తగ్గించాలి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ వాణిశ్రీ



ప్రజాపక్షం/పెద్దపల్లి : జిల్లా కేంద్రంలోని మాతా శిశు కేంద్రంలో శిశు మరణాలను తగ్గించడానికి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వాణిశ్రీ అన్నారు. గురువారం రోజున జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. వాణిశ్రీ , జిల్లా హాస్పిటల్ సర్వీసెస్ సమన్వయ అధికారి డా. శ్రీధర్ తో కలిసి మాతా–శిశు కేంద్రంలోని పీడియాట్రిక్ వైద్యులతో "సంకల్ప్" కార్యక్రమం నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పిల్లల వార్డులోని ఇంక్యుబేటర్లు, ఫోటోథెరపీ యూనిట్లు పరిశీలించి, శిశు మరణాలను తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.తదనంతరం, బంధం పల్లి మరియు రంగంపల్లి బస్తీ దవాఖానలను సందర్శించారు. దవాఖానలలోని ఓపి రిజిస్ట్రర్లు, అటెండెన్స్ రిజిస్ట్రర్లు తనిఖీ చేసి ఓపి సంఖ్యను పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోగులకు అవసరమైన మందులు పూర్తి కాలపు డోసులతో అందించాలని, సిబ్బంది సమయపాలన కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పీడియాట్రిషన్లతో పాటు ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి శ్రీరాములు, వైద్యాధికారి లక్ష్మి భవాని, క్వాలిటీ మేనేజర్ అనీల్ మరియు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## భీమేశ్వర స్వామి ఆలయంలో అదనపు ఎస్‌పిఎఫ్ సిబ్బంది నియామకం

ప్రజాపక్షం/వేములవాడ: వేములవాడ శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి భద్రతా పరంగా ఎస్పీఎఫ్ సిబ్బందిని అదనంగా నియమించారు. ఇందులో ఇద్దరు హెడ్ కానిస్టేబుల్, పది మంది కానిస్టేబుల్ విదులోకి చేరారు. కొత్తగా నియమితులైన ఎస్పీఎఫ్ సిబ్బంది ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, ఆయుధ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సన్నిధిలో విధులు శ్రద్ధగా, క్రమశిక్షణగా నిర్వహించాలని భద్రత పటిష్టత ఉండాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎఫ్ కమాండెంట్ సి. జంగయ్య, ఎస్సైలు డి. తిరుపతిరెడ్డి, సిహెచ్. మహేందర్, అలాగే ఆలయ పర్యవేక్షకులు రాజేందర్, గొట్టం గిరి పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## నామినేషన్ కేంద్ర పరిశీలన



ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ :స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఖానాపూర్ మండలంలో,గ్రామాలను క్లస్టర్‌ల వారీగా విభజించి ఒకే కేంద్రంలో సుమారు 4 గ్రామ పంచాయతీలకు చెందిన సర్పంచ్,వార్డు సభ్యుల అభ్యర్థుల నుంచి ఎన్నికల అధికారులు నామినేషన్లను స్వీకరిస్తున్నారు.ఈ మేరకు మండలంలోని మస్కాపూర్ క్లస్టర్ నామినేషన్ కేంద్రాన్ని నిర్మల్ జిల్లా అబ్జర్వర్ అయేషా మస్రత్ ఖానాం పరిశీలించారు.ఆమె మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని అధికారులకు సూచించారు. రోజువారీ నామినేషన్ దాఖలాల వివరాలను అందించాలని అన్నారు.నామినేషన్ రికార్డులను భద్రపరచాలని,నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులకు హె ల్ప్ డెస్క్ సిబ్బంది సహకరించాలని సూచించారు. ఎంపిడిఒ రమాకాంత్,ఎంపిఒచిక్యాల రత్నాకర్ రావు,ఎన్నికల అధికారులు,పంచాయతీ కా ర్యదర్శులు,పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

## రైల్వే పోలీసుల సమక్షంలోనే రేషన్ బియ్యం అక్రమ రవాణా

ప్రజాపక్షం/సిర్పూర్(టి) :సిర్పూర్(టి) రైల్వే స్టేషన్ నుంచి బాలార్షా వైపు వెళ్లే ప్యాసింజర్ రైళ్లలో రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో రహదారులపై పోలీసులు ముమ్మర తనిఖీలు చేపడుతుండటంతో అక్రమ వ్యాపారులు రైలు మార్గాన్ని ఎంచుకున్నట్లు సమాచారం. రైళ్లలో రైల్వే పోలీసులు ఉన్నప్పటికీ బియ్యం సంచుల తరలింపును అడ్డుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. నిఘా ఉండాల్సిన సమయంలో అధికారుల నిర్లక్ష్యంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పులి దాడిలో ఆవు మృతి



ప్రజాపక్షం/జన్నారం :జన్నారం మండలం ఇందన్పల్లి అటవీ ప్రాంతంలో పెద్దపులి దాడి చేసి ఆవును చంపేసింది. ఇందన్పల్లి రేంజ్ పరిధిలోని ఇందన్పల్లి బీట్లో రెండు రోజుల క్రితం ఆవుపై దాడి చేసిన పులి, గురువారం మళ్లీ వచ్చి కళేబరాన్ని తిన్నట్లు ఎఫ్ఆర్ఒ లక్ష్మీ నారాయణ తెలిపారు. ఘటనా స్థలాన్ని జన్నారం ఎఫ్‌డిఒ రామ్మోహన్ సందర్శించి పులి కాలి అడుగులను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సమీప ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా అడవిలోకి వెళ్లవద్దని సూచించారు. పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలని, ప్రజలు భయభ్రాంతులకు గురికావద్దని కోరారు. వేట కోసం విద్యుత్ తీగలు, ఉచ్చులు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆవు యజమానికి నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. పులి సంచారం గురించి సమాచారం ఉంటే అటవీ శాఖకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఒలు రవి, హన్మంతరావు, ఎఫ్‌బిఒలు , బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

## అందుబాటులో యాసంగికి సరిపడ యూరియా



ప్రజాపక్షం/కౌడిపల్లి:మండల కేంద్రమైన కౌడిపల్లి రైతు వేదికలో గురువారం నర్సాపూర్, కౌడిపల్లి డివిజన్‌లో విత్తన, ఎరువులు పురుగుమందుల డీలర్లుకు సమావేశం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. యాసంగిని సీజన్ ప్రారంభం అయింది కాబట్టి అందరు స్టాక్ బోర్డులు, లైసెన్స్ డిస్‌ప్లే చెయ్యాలి. రిజిస్టర్, బిల్ బుక్స్ కరెక్ట్ గా మెయింటెయిన్ చెయ్యాలి. ప్రిన్సిపల్ సర్టిఫికేట్ 0 ఫారమ్‌లలో చేసుకోవాలి. యాసంగికి సరిపడ యూరియా అందుబాట్లో ఉంచాలని, యూరియా కిబదులుగా నానో యూరియా వాడకం కూడా రైతులు పెంచాలి అన్నారు. ఎరువులు ఆదిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాము అన్నారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల భూమికి నష్టం జరుగుతుందని సూచించారి. కాల్చడం బదులుగా నీటిని పెట్టి 150కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎకరం పొలంకి 15 రోజులు తరవాత దున్నడం వల్ల సేంద్రీయం కార్బన్ పెరుగుతుంది.ఎంతేకాకుండా 5 శాతం దిగుబడి పెరుగుతందనితెలిపారు. ఈ కార్యక్రమలో ఎడిఏ టెక్నికల్ వినయ్, ఎడిఏ నర్సాపూర్ సంధ్యారాణి, ఎడిఏకౌడిపల్లి పుణ్యవతి, ఏవో టెక్నికల్‌సిబ్బంది, నర్సాపూర్, కౌడిపల్లి డివిజన్ మండల వ్యవసాయ అధికారులు, ఏఈఓ లు రైతులు ఉన్నారు.

## ఎసిబికి చిక్కిన మున్సిపల్ కమిషనర్



ప్రజాపక్షం/ఆర్మూర్:మున్సిపల్ కమిషనర్ రాజు లంచం తీసుకుంటూ ఉండగా యోగేశ్వర్ కాలనీలోని అతని అద్దె ఇంటిలో గురువారం పక్కా సమాచారం మేరకు రైడ్ చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఎసిబిఅధికారులు పూర్తి వివరాలు తెలువాల్సి ఉంది.

## ఎన్నికల సమాచారం కోసం టి-పోల్ మొబైల్ యాప్

ప్రజాపక్షం/మెదక్ :గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లకు సౌకర్యవంతంగా ఎన్నికల సమాచారాన్ని అందించేందుకు రూపొందించిన టిపోల్ మొబైల్ యాప్ గూగుల్ ప్లే స్టోర్ లో అందుబాటులో ఉందని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. ప్రతి ఓటరు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలో ఓటరు అవగాహన మరియు ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలలో తమ ఓటు హక్కు వినియాగించుకోవాలని అన్నారు. ఈ యాప్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు.గూగుల్ ప్లే స్టోర్ లింక్: https://play.google .com/store /a pps/ details?id=com.cgg.gov.in.te poll telugu ప్రతి ఒక్కరూ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఉపయోగించుకుని ఓటింగ్‌లో ప్రక్రియలో పాల్గొనాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

ప్రజాపక్షం/అల్లాదుర్గం:స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా ఎవరైనా రోడ్ షోలు ర్యాలీసు మీటింగ్స్ లౌడ్ స్పీకర్ ఎలక్షన్ ప్రచారం సంబంధించి పర్మిషన్ కొరకు తహసీల్దార్ పర్మిషన్ తప్పకుండా తీసుకోవాలి. ఒకవేళ ఎలాంటి పర్మిషన్ లేకుండా ర్యాలీలు, రోడ్ షోలు లౌడ్ స్పీకర్ పెట్టినచో ఎలక్షన్ కోడ్ ప్రకారం చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శంకర్ తెలిపారు.

## నామినేషన్ ప్రక్రియను సమీక్షించిన సబ్ కలెక్టర్

ప్రజాపక్షం/బోధన్:రానున్న జీపీ ఎన్నికలకు సంబంధించిన బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో బోధన్ మండలంలోని పెంటాకుర్దు క్యాంపు, సాలంపాడ్ క్లస్టర్‌లను సందర్శించారు. ఈ గ్రామాల్లో సబ్ కలెక్టర్ కొనసాగుతున్న నామినేషన్ పక్రియను సమీక్షించారు. నామినేషన్ ఫారమ్‌లను స్వీకరించేటప్పుడు ఎన్నికల మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, నిబంధనల ప్రకారం అవసరమైన అన్ని విధానాల గురించి అభ్యర్థులకు స్పష్టంగా తెలియచేయాలని, ఆయన ఆర్ఓ1, ఆర్ఓ2 లను ఆదేశించారు.

# పకడ్బందీగా నామినేషన్ల ప్రక్రియ



అధికారులకు జిల్లా ఎన్నికల పరిశీలకురాలు ఆయేషా మస్రత్ ఖానం, కలెక్టర్ ఆదేశం

ప్రజాపక్షం/నిర్మల్/లక్ష్మణచందా/ఖానాపూర్:జిల్లా జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను అత్యంత పకడ్బందీగ,పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం,జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.గురువారం వారు లక్ష్మణచందా మండలంలోని వడ్యాల్,ఖానాపూర్ మండలంలోని సత్తనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.కేంద్రాల్లో అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన వసతులు,హెల్ప్ డెస్క్ పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

**అభ్యర్థులకు అవగాహన కల్పిస్తూ..నిబంధనలు పాటించాలి..**

నామినేషన్ల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ల వద్ద సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ,నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థులకు తగిన సమాచారం అందించి సహకరించాలని పరిశీలకులు,కలెక్టర్ సూచించారు.అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేయాలని,నామినేషన్ దాఖలుకు అవసరమయ్యే పత్రాలు,ఇతర వివరాలను వారికి స్పష్టంగా వివరించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి అన్ని రకాల ఫారాలను తగినన్ని అందుబాటులో ఉంచుకోవాలని,ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**సమయపాలన,భద్రత ముఖ్యం..**

అధికారులు కచ్చితంగా సమయపాలన పాటిస్తూ విధులను నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.మొదటి విడత నామినేషన్ల స్వీకరణ ఈ నెల 29వ తేదీ వరకు కొనసాగుతుందని,ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకుఅభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించాలని తెలిపారు.స్వీకరించిన నామినేషన్లకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు నిర్దేశిత రిజిస్టర్లలో పకడ్బందీగా నమోదు చేయడంతో పాటు,ఆ పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు.రోజువారీ వివరాలను జిల్లా కేంద్రానికి నివేదించాలన్నారు.నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

**ఫిర్యాదులకు అందుబాటులో పరిశీలకులు..**

జిల్లాలో మూడు దశల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ప్రజలకు ఏవైనా ఫిర్యాదులు ఉంటే నేరుగా తమను సంప్రదించవచ్చని జిల్లా ఎన్నికల పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం ఒక ప్రకటనలో తెలిపారు.నిర్మల్ పట్టణంలోని అటవీశాఖ వసతి గృహంలో తాము అందుబాటులో ఉంటామని,ఫిర్యాదుదారులు నేరుగా వచ్చి కలవచ్చని పేర్కొన్నారు.ప్రత్యక్షంగా రాలేని వారు 9959284786 ఫోన్ నెంబర్ ద్వారా లేదా() మెయిల్ ఐడి ద్వారా తమ ఫిర్యాదులను పంపవచ్చని వివరించారు.ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని,ప్రజలు నిర్భయంగా ఫిర్యాదులు చేయవచ్చని ఆమె స్పష్టం చేశారు.ఈ తనిఖీ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్,డిపిఓ శ్రీనివాస్,ఆయా మండలాల తహసిల్దార్లు సరిత,సుజాత,ఎంపీడీవోలు రాధా రాథోడ్,రమాకాంత్,ఎంపిఓ రత్నాకర్,ఇతర ఎన్నికల అధికారులు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నామినేషన్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

జిల్లా ఎన్నికల అధికారి, మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



ప్రజాపక్షం/మెదక్ :గ్రామ పంచాయతి ఎన్నికలలో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ ను అనుసరిస్తూ మెదక్ జిల్లాలో తొలి విడత సర్పంచ్,వార్డు స్థానాలకు రిటర్నింగ్ అధికారులు గురువారం నోటిఫికేషన్‌లు జారీ చేసిన నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. మెదక్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని 06 మండలాలైన, అల్లాదుర్గ్, రేగోడ్, టేగోడు హవేలీ ఘన్‌పూర్, పాపన్నపేట, శంకరంపేట ఆర్, 160 సర్పంచ్, 1402వార్డు స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో రేగోడు, శంకరంపేటఆర్, అల్లాదుర్గ్ మండల కేంద్రం లోని ఎంపిడిఒ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రాహుల్ రాజ్,ఆర్‌డిఒరమాదేవి గురువారం ఆకస్మికంగా సందర్శించి, అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించారు. నామపత్రాల స్వీకరణకు చేసిన ఏర్పాట్లు గమనించి పలు సూచనలు చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించిన అఫిడవిట్ లను ఏ రోజుకు ఆ రోజు నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తూ, జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, పై అధికారులను సంప్రదించాలని సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## 'దీక్షా దివస్' వాల్ పోస్టర్ ఆవిష్కరణ

సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రభాకర్



ప్రజాపక్షం/సంగారెడ్డి:తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రతిభింబించేలా ఈనెల 29న దీక్షా దివస్ ఘనంగా నిర్వహించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే ,బిఆర్ఎస్ పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ పార్టీ కార్యకర్తల కు పిలుపు నిచ్చారు. బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జిల్లాలోని ముఖ్య నేతలతో కలిసి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన దీక్షా దివస్ సందర్భంగా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సన్నాహక సమావేశంలో జహిరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు , మాజీ ఎమ్మెల్యేలు ,డిసిఎంఎస్ చైర్మన్ శివ కుమార్ ,శ్రీకాంత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు. దీక్ష దివస్ సందర్భంగా కార్యక్రమాల గురించి సమగ్ర ప్రణాళిక రూపొందిస్తూ, అందుకు తగినట్లు ఏర్పాట్లు చేయాలని చర్చించారు. బిఆర్ఎస్ నాయకుడు అఖిల్ ఆధ్వర్యంలో రూపొందించిన దీక్ష దివస్ వాల్ పోస్టర్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. దీక్షా దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో డిసిసిబి వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం ,బాల్‌రాజ్, మెట్టు కుమార్ సిడిసి మాజీ చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, డా. శ్రీహరి పట్టణ కార్యదర్శి పెరుమాళ్ల నర్సింలు వివిధ నియోజకవర్గాల ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

## నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్



ప్రజాపక్షం/నిజామాబాద్ :గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమీషన్ విడుదల చేసిన షెడ్యూల్‌ను అనుసరిస్తూ జిల్లాలో తొలి విడత సర్పంచ్, వార్డుస్థానాలకు రిటర్నింగ్ అధికారులు గురువారం నోటిఫికేషన్లు జారీ చేసి, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. బోధన్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని 10 మండలలైన బోధన్, చందూర్, కోటగిరి, మోస్రా, పోతంగల్, రెంజల్, రుద్రూర్, సాలూరా, వర్ని, ఎడపల్లితో పాటు నిజామాబాద్ రెవెన్యూ డివిజన్‌లోని నవీపేట్ మండల పరిధిలోని 184 సర్పంచ్, 1642 వార్డు స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నేపథ్యంలోనవీపేట్ మండలం అభంగపట్నం, రెంజల్ మండలం వీరన్నగుట్ట, ఎడపల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి గురువారం ఆకస్మికంగా సందర్శించి అందుబాటులోని సదుపాయాలు పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్‌లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించిన అఫిడవిట్లను ఏ రోజు ఆ రోజు నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తూ జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలనుతు.చ తప్పకుండా పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా పై అధికారులను సంప్రదించాలని సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులున్నారు.

## స్థానిక ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు



ప్రజాపక్షం/సంగారెడ్డి :స్థానిక ఎన్నికలకు నగారా మోగినవేళా జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయబడినట్లు జిల్లా ఎస్పి పరితోష్ ఫంకజ్ తెలిపారు. మొదటి దశ స్థానిక ఎన్నికలకు నామినేసన్స్ ప్రారంభమైన వేళ జిల్లాలోని వివిధ మండల కేంద్రాలలో ఏర్పాటు చేసిన నామినేషన్‌కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పి సందర్శించి అక్కడి బందోబస్తు ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియ శాంతియుగంగా జరిగేలా చూడాలని ఏ లాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నామినేషన్స్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో మార్క్ చేసి ఎవ్వరిని లోపలికి అనుమతించకూడదని ,నామినేషన్స్ సమర్పించే అభ్యర్థులను ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే అనుమతించాలని అన్నారు. అభ్యర్థి వెంబడి ముగ్గురు వ్యక్తులను మాత్రమే అనుమతించాలని అధికారులకు సూచించారు. జిల్లా ప్రజలను ఎస్పిమాట్లాడుతూ ఎన్నికలను ప్రభావితం చేసే డబ్బు , మద్యం, క్రికెట్ కిట్స్, వంటివి పంపిణీచేసేఓటర్లను మభ్యపెట్టిన ,ప్రలోభాలకు గురిచేసినట్లు గమనించిన వెంటనే లోకల్ పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసారు. సామాజిక మాద్యమాలలో అనుచిత వ్యాఖ్యలు చేసిన పార్వర్డ్ మేసేజ్ చేసినా ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యవహరించినా ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుందని ఎస్పి స్పష్టం చేశారు.

## ప్రమాదకరంగా సరిహద్దు బ్రిడ్జి

ప్రమాద అంచులో రహదారి?



ప్రజాపక్షం/నిజాంపేట్:గత2 నెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు రోడ్లు, మత్తడి, బ్రిడ్జు అతలాకుతులం అయిన విషయం విధితమే. నిజాంపేట మండలం నందగోకుల్ గ్రామం నుండి ఇస్సానగర్ వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న సరిహద్దు బ్రిడ్జిపై గుంత ఏర్పడి ప్రమాదాన్ని సంతరించుకుంది. ఆ గుంత కింది భాగంలో మట్టి పూర్తిగా కొట్టుకుపోయి రోజు రోజు పూర్తిగా కూలిపోతుంది. ఏ జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు మరమ్మత్తులు చేస్తారని సంశయంలో పడ్డారు. అధికారులు వెంటనే స్పందించి బ్రిడ్జి మరమ్మతులు చేపట్టాలని, సూచిక బోర్డు అమర్చి భారీ వాహనాలను వెళ్లకుండా చూడాలని వేడుకుంటున్నారు.

## నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించిన ఎమ్మెల్సీ కవిత



ప్రజాపక్షం/నిజాంసాగర్: ఎమ్మెల్సీ కవిత గురువారం జుక్కల్ నియోజకవర్గంలోని నిజాంసాగర్ ప్రాజెక్టును గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో పెద్ద దిక్కుగా నిజాంసాగర్ ప్రాజెక్టు ఉన్నప్పటికి ఈ ప్రాంతంలో సాగునీరు అందక, తాగునీరు రాక ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కేవలం వర్షాలపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారన్నారు. నూతనంగా నిర్మాణం చేపట్టిన నాగమడుగు లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు పథకం అస్తవ్యస్థంగా తయారైందన్నారు. తెలంగాణ జాగృతి బాటలో భాగంగా నిజాంసాగర్ ప్రాజెక్టు, నాగమడుగు ఎత్తిపోతల పథకాన్ని సందర్శించినట్లు చెప్పారు. అంతకుముందు ఆమె ప్రాజెక్టును సందర్శించి ఇంజనీర్ మీర్ నవాబ్‌అలీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగమడుగుపై ప్రభుత్వానికి స్పష్టమైన డిపిఆర్ లేదని ఆరోపించారు. దీని వలన 3 గ్రామాలు ముంపుకు గురయ్యే ఆస్కారం ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు వలన భూమి కోల్పోతున్న రైతులు తమకు చెల్లించిన నష్టపరిహారం సరిపోదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు 50 లక్షల పరిహారం చెల్లించాలని వారు కవితతో పేర్కొన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

## రుణ లక్ష్యాల్లో పురోగతి సాధించాలి: కలెక్టర్






ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :2025–26 వార్షిక రుణ లక్ష్యసాధనలో బ్యాంకర్లు పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన వార్షిక రెండవ త్రైమాసిక సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకుల వారీగా రుణాలు, లింకేజీ, వ్యవసాయ, పంట, గృహ, విద్యా రుణాలపై సమీక్షించారు. బ్యాంకర్లు నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష యోజన, అటల్ పెన్షన్, జన్ ధన్, ముద్ర, ఎస్సి, ట్రైకార్ రుణాల లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. వ్యవసాయ యంత్రాలు, సోలార్ ఫెన్సింగ్ వంటి వాటిపై రైతులకు రుణాలు అందించి ప్రోత్సహించాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేసి వారి ఆర్థిక బలోపేతానికి తోడ్పడాలని తెలిపారు. డిపిఎంలు, ఏపిఎంలు బ్యాంకు అధికారులను సంప్రదించి లక్ష్యాలు పూర్తి స్థాయిలో సాధించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎం రాజేశ్వర్ జోషి, ఆర్‌డిఐ ఎల్‌డిఒఒ శ్రీనివాస్, ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్ రితీష్ కుమార్ గుప్తా, నాబార్డ్ డిడిఎం వీరభద్రుడు, డిఆర్‌డిఒ దత్తారావు, డిటిడిఒ రమాదేవి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ అశోక్, మెప్మా పిడి మోతిరామ్, బ్యాంకు మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

**నామినేషన్ల స్వీకరణ పకడ్బందీగా చేపట్టాలి**

రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. గురువారం వాంకిడి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. నామినేషన్ పత్రాలను పరిశీలించి స్టేజ్1 రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. కేంద్రం ఎదుట వార్డుల వారీగా ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల వివరాలను ప్రదర్శించాలని సూచించారు. కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో గుంపులుగా ఎవరినీ అనుమతించవద్దని, అభ్యర్థులు, ప్రతిపాదించే వారిని మాత్రమే లోపలికి పంపాలని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, గుర్తుల కేటాయింపులో జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వాంకిడి తహశీల్దార్ రియాజ్ అలీ, ఎంపిడిఒ, సిఐ, మండల పంచాయతీ అధికారి జావిద్ తదితరులు పాల్గొన్నారు.


# రీల్




## అనిల్ రావిపూడి చేతుల మీదుగా 'అన్నగారు వస్తారు' టీజర్

స్టార్ హీరో కార్తి నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'వా వాతియార్' తెలుగు ప్రేక్షకుల ముందుకు 'అన్నగారు వస్తారు' టైటిల్ తో రాబోతోంది. ఈ సినిమా డిసెంబర్ లో వరల్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. 'అన్నగారు వస్తారు' చిత్రాన్ని ప్రెస్టీజియస్ ప్రొడక్షన్ హౌస్ స్టూడియో గ్రీన్ బ్యానర్ లో కె.ఇ. జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. యాక్షన్ కామెడీ కథతో దర్శకుడు నలన్ కుమారస్వామి రూపొందిస్తున్నారు. కృతి శెట్టి హీరోయిన్ గా నటిస్తోంది. ఈ నెల 28న సాయంత్రం 5.04 నిమిషాలకు బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి చేతుల మీదుగా 'అన్నగారు వస్తారు' సినిమా టీజర్ ను రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ గా హీరో కార్తి నటిస్తున్న 'అన్నగారు వస్తారు' సినిమా పాన్ ఇండియా స్థాయిలో మూవీ లవర్స్ దృష్టిని ఆకర్షిస్తోంది. కార్తి కెరీర్ లో ఈ సినిమా మరో బ్లాక్ బస్టర్ అవుతుందనే ఎక్స్ పెక్టేషన్స్ ఏర్పడుతున్నాయి. కార్తి, కృతి శెట్టి, సత్యరాజ్, మధూర్ మిట్టల్, ఆనంద్ రాజ్, రాజ్ కిరణ్, శిల్పా మంజునాథ్, కరుణాకరన్, తదితరులు నటిస్తున్నారు.

## 'వనజీవి రామయ్య'గా బ్రహ్మాజీ



ప్రముఖ నటుడు బ్రహ్మాజీ హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. సమాజంలో చెట్లను పెంచాలనే ఉద్దేశంతో జీవిత కాలం పని చేసిన వనజీవి రామయ్య జీవిత చరిత్రను తెరకెక్కిస్తున్నారు. వనజీవి రామయ్య పాత్రను నటుడు బ్రహ్మాజీ నటిస్తున్నారు. ఖమ్మం బల్లేపల్లిలో జరిగిన షూటింగ్ ప్రారంభోత్సవంలో ఐ ఎఫ్ ఎస్ అధికారి విక్రమ్ సింగ్ క్లాప్ కొట్టారు. ఫీమేల్ నీరజ కెమెరా స్విచాన్ చేశారు. డివిజన్ కార్పొరేటర్లు హుస్సేన్, మలీదు వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు నరపూడి సతీష్, మట్ట సతీష్ , వనజీవి రామయ్య ఫ్యామిలీ మెంబర్స్ అతిథులుగా హాజరయ్యారు. బ్రహ్మాజీ సరసన నటి రాణి హీరోయిన్ గా నటిస్తున్నారు. సమాజానికి ఒక మంచి సందేశం ఇచ్చేలా ఈ సినిమాను రూపొందిస్తున్నామని దర్శకుడు వేముగంటి తెలిపారు. ఈ చిత్రానికి నిర్మాత లింగంపల్లి చంద్రశేఖర్ రావు , సినిమాటోగ్రఫీ తేజ వి రమణ ,సంగీతం బల్లేపల్లి మోహన్ , రచన డాక్టర్ కరుణాకర్, రచన సహకారం జి. రాంబాబు, సాహిత్యం ఘనయాది, లైన్ ప్రొడ్యూసర్ డి.రవీంద్రనాథ్ , ఎడిటర్ దాము పని చేస్తున్నారు.

## కామెడీ క్రైం సినిమా 'రివాల్వర్ రీటా'



నేషనల్ అవార్డ్ విన్నింగ్ హీరోయిన్ కీర్తి సురేష్ టైటిల్ రోల్ లో నటిస్తున్న క్రైమ్ కామెడీ ఎంటర్ టైనర్ 'రివాల్వర్ రీటా'. జేకే చంద్రు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సుధన్ సుందరం , జగదీష్ పళనిసామి నిర్మించారు. రాధికా శరత్కుమార్, అజయ్ ఘోష్, కీలక పాత్రలు పోషించారు. నవంబర్ 28న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. హీరోయిన్ కీర్తి సురేష్ మాట్లాడుతూ. అజయ్ ఘోష్ తో వర్క్ చేయడం చాలా ఆనందంగా అనిపించింది. అలాగే ఇందులో సునీల్ చాలా డిఫరెంట్ రోల్ చేశారు. మీరందరూ చాలా ఎంజాయ్ చేస్తారు. ఇందులో రాధిక చాలా చక్కని పాత్ర చేశారు. మా ఇద్దరికి కెమిస్ట్రీ చాలా బాగుంటుంది. ఇది పర్ఫెక్ట్ డార్క్ కామెడీ ఫిలిం. ఇప్పటివరకు చాలా డార్క్ కామెడీ సినిమాలు చూసుంటారు. కానీ ఇది ఫిమేల్ లీడ్ చేస్తున్న డార్క్ కామెడీ ఫిలిం. తప్పకుండా మీరందరూ ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నాను. ఇది ఒక్క రోజులో జరిగే కథ. చాలా అద్భుతమైన పాత్రలు ఉన్నాయి. 28న రిలీజ్ అవుతుంది. తప్పకుండా అందరూ చూసి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను.అజయ్ ఘోష్ మాట్లాడుతూ రంగస్థలం పుష్ప తర్వాత అంత ఆనందంగా అనిపించిన సినిమా ఇది. మహానటి సావిత్రి పాత్రలో నవరసాలు పండించిన కీర్తి సురేష్ గారితో కలిసి సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. సమంత గారు కీర్తి సురేష్ వీళ్ళిద్దరే నాకు ఇండస్ట్రీలో ఇష్టమైన హీరోయిన్స్. కీర్తి ఎంతో నమ్రతతో ఉంటారు. షూటింగ్ చివరి రోజు స్వయంగా ఆమెనే పిలిచి ఫోటోలు తీసుకున్నారు. ఇది చాలా గొప్ప విషయం. ఈ సినిమా చాలా అద్భుతమైన కథ. డైరెక్టర్ చంద్రు గారు చాలా అద్భుతంగా సినిమాను తీశారు. ఈ సినిమాలో కీర్తి యాక్షన్ మీరు డెఫినెట్గా ఎంజాయ్ చేస్తారు. ఇందులో ఒక కొత్త సునీల్ ని చూస్తారు. ఈ సినిమా తప్పకుండా మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను. డిస్ట్రిబ్యూటర్ కుమార్ కూడా పాల్గొన్నారు.

## 70 మిలియన్లు దాటిన మీసాలపిల్ల పాట




మెగాస్టార్ చిరంజీవి, నయనతార హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా మన శంకర వరప్రసాద్ గారు. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలోని మీసాల పిల్ల అనే పాటను ఇటీవల విడుదల చేశారు. భీమ్స్ సంగీతం అందించగా, ఈ పాటను భాస్కర భట్ల రవికుమార్ రాశారు. అయితే ఈ సినిమా పాట విడుదల రోజు నుంచి ఇప్పటి వరకు 70 మిలియన్ల వ్యూస్ దాటినట్టు సినిమా వర్గాలు తెలిపాయి. సోషల్ మీడియాలో టాప్ ట్రెండింగ్లో ఈ సాంగ్ ఉన్నట్లు మ్యూజిక్ ఇండస్ట్రీ చెబుతోంది. ఈ సినిమా షూటింగ్ రెగ్యులర్‌గా జరుగుతోంది. ఇటీవలే ఈ పాటను చిరంజీవి, నయనతారలపై చిత్రీకరించారు. చిరంజీవితో పాటు చిత్రంలోని ఇతర తారాగణంపై కీలకమైన సన్నివేశాలను కూడా చిత్రీకరించారు. కొంత భాగం మినహా ఈ చిత్రం షూటింగ్ దాదాపూర్తి కావచ్చింది. అన్ని పనులు పూర్తి చేసి వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమాను విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు. హీరో వెంకటేష్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. వెంకటేష్ కు సంబంధించిన సన్నివేశాలను కూడా చిత్రీకరించారు. క్యాథరిన్ థెరిసా కూడా ఇందులో మంచి క్యారెక్టర్ లో కనిపిస్తోంది. చిరంజీవి కుమార్తె సుస్మిత కొణిదెల, సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

## ఘట్టమనేని జయకృష్ణ సినిమా 'శ్రీనివాస మంగాపురం'

సూపర్ స్టార్ దివంగత కృష్ణ మనవడు, దివంగత రమేష్ బాబు కుమారుడు ఘట్టమనేని జయకృష్ణ హీరోగా నటిస్తున్న సినిమా షూటింగ్ రెగ్యులర్ గా జరుగుతోంది. ఆర్ ఎక్స్ 100, మంగళవారం వంటి సక్సెస్ ఫుల్ సినిమాలు తెరకెక్కించిన అజయ్ భూపతి దర్శకత్వంలో జయకృష్ణ హీరోగా పరిచయం అవుతున్నారు. అయితే ఈ సినిమాకు ''శ్రీనివాస్ మంగాపురం'' అనే టైటిల్ ను ఖరారు చేసినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ టైటిల్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ గా చక్కర్లు కొడుతోంది. రెండు జీవితాలు, ఒకటే ప్రయాణం రెండు చేతులు, ఒకటే ప్రమాణంరెండు మనసులు, ఒకటే విధి అనేదే ఈ సినిమా కథగా తెరకెక్కిస్తున్నారు. ప్రేమ కథలను తెరకెక్కించడంలో తనదైన శైలిని చూపిస్తున్న అజయ్ భూపతి ఈ సినిమాను చాలా గ్రాండ్ లెవల్లో రూపొందిస్తున్నట్టు ఇండస్ట్రీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. అశ్విని దత్ సమర్పణలో ఈ సినిమా నిర్మాణం జరుగుతోంది. జయకృష్ణ సరసన రాషతడని హీరోయిన్ గా నటిస్తోంది.




## నరేష్ అగస్త్య హీరోగా కొత్త చిత్రం ప్రారంభం



నరేష్ అగస్త్య హీరోగా చైతన్య గండికోట దర్శకత్వంలో డా.ఎం రాజేంద్ర నిర్మాణంలో ఓ కొత్త చిత్రం రూపొందుతోంది. శ్రేయ రుక్మిణి హీరోయిన్ గా నటిస్తున్నారు. జెన్ ఈ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెంబర్ 1గా రూపొందుతున్న కొత్త చిత్రం పూజా కార్యక్రమాలతో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం అయ్యింది. ఈ షూటింగ్ ముహూర్త కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ సునీల్ శర్మ, ఆయన భార్య షాలిని శర్మ దర్శక నిర్మాతలకు స్క్రిప్ట్ అందించారు. హీరో శ్రీవిష్ణు క్లాప్ కొట్టారు. రఘుబాబు కెమరా స్విచాన్ చేయగా, డైరెక్టర్ బి. గోపాల్ ముహూర్తపు సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సినిమాకు మిక్కీ జె మేయర్ మ్యూజిక్ అందిస్తున్నారు. విద్యాసాగర్ చింతా డీవోపీగా పని చేస్తున్నారు. కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్. ప్రముఖ రచయిత లక్ష్మీ భూపాల ఈ చిత్రానికి డైలాగ్స్ అందిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.

## వనవాసం సాంగ్ రిలీజ్



బబుల్గమ్‌తో పరిచయం అయిన యాంకర్ సుమ కొడుకు హీరో రోషన్ కనకాల తన సెకండ్ మూవీ 'మోగ్లీ 2025' తో వస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత, కలర్ ఫోటో ఫేమ్ సందీప్ రాజ్ దర్శకత్వంలో, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన మోగ్లీ 2025 అడవి నేపథ్యంలో యూనిక్ రొమాంటిక్ గా సాగే యాక్షన్ డ్రామా. ఈ సినిమా గ్లింప్స్, టీజర్కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఫస్ట్ సింగిల్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. ఈ నేపథ్యంలో సెకండ్ సింగిల్ వనవాసం పాటను రిలీజ్ చేశారు.కాల భైరవ స్వరపరిచిన ఈ పాటకు కళ్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. ఇతిహాస వైభవాన్ని, ఆధునిక ప్రేమసంఘర్షణ కథను అద్భుతంగా మేళవిస్తూ కవితాత్మకంగా రాశారు. శ్రీరాముడు సీతమ్మ వారిని రక్షించేందుకు యుద్ధానికి వెళ్లినట్లే& హీరో కూడా తన ప్రేమను కాపాడేందుకు సిద్ధం అవుతున్నాడనే భావనను జోడించి పాట రాశారు. రోషన్, సాక్షి మడోల్కర్ కెమిస్ట్రీ అందంగా కనిపిస్తుంది. బండి సరోజ్ కుమార్ పవర్ ఫుల్ విలన్ గా కనిపించగా, వైవా హర్ష హీరో మిత్రుడిగా వినోదాన్ని పంచుతున్నారు.సినిమాటోగ్రాఫర్ రామ మారుతి ఎం విజువల్స్ అందించారు. ఎడిటింగ్ను కోదాటి పవన్ కళ్యాణ్ పర్యవేక్షించారు. కిరణ్ మామిడి ప్రొడక్షన్ డిజైనర్, నటరాజ్ మాదిగొండ యాక్షన్ కొరియోగ్రాఫ్ గా చేశారు. ఈ చిత్రం డిసెంబర్ 12న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది.

## అభివృద్ధే టార్గెట్

(మొదటి పేజీ తరువాయి)

రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ ( రేర్) గా మూడు రీజియన్లను విభజించుకోవాలని సూచించారు. ఈ మూడు రీజియన్లలో ఎక్కడెక్కడ ఎలాంటి అభివృద్ధి ఉండాలో డాక్యుమెంట్‌లో పొందుపరచాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ ఉండదని చాటి చెప్పేలా తెలంగాణ రైసింగ్ పాలసీ డాక్యుమెంట్ ఉండాలన్నారు. వాస్తవిక దృక్పథం కనిపించేలా డిజైన్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గురువారం 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్2025'పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, మహ్మద్ అజారుద్దీన్, సీతక్క ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ చైనా, జపాన్‌ల స్థాయి అభివృద్ధే టార్గెట్ అని, ప్రపంచంతోనే పోటీపడే విధంగా స్కిల్ యూత్ ఉండాలన్నారు. కొత్త రంగాల్లో, కొంగొత్త మార్గాల అన్వేషణ జరగాలన్నారు. హెల్త్, ఎడ్యుకేషన్, టెక్నాలజీ, జిసిసిలు, ఫార్మా, అగ్రికల్చర్.. తో పాటు వివిధ రంగాల్లో ఎక్కడెక్కడ ఏయె రంగం అభివృద్ధి ఉండాలో ప్రణాళిక రూపొందించాలన్నారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రోడ్, పోర్ట్, కనెక్టివిటీ ముఖ్యమైనవన్నారు. సంక్షేమం, టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, ఎనర్జీ డిపార్ట్ మెంట్.. ఇలా ప్రతీ రంగానికి సంబంధించి పాలసీ డాక్యుమెంట్ లో స్పష్టత ఉండాలన్నారు. తెలంగాణ పాలసీ, భవిష్యత్ ప్రణాళికలు వివరించేలా పాలసీ డాక్యుమెంట్ ఉండాలన్నారు. కొత్తగా ఏర్పాటయ్యే ఎయిర్ పోర్టులలో ప్రయాణీకులతో పాటు కార్గో సర్వీసెస్ కూడా అందుబాటులో ఉంచేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. హైదరాబాద్ కోర్ అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ తెలంగాణను మూడు జోన్లుగా అభివృద్ధి సమతుల్యత సాధించాలని ప్రభుత్వం భావిస్తోంది. అదేసమయంలో గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలోపేతం చేసేందుకు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేలా వ్యవసాయ కార్యాచరణ కూడా విజన్ డాక్యుమెంట్ లో భాగమౌతోందన్నారు.

## సోదరభావం ప్రదర్శించండి

(మొదటి పేజీ తరువాయి)

ఆయన విదేశీ పర్యటనకు వెళ్ళారు. టర్కీలోని ఇజ్నిక్ నగరంలో పురాతన కౌన్సిల్ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన వెళ్ళారు. ఈ సందర్భంగా రాజధాని అంకారాలో పోప్‌కు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు శాంతి సందేశం పంచిపెట్టారు. ప్రపంచంలో ప్రజలు అందరూ నిజమైన సోదరీ, సోదరులుగా ప్రవర్తించాలని, శాంతి మార్గాన్ని అనుసరించాలని కోరారు. భిన్న మతాలు, ఆచారాలు, నమ్మకాలు, వైరుధ్యాలు ఉన్నప్పటికీ ప్రజలు సోదరభావంతో మెలగాలని పిలుపు ఇచ్చారు. టర్కీలో పురాతన నగరం నైసియా ఉన్న ప్రదేశంలోని ఇజ్నిక్‌లో 1700 సంవత్సరాల క్రితం పురాతన క్రిస్టియన్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఆ సందర్భాన్ని స్మరించుకుంటూ పోప్‌తోపాటు ఇతర క్రైస్తవ గురువులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. క్రీస్తుశకం 325 ఎ.డి (ఎన్నో డెమినీ)లో ఈ ప్రాంతంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఇతర పలు నిర్ణయాలతోపాటు ''యేసు దైవ కుమారుడు'' అని నిర్ధారిస్తూ ఒక తీర్మానం చేశారు. ఆ తర్వాత దీనిని ''నైసీడ్ క్రీడ్'' అని పిలుస్తున్నారు. అదేవిధంగా గతంలో టర్కీని సందర్శించిన పూర్వ పోప్‌లు పోప్ ఫ్రాన్సిస్, పోప్ బెనెడిక్ట్–16లు చేసిన విధంగానే పోప్ లియో–14 ఈ ప్రాంతంలో ఉన్న బ్లూ మసీదును కూడా సందర్శిస్తారు. టర్కీ పర్యటన తర్వాత ఆయన లెబనాన్‌కు బయలుదేరి వెళతారు. రాధాని బీరూట్‌పై ఇజ్రాయెల్ బాంబు దాడులు చేసిన తర్వాత కొద్ది రోజులకే పోప్ లియో లెబనాన్‌లో పర్యటనకు వెళుతున్నారు. వాస్తవానికి ఇంతకుముందు వాటికన్‌సిటీ అధిపతి పోప్ ఫ్రాన్సిస్ టర్కీ,లెబనాన్‌లలో పర్యటించేందుకు కార్యక్రమాన్ని నిర్దేశించారు. కానీ అనారోగ్యం వల్ల ఆయన మరణించారు. ఆయన పర్యటన కార్యక్రమాల కొనసాగింపులో భాగంగా పోప్ లియో టర్కీ,లెబనాన్‌లను సందర్శిస్తున్నారు.

# లేబర్ కోడ్స్ అమలు చేసేదిలేదు

**• కేరళ మంత్రి శివన్‌కుట్టి స్పష్టీకరణ • రాష్ట్రంలో లేబర్ కోడ్స్ చట్టాలకు ఆలోచన • దేశంలో కార్మికశాఖల మంత్రులు,సంఘాలతో • వచ్చేనెల 19న కేరళలో ప్రత్యేక సమావేశం**



**తిరువనంతపురం:** కార్మికులను అణచివేతకు గురిచేసే కేంద్ర ప్రభుత్వ 'లేబర్ కోడ్స్'ను రాష్ట్రంలో అమలు చేయబోమని కేరళ కార్మికశాఖామంత్రి వి.శివన్‌కుట్టి స్పష్టం చేశారు. ఈ నాలుగు లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని అడగాలని కార్మిక సంఘాల సమావేశం తీర్మానం చేసినట్లు చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాల కార్మికశాఖామంత్రులు, కేంద్ర కార్మిక సంఘాల నాయకులను కేరళకు ఆహ్వానించి లేబర్ కోడ్స్ ఉపసంహరణపై డిసెంబరు 19వ తేదీన రోజంతా చర్చల సమాలోచన చేయాలని కూడా తీర్మానించినట్లు చెప్పారు. దేశంలోని అనేక రాష్ట్రాలు లేబర్ కోడ్స్‌ను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ కేరళలో మాత్రం అమలు చేసేదిలేదని గురువారం తిరువనంతపురంలో పాత్రికేయులకు మంత్రి శివన్‌కుట్టి చెప్పారు. దేశవ్యాప్తంగా నవంబరు 21వ తేదీ నుండి నాలుగు కొత్త లేబర్ కోడ్స్ అమలులోకి తెచ్చినట్లు నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రకటించింది. అనేక దశాబ్దాలుగా కార్మికులు పోరాటాల ద్వారా దశలవారీగా సంపాదించుకున్న హక్కులు 29 చట్టాలుగా ఉన్నాయి. కానీ యాజమాన్యాలకు అనుకూలంగా మార్చేందుకు ఈ చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా సంక్షిప్తీకరించి కేంద్రం చట్టరూపంలోకి తీసుకువచ్చింది. కేరళమంత్రి శివన్‌కుట్టి గురువారం మధ్యాహ్నం నుండి వివిధ కార్మిక సంఘాల నాయకులతో లేబర్ కోడ్స్ అమలుపై సమావేశం నిర్వహించారు. నాలుగు లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని సమావేశంలో ఒక తీర్మానం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎవరినీ సంప్రదించకుండా, కార్మిక సంఘాలతో సమగ్ర చర్చలు జరపకుండా,దేశంలో కార్మికుల సమస్యలను సరిగ్గా అర్థం చేసుకోకుండా ఏకపక్షంగా లేబర్ కోడ్స్‌ను చట్ట రూపంలోకి తీసుకువచ్చిందని, అందువల్ల వీటిని ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని అడగాలని కార్మిక సంఘాల సమావేశం తీర్మానం చేసినట్లు మంత్రి చెప్పారు.''వచ్చేనెల 19న కేరళలో జరిగే సమాలోచన చర్చల్లో దాదాపు 100 మంది పైగా పాల్గొంటారని ఆశిస్తున్నాం, ఈ సమావేశం లో విస్తారంగా చర్చలు జరుగుతాయి, కేంద్రంతో సంబంధం లేకుండా రాష్ట్రాలు ప్రత్యేకంగా లేబర్ కోడ్స్‌ను తయారు చేసి చట్టరూపం ఇవ్వవచ్చా? ఈ సమస్యకు ఎలాంటి పరిష్కారం సాధించగలం? అనే విషయాలను ఈ సమావేశంలో క్షుణ్ణంగా చర్చిస్తామని చెప్పారు. కార్మికుల విషయాలన్నీ రాష్ట్రాలలోని ప్రభుత్వాలకు సంబంధించినవని, అందువల్ల దీనిపై రాష్ట్రాలలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు జోక్యం చేసుకోవచ్చునని శివన్‌కుట్టి చెప్పారు. ''న్యాయ,కార్మికరంగ నిపుణులు కూడా వచ్చేనెల జరిగే సమావేశంలో పాల్గొంటారు, వారి అభిప్రాయాలు కూడా తీసుకుంటాం, వారిని సంప్రదించి సలహాలు తీసుకుంటాం'' అని మంత్రి చెప్పారు. బుధవారం (నవంబరు 26) దేశవ్యాప్తంగా జరిగిన నిరసన ప్రదర్శనల్లో చేతికి నల్లబ్యాడ్జీలు ధరించి పాల్గొన్న వారి పేర్లు ఏమిటో వివరాలు తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వం ఆరా తీస్తోందని చెప్పారు. ఈ విధమైన చర్యలు కార్మికులను భయపెట్టి వారిపై తీవ్రమైన ఒత్తిడి తీసుకురావడంకోసమేనని,ఈ విధమైన చర్యలను కేరళలో ఉన్న వామపక్ష ప్రభుత్వం అనుమతించబోదని, వాటిని సాగనివ్వబోమని స్పష్టం చేశారు. 2021లోని లేబర్‌కోడ్స్‌కు సంబంధించి రాష్ట్రాలు తయారు చేస్తున్న ముసాయిదా లేబర్ కోడ్స్ గురించి పాత్రికేయులు ప్రశ్నించగా, ఇది కేవలం ఒక ముసాయిదా మాత్రమేనని, తదుపరి నిర్ణయాలు జరిగే వరకూ అది అలాగే ఉంటుందని చెప్పారు. నాలుగు లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోవాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి ఒక ఈ మెయిల్ సందేశం పంపించామని, డిసెంబరు 19న దేశవ్యాప్తంగా కార్మిక శాఖల మంత్రులు, కేంద్ర కార్మిక సంఘాల నాయకులతో చర్చల తర్వాత ఆ నిర్ణయాలకు అనుగుణంగా తాము వ్యక్తిగతంగా కేంద్ర నాయకులను కలిసి అన్ని విషయాలు వివరిస్తామని చెప్పారు. గతనెలలో కేంద్ర కార్మికమంత్రిత్వ శాఖ ఒక సమావేశానికి పిలిచిందని, ఈ సమావేశంలో లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోవాల్సిందిగా తాము కేరళ ప్రభుత్వం తరపున చాలా స్పష్టంగా తెలియజేశామని తొలుత మంత్రి చెప్పారు. ఈ లేబర్ కోడ్స్ అమలుపై తమ వైఖరిని కూడా తెలియజేశామన్నారు. రాష్ట్రం ప్రత్యేకించి లేబర్ కోడ్స్ ముసాయిదా ను తయారు చేయడంపై కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే తీవ్రమైన ఒత్తిడిని రాష్ట్ర ప్రభుత్వం తట్టుకుని నిలబడుతుందా? లేక అందుకు తలొగ్గుతుందా? అని పాత్రికేయులు ప్రశ్నించగా అలాంటిదేమీ ఉండదన్నారు. ''ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ఒత్తిడికి మేం తలొగ్గేటట్లయితే, కేంద్రం కోరుకున్నవిధంగా మేం వారికి ఒక అంగీకార లేఖనే అందజేసి ఉండేవాళ్ళమని, కానీ లేబర్ కోడ్స్ అమలుకు తాము సిద్ధంగా లేమని, అందుకు వామపక్ష ప్రభుత్వం అంగీకరించబోదని సమాధానం చెప్పారు. 2021 డిసెంబరు 14వ తేదీన రాష్ట్రంలో ఈ ముసాయిదా తీర్మానానికి ఆమోదం లభించింది. ఈ తీర్మానాన్ని రహస్యంగా తయారు చేయలేదని, చాలా బహిరంగంగానే ఈ తీర్మానాన్ని తయారు చేశామని చెప్పారు. దీనిపై ప్రజల అభిప్రాయాన్ని కోరామన్నారు. ఐతే తదుపరి చర్యలన్నింటినీ ఆపేశామన్నారు. దీనికి సంబంధించి తడచిన మూడు సంవత్సరాలుగా తాము ఎలాంటి చర్యలూ తీసుకోలేదనీ, అందువల్ల ఆ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే నాలుగు లేబర్‌కోడ్‌లను అధికారికంగా నోటిఫై చేసింది. దేశంలోని కార్మిక చట్టాలలో యాజమాన్యాలకు అనుకూలంగా భారీ సంస్కరణలు తెచ్చేందుకు ఉద్దేశించిన ఈ లేబర్ కోడ్స్ 2020 నుండి కేంద్రం వద్ద అపరిష్కృతంగా ఉన్నాయి. గిగ్ వర్కర్స్‌కు సార్వత్రిక సామాజిక భద్రత, కార్మికులందరికీ అనివార్యంగా చట్టబద్ధమైన నియామక పత్రాలు, చట్టబద్ధమైన కనీస వేతనాలు, సకాలంలో వేతనాల చెల్లింపులు వంటి అనేక అంశాలు ఇందులో ఉన్నాయి. ఈ లేబర్ కోడ్స్‌ను అమలు చేసి కేరళ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా ఎలాంటి చర్యలూ తీసుకోబోదని ముందురోజు బుధవారం మంత్రి శివన్‌కుట్టి చెప్పారు.

## 'స్కైరూట్' వాహకనౌక

(మొదటి పేజీ తరువాయి)

ఆర్బిటల్ రాకెట్ విక్రమ్–1 వాహకనౌకకు అంతరిక్షంలోకి ఉపగ్రహాలను ప్రవేశపెట్టగల శక్తిసామర్థ్యాలు ఉన్నాయి.దేశంలో రోజు రోజుకూ గొప్ప ఆవిష్కరణలతో పురోగతి సాధిస్తున్న జనరేషన్–జెడ్‌పై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశంసల వర్షం కురిపించారు. జనరేషన్–జెడ్ ఇంజనీర్లు, జనరేషన్–జెడ్ డిజైనర్లు, జనరేషన్–జెడ్ కోడర్స్, జనరేషన్–జెడ్ సైంటిస్టులు దేశంకోసం కొత్త కొత్త సాంకేతికతలను సృష్టిస్తున్నారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం చరిత్రాత్మకమైన రీతిలో అంతరిక్ష రంగ సంస్కరణలు ప్రారంభించిందని, ప్రైవేటు నిర్వాహకులకోసం దేశ అంతరిక్ష రంగ తలుపులు బార్లా తెరచి ఆహ్వానించిందన్నారు. తత్ఫలితంగా స్కైరూట్ సహా ఇతర అనేక అంకుర సంస్థలు ముందుకు వచ్చాయన్నారు. దేశంలో ఈనాడు 300కు పైగా అంతరిక్ష అంకుర సంస్థలు కొత్త ఆవిష్కరణల కోసం, రోదసీ అన్వేషణలకోసం అభివృద్ధి చెందుతున్నాయన్నారు. హైదరాబాద్ కేంద్రంగా రూపుదిద్దుకున్న ''ద ఇన్ఫినిటీ క్యాంపస్ సరికొత్త ఆలోచనలను ప్రతిబింబిస్తోందని, నవీన ఆవిష్కరణలకు అవకాశం ఇస్తోందని, అత్యంత భారీస్థాయిలో యువశక్తికి ఊపిరిలూదుతోందన్నారు. అపాయాలను కూడా శక్తిసామర్థ్యాలతో దాటుకుని ముందుకు వెళ్ళే ఔత్సాహిక సంస్థలు సరికొత్త శిఖరాలను అధిరోహిస్తున్నాయన్నారు. భారతదేశంలో ప్రైవేటురంగంలోని నైపుణ్యం ప్రపంచవ్యాప్తంగా తనదైన సొంత గుర్తింపు సాధించుకుంటున్నదన్నారు. భారత అంతరిక్ష రంగం ఈనాడు ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులకు ఎంతో ఆకర్షణీయమైన ఒక కేంద్రంగా మారిందన్నారు. భారతదేశం మొదటిసారి తన అంతరిక్ష యాత్రను చాలా తక్కువ వనరులతో ప్రారంభించి ఈనాడు సమున్నతస్థానాలకు చేరుకుంటున్నదని, మన తొలి రాకెట్‌ను సైకిలుమీద మోసుకుని తీసుకువెళ్ళామని, ఈనాడు రోదసీ అన్వేషణకు సమాయత్తమయ్యామని చెప్పారు. మన ప్రయాణం చాలా తక్కువ వనరులతో ప్రారంభం కావచ్చు, కానీ మన వృద్ధి మన కృతనిశ్చయాన్ని రుజువుచేస్తుంది, అదే మన కలలను సాకారం చేస్తుంది అన్నారు. స్కైరూట్ క్యాంపస్‌ను రెండు లక్షల అడుగు విస్తీర్ణంలో కార్యకలాపాల నిర్వహణకు సిద్ధం చేశారు. దేశంలోని స్పేస్ కంపెనీలలో స్కైరూట్ ఎంతో అగ్రస్థానంలో ఉన్న కేంద్రంగా రూపొందింది. ఇస్రోలో పనిచేసిన మాజీ శాస్త్రవేత్తలు, ఐఐటి పూర్వ విద్యార్థులు భరత్ దాకా, పవన్ చందన ఇద్దరూ ఈ స్కైరూట్ కంపెనీని స్థాపించారు. 2022 నవంబరులో స్కైరూట్ తన మొదటి అనుబంధ రాకెట్ విక్రమ్–ఎస్‌ను ప్రయోగించింది.

### భవిష్యత్‌లో రూ.1000 కోట్లు స్కైరూట్ పెట్టుబడులు : భరత్

రాబోయే కాలంలో స్కైరూట్ కంపెనీ అంతరిక్ష రంగంలో రూ.1000 కోట్ల మేరకు పెట్టుబడులు సమకూర్చాలనే లక్ష్యంతో ఉందని కంపెనీ సహ వ్యవస్థాపకుడు నాగ భరత్ దాకా చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారంనాడు దృశ్యమాధ్యమ విధానం ద్వారా స్కైరూట్ క్యాంపస్‌ను, దానికి సంబంధించిన మొట్టమొదటి వాహకనౌక విక్రమ్–1ను ప్రారంభించి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భరత్ దాకా మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్ణయాత్మకంగా అంతరిక్షరంగ సంస్కరణలు చేస్తున్నారని, ప్రైవేటు రంగానికి తలుపులు బార్లా తెరిచారని అన్నారు. ఈనాడు స్కైరూట్ 0000కు పైగా హైటెక్ ఉద్యోగాలను సృష్టించిందని, సమీప భవిష్యత్తులో రూ.1000 కోట్లు పైగా పెట్టుబడులను సమకూర్చనున్నదని చెప్పారు. అదేవిధంగా స్కైరూట్ సిఇఓ, సహ వ్యవస్థాపకులు పవన్ కుమార్ చందన మాట్లాడుతూ, విక్రమ్–1 భారతదేశ ప్రైవేటు రంగంలో తయారైన మొట్టమొదటి వాహకనౌక అన్నారు. దీనిని ప్రధానమంత్రి మోదీ గురువారంనాడు ఆవిష్కరించారని చెప్పారు. విక్రమ్–1ను స్కైరూట్ నాలుగు సంవత్సరాలు కష్టపడి తయారు చేసిందన్నారు. పూర్తిగా కార్బన్ ఫైబర్‌తో ఈ వాహనాన్ని తయారు చేశామన్నారు. శక్తిసామర్థ్యం,పటిష్టత,పనితీరులో ఎంతో గొప్పతనం ఉంటుందని, త్రీ డీ ప్రింటింగ్ హైపర్‌గోలిక్ ఇంజనర్లతో ఇది పనిచేస్తుందన్నారు.

## చేశాయ్

(మొదటి పేజీ తరువాయి)

సాక్ష్యాలుగా చూపించి ఈ దేశాల్లో సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం జరిగిందని విమర్శించింది. భారత్‌లోని ''రిపబ్లికన్ టీవీ' గుర్తు తెలియని అఫ్గానిస్థాన్ సోషల్ మీడియా వనరులపై ఆధారపడి దుష్ప్రచారం ప్రారంభించిందని, ఆదిలియా జైలులోకి పిటిఐ కార్యకర్తలు దూసుకువెళ్ళారంటూ పాకిస్థాన్‌లో అశాంతి రెచ్చగొట్టేందుకు పదే పదే ప్రచారం చేశారని, ఆ తర్వాత ఇతర మీడియా కూడా ఎలాంటి క్రాస్ చెకింగ్ లేకుండా దుష్ప్రచారం కొనసాగించాయని మంత్రిత్వ శాఖ ఆరోపణలు చేసింది. ఇదిలా ఉండగా ఇమ్రాన్‌ఖాన్ క్షేమంగా ఉన్నారని పాకిస్థాన్ రావల్పిండి జైలు అధికారులు వివరణ ఇచ్చారు. జైలు నుండి ఆయనను బయటకు తరలించారంటూ వచ్చిన వార్తల్లో నిజం లేదు, ఆయన పూర్తి ఆరోగ్యంతో ఉన్నారు, ఆయనకు వైద్య సహాయం అందుతోంది అని అధికారులు పేర్కొన్నారు. పాకిస్థాన్ రక్షణమంత్రి ఆసిఫ్ కూడా ఇదేవిధమైన ప్రకటన చేశారు. ఇమ్రాన్‌ఖాన్‌ను ఆత్మీయ కుటుంబ సభ్యులుకూడా చూడనివ్వకుండా జైలు అధికారులు నెలరోజులుగా నిషేధం అమలు చేస్తున్నారని బుధవారం మధ్యాహ్నం వార్తలు వెలువడ్డాయి. ఆయన ముగ్గురు సోదరీమణులు నూరుల్ ఖాన్, అలీమాఖాన్, ఉజ్మాఖాన్‌లు సహా పార్టీ మద్దతుదారులు జైలు వెలుపల శాంతియుతంగా కూర్చుని నినాదాలు చేస్తుండగా జైలు సిబ్బంది వారిని కొట్టి తరిమేశారని వార్తలు వచ్చాయి. ఇమ్రాన్‌ఖాన్ ఎక్కడ ఉన్నారో భౌతికంగా తమకు చూపించాలని జైలు అధికారులను డిమాండ్ చేస్తున్నారనీ, కానీ అధికారులు ఆయనను చూపించేందుకు నిరాకరిస్తున్నారనీ వార్తలు వచ్చాయి. ఇమ్రాన్‌ఖాన్ 2023 నుండీ రావల్పిండి అడియాలా జైలులో శిక్ష అనుభవిస్తున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com